

నంది పత్రిక

మా కలం - సామాన్యుడి బలం

GSTIN 37AMRPM5719R1ZX

జాతీయ తెలుగు దిన పత్రిక

RNI-APTEL/2023/88162



ఎడిటర్: మహేష్ యాదవ్ | ఆంధ్ర ప్రదేశ్ , తెలంగాణ | సంపుటి : 4 | No: KNL/3-77(D)/2026-2030 | సంచిక : 312 | మంగళవారం 24 - నవంబర్ - 2026 | పేజీలు : 12 | వెల-3

Published From : KURNOOL circulated at Nandyal Alluri SitharamaRaju,Anakapalli,Anantapur,Annamayya,Bapatla,Chittoor, Konaseema,East Godavari,Eluru,Guntur,Kakinada,Krishna,,NTR, Palnadu,Parvathipuram Manyam,Prakasam,Nellore,Sri Sathya Sai,Srikakulam,Tirupati,Visakhapatnam,Vizianagaram,West Godavari, YSR Kadapa,Hyderabad,Ranga Reddy,Medchal-Malkajgiri,Warangal,Hanamkonda,Nizamabad,Karimnagar, Khammam,

పిఠాపురం జనసేనలో అసమ్మతి

వైస్ ఛైర్మన్ పదవిపై రచ్చ, ఎంపీ పీఏపై దాడికి యత్నం!



పిఠాపురం మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఎంపికపై వివాదం 2లో

బొజ్జా వెంకటేశ్వరరావు అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తూ నిరసనలు

ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ పీఏపై దాడికి యత్నం

మున్సిపల్ కార్యాలయం వద్ద భారీగా పోలీసుల మోహరింపు

పిఠాపురం నియోజకవర్గంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఎన్నికల ప్రక్రియ సందర్భంగా అభ్యర్థి ఎంపిక వ్యవహారం జనసేన కౌన్సిలర్లలో తీవ్ర అసమ్మతికి దారితీసింది. పార్టీ తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పలువురు కౌన్సిలర్లు రోడ్డెక్కడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

కాంగ్రెస్-ఎస్పీ తొలి భేటీ..

పొవ్వుగంట మాత్రమే..

130 సీట్లపై కాంగ్రెస్ పట్టు!



సీట్ల పంపకంపై.. పీఠముడి!

మంగళవారం మరో విడత చర్చలు

యూపీ అసెంబ్లీ ఎన్నికల సీట్ల సర్దుబాటుపై కాంగ్రెస్ఎస్పీ తొలి భేటీ..

ప్రతి జిల్లాలోనూ కనీసం ఒక స్థానం కోరిన హస్తం పార్టీ..

అమేథీ, రాయ్‌బరేలీపై ప్రత్యేక దృష్టి.. రేపు మరో విడత చర్చలు..

రెండు మూడు రోజుల్లో తుది ఒప్పందంపై ఆశాభావం 2లో

ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ.. రాజకీయ పార్టీల మధ్య పొత్తులు, సీట్ల పంపకాల కసరత్తు అప్పుడే వేడెక్కుతోంది. 2027 ఎన్నికల్లో కలిసి పోటీ చేయాలని భావిస్తున్న కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) మధ్య సీట్ల సర్దుబాటు చర్చలు కీలక దశకు చేరాయి. సోమవారం ఢిల్లీలో జరిగిన తొలి అధికారిక భేటీ కేవలం 15 నిమిషాల్లోనే ముగిసింది. ఈ సమావేశంలో కాంగ్రెస్ సుమారు 130 అసెంబ్లీ స్థానాలతో కూడిన జాబితాను ఎస్పీ నేతలకు అందజేసింది. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలోనూ కనీసం ఒక స్థానంలో పోటీ చేసే అవకాశం కల్పించాలని కోరింది.

సంప్రదాయంగా తమకు బలమున్న అమేథీ, రాయ్‌బరేలీ జిల్లాల్లోని అన్ని అసెంబ్లీ స్థానాలపైనా హస్తం పార్టీ కన్నేసింది. అయితే కాంగ్రెస్ ప్రతిపాదనలపై ఎస్పీ వెంటనే ఎలాంటి కౌంటర్ జాబితాను ఇవ్వలేదు.

పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్‌తో చర్చించిన అనంతరం తమ అభిప్రాయాన్ని వెల్లడిస్తామని తెలిపింది. సమావేశం స్వల్ప వ్యవధిలో ముగిసినా.. చర్చలు సానుకూలంగా సాగాయని ఇరు పార్టీల నేతలు ప్రకటించారు. మంగళవారం మరో విడత చర్చలు జరగనుండగా.. రెండు మూడు రోజుల్లో సీట్ల పంపకాలపై తుది నిర్ణయం తీసుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్‌కు 90 సీట్లు ఎలా వస్తాయి?

రేవంత్ రెడ్డికి బండి సంజయ్ ప్రశ్న

హామీల అమలుపై సీఎం రేవంత్‌రెడ్డిని నిలదీసిన సంజయ్

నిరుద్యోగ భృతి, మహిళలకు రూ.2,500 ఏవని నిలదీత

తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా



తెలంగాణలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 90 స్థానాలు ఎలా వస్తాయంటూ సీఎం రేవంత్‌రెడ్డిని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రశ్నించారు. కరీంనగర్‌లో పర్యటించిన ఆయన, పలు కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఏం హామీలను సమర్థవంతంగా అమలు చేశారని కాంగ్రెస్‌కు ప్రజలు 90 సీట్లు ఇస్తారు? అంటూ ఆయన నిలదీశారు.



రాబోయే రోజుల్లో డేటా ఆధారిత నిర్ణయాలే కీలకం అవుతాయి

అధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆర్టీజీఎస్ సమీక్ష

వైద్యం వ్యవసాయ రంగాల్లో ఏఐ వినియోగానికి సీఎం ఆదేశం

ప్రజల సమస్యల పరిష్కారంలో జాప్యం ఉండకూడదని స్పష్టీకరణ

డేటా ఆధారిత నిర్ణయాలతోనే పాలనలో మెరుగైన ఫలితాలు అని వెల్లడి

ఉద్యోగుల పనితీరు పెంపునకు ప్రత్యేక శిక్షణ

2లో

వైద్యారోగ్యం నుంచి వ్యవసాయం వరకు అన్ని కీలక రంగాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతను విస్తృతంగా వినియోగించుకుని పాలనలో మెరుగైన ఫలితాలు సాధించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. అమరావతిలో రియల్ టైమ్ గవర్నెన్స్ (ఆర్టీజీఎస్)పై వివిధ శాఖల ఉన్నతాధికారులతో ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఏఐ స్టాక్ సాయంతో ప్రభుత్వ సేవలను మరింత సులభతరం చేయడంతో పాటు, ఆయా శాఖల పనితీరును, ప్రభుత్వ ఆదాయాలను మెరుగుపర్చాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. పాలనా విభాగాల్లో రెవెన్యూ, లీగల్ ఏఐ స్టాక్ ద్వారా వివిధ అంశాలను విశ్లేషించి, అత్యుత్తమ ఫలితాలు రాబట్టేలా చర్యలు తీసుకుంటున్నామని సీఎం వివరించారు. రాబోయే రోజుల్లో డేటా ఆధారిత నిర్ణయాలు (డేటా డ్రివెన్ డెసిషన్ మేకింగ్) అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంటాయని స్పష్టం చేశారు. ప్రభుత్వ సమర్థ పనితీరుకు ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలే నిదర్శనమని గుర్తుచేశారు.

ప్రభుత్వ శాఖలు ప్రజలకు అందించే వివిధ పౌర సేవలను మరింత సమర్థవంతంగా, వేగంగా చేరవేయడానికి తగిన కార్యాచరణ రూపొందించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఉద్యోగుల్లో నైపుణ్యాలను పెంపొందించేందుకు కెపాసిటీ బిల్డింగ్ కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ సేవలపై ప్రజల్లో సంతృప్తికరమైన సానుకూల అభిప్రాయం ఏర్పడినప్పుడే సుపరిపాలన సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు.పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టమ్ ద్వారా ప్రజల నుంచి అందే అర్జీలు, ఫిర్యాదులను ఏమాత్రం జాప్యం లేకుండా వేగంగా పరిష్కరించాలని రాబోయే రోజుల్లో డేటా ఆధారిత నిర్ణయాలే కీలకం అవుతాయి: సీఎం చంద్రబాబు సీఎం అధికారులకు తేల్చిచెప్పారు. ప్రజా సమస్యల పరిష్కార ప్రక్రియలో పర్యవేక్షణ లోపాలు ఉంటే వెంటనే సరిదిద్దుకోవాలని,

విశాఖ మేయర్ ముక్కా శ్రావణిని పరామర్శించిన మంత్రి లోకేశ్



మేయర్ తండ్రి ముత్యాలనాయుడు ఇటీవల మృతి 2లో

ఆయన చిత్రపటానికి నివాళులు

పార్టీకి ముత్యాలనాయుడు సేవలను గుర్తుచేసుకున్న లోకేశ్

లోకేశ్ వెంట పలువురు టీడీపీ నేతలు

విశాఖపట్నం నగర మేయర్ ముక్కా శ్రావణిని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సోమవారం పరామర్శించారు. శ్రావణి తండ్రి, టీడీపీ సీనియర్ నేత ముక్కా ముత్యాలనాయుడు శుక్రవారం కన్నుమూసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో, విశాఖలోని ఆమె నివాసానికి వెళ్లిన లోకేశ్.. మేయర్ శ్రావణిని, ఆమె కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా ముత్యాలనాయుడు చిత్రపటానికి పూలు సమర్పించి నివాళులు అర్పించారు. కార్పొరేటర్‌గా, విశాఖ జిల్లా పార్టీ బీసీ విభాగం ఉపాధ్యక్షుడిగా ముత్యాలనాయుడు పార్టీకి, ప్రజలకు అందించిన

24 ఏళ్ల యువతికి టీడీపీ బంపరాఫర్..



ఏకంగా డిప్యూటీ మేయర్ పీఠం దక్కించుకున్న చర్విత!

ఒంగోలు డిప్యూటీ మేయర్‌గా చావలి చర్విత బాధ్యతలు

ఒంగోలు కార్పొరేషన్ పగ్గాలు చేపట్టిన శ్రీశిల్ప, చర్విత ద్వయం

చర్విత ఎస్ఆర్ఎం నుంచి ఎంటెక్ పూర్తి చేసి పాలిటిక్స్‌లోకి ఎంట్రీ

కార్పొరేట్ కొలువులు కాదని ప్రజాసేవను ఎంచుకున్న యువతి

ఎన్నికల వేళ రీల్స్, సోషల్ మీడియా వీడియోలతో యువతకు కనెక్ట్

ఒకప్పుడు రాజకీయాలు అంటే తలపండిన సీనియర్లు, దశాబ్దాల అనుభవం ఉన్న వారికే పరిమితమనే భావన ఉండేది. ఆ పాత సాంప్రదాయాలకు తెరదించుతూ నేటి తరం యువత ప్రత్యక్ష ఎన్నికల్లోకి దూసుకొస్తోంది. కేవలం ఓట్లు సాధించి పదవులుదక్కించుకోవడమే కాకుండా, నగరాల అభివృద్ధిని నిర్దేశించే కీలక పాలనా పగ్గాలు

కేటీఆర్ ఊహా ప్రపంచంలో బతుకుతున్నారు



బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావడం ఇక కలేనన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

కేటీఆర్ వాస్తవాలు వదిలేసి సోషల్ మీడియా లోకంలోనే ఉంటున్నారని వ్యాఖ్య

తమ గత వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే బీఆర్ఎస్ ఆరోపణలు చేస్తోందన్న విమర్శ 2లో

తెలంగాణలో ప్రజలకు సంక్షేమం అందిస్తూ, రాష్ట్ర ప్రయోజనాల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పోరాడుతుంటే బీఆర్ఎస్ నేతలు అనవసర ఆరోపణలు చేస్తున్నారని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క విమర్శించారు. బీఆర్ఎస్‌కు అధికారం అనేది ఇక కలేనని ఆయన



నేపాల్ ప్రధానికి శ్రీకాకుళం కలంకారీ సంపూర్ణ రామాయణం పెయింటింగ్ బహూకరించిన మోదీ

భారత్‌లో నేపాల్ ప్రధాని బాలేంద్ర షా అధికారిక పర్యటన 2లో

నేపాల్ పీఎంకు కాశీ పవిత్ర గంగాజలం బహూకరించిన మోదీ

గుజరాత్ సదేలీ బాక్స్‌లో బనారసి బ్రోకేడ్ శాలువా కూడా ప్రదానం

ఇరు దేశాల ఆధ్యాత్మిక, సాంస్కృతిక అనుబంధానికి ప్రతీకగా కానుకలు

భారత్, నేపాల్ దేశాల మధ్య శతాబ్దాలుగా కొనసాగుతున్న ఆధ్యాత్మిక, సాంస్కృతిక, నాగరికతా సంబంధాలను ప్రతిబింబించేలా భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేపాల్ ప్రధానికి అరుదైన

సీట్ల పంపకంపై పీఠముడి!

130 స్థానాల జాబితా.. కాంగ్రెస్ వ్యూహం ఏమిటి?

ఉత్తరప్రదేశ్‌లో మొత్తం 403 అసెంబ్లీ స్థానాలున్నాయి. వీటిలో సుమారు 130 స్థానాల్లో పోటీ చేయాలని కాంగ్రెస్ ప్రతిపాదించింది. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలోనూ తమ పార్టీకి ప్రాతినిధ్యం ఉండాలని కోరుతోంది. ఈ క్రమంలో అమేథీ, రాయ్‌బరేలీ జిల్లాల్లోని అన్ని అసెంబ్లీ స్థానాలను తమకు కేటాయించాలని పట్టుబడుతోంది. అయితే సమాజ్‌వాదీ పార్టీ వ్యవస్థాపకుడు ములాయం సింగ్ యాదవ్, ప్రస్తుత పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్‌ల స్వగ్రామమైన సైఫాయ్‌ను మాత్రం తన జిల్లా వారీ డిమాండ్ల జాబితా నుంచి మినహాయించినట్లు సమాచారం. కాంగ్రెస్ మొదట సుమారు 181 స్థానాలతో కూడిన జాబితాను సిద్ధం చేసినట్లు పార్టీ వర్గాల సమాచారం. అయితే చర్చల సందర్భంగా సుమారు 130 స్థానాలపై తన డిమాండ్‌ను ముందుంచింది. ఇందులోనూ గెలుపు అవకాశాలున్న నియోజకవర్గాలకే ప్రాధాన్యం ఇవ్వాలని భావిస్తోంది. గత లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ మెరుగైన ప్రదర్శన చేసిన ప్రాంతాలు, స్థానికంగా బలమైన నాయకత్వం ఉన్న నియోజకవర్గాలపై దృష్టి పెట్టింది.

15 నిమిషాల్లోనే ముగిసిన తొలి భేటీ

కాంగ్రెస్ ఎంపీ ప్రమోద్ తివారీ నివాసంలో సోమవారం ఉదయం 11.50 గంటలకు ఎస్పీ నేతలు సమావేశానికి చేరుకున్నారు. కాంగ్రెస్ ప్రతినిధులు అప్పటికే అక్కడ సిద్ధంగా ఉన్నారు. రెండు పార్టీల నేతలు సమావేశమైన కొద్దిసేపటికే ఎస్పీ ఎంపీ రామ్‌గోపాల్ యాదవ్.. కాంగ్రెస్ నేతలను ఉద్దేశించి 'మీరు ఏం నిర్ణయించారు?' అని ప్రశ్నించినట్లు సమాచారం. దీనికి స్పందించిన కాంగ్రెస్ ప్రతినిధులు సుమారు 130 స్థానాలతో కూడిన జాబితాను వారి ముందుంచారు. ఆ ప్రతిపాదనలను పరిశీలించిన ఎస్పీ నేతలు వెంటనే ఎలాంటి ప్రత్యామ్నాయ జాబితాను ఇవ్వలేదు. పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్‌తో చర్చించి తదుపరి సమావేశంలో తమ అభిప్రాయాన్ని వెల్లడిస్తామని తెలిపారు. దీంతో తొలి విడత చర్చలు కేవలం 15 నిమిషాల్లోనే ముగిశాయి.

ఇరు పార్టీల నుంచి నలుగురు చొప్పున ప్రతినిధులు ఈ చర్చల్లో కాంగ్రెస్ తరఫున ఉత్తరప్రదేశ్ పార్టీ ఇన్‌చార్జి రాజేంద్ర పాల్ గౌతమ్, రాష్ట్ర అధ్యక్షురాలు ఆరాధనా మిశ్రా, వర్కింగ్ ప్రెసిడెంట్ ఇమ్రాన్ మసూద్, ఎమ్మెల్యే వీరేంద్ర చౌధరి పాల్గొన్నారు. సమాజ్‌వాదీ పార్టీ తరఫున సీనియర్ నేత రామ్‌గోపాల్ యాదవ్, రాష్ట్ర అధ్యక్షుడు శ్యామ్‌లాల్ పాల్, ఎంపీలు రాజీవ్ రాయ్, ఇక్రా చౌధరీ చర్చల్లో పాల్గొన్నారు. ఇరు పార్టీల అధినేతలు రాహుల్ గాంధీ, అఖిలేశ్ యాదవ్ నవంబర్ 16న ఢిల్లీలో ప్రాథమికంగా చర్చలు జరిపినట్లు సమాచారం. ఆ తర్వాతే సీట్ల పంపకాలపై అధికారిక చర్చలకు ఇరు పార్టీలు కమిటీలను ఏర్పాటు చేశాయి.

గెలుపు అవకాశాలే ప్రాతిపదిక: ఎస్పీ

కాంగ్రెస్ ప్రతిపాదించిన 130 స్థానాలపై ఎస్పీ నేతలు వెంటనే స్పందించకపోవడం చర్చనీయాంశమైంది. అయితే సీట్ల సంఖ్య కంటే అభ్యర్థుల గెలుపు అవకాశాలకే ప్రాధాన్యం ఇస్తామని ఎస్పీ స్పష్టం చేస్తోంది. ఏ నియోజకవర్గంలో ఏ పార్టీకి బలముంది? ఎవరు గెలిచే అవకాశం ఉంది? స్థానికంగా ఎవరికి ప్రజాదరణ ఉంది? వంటి అంశాలను పరిశీలించిన తర్వాతే సీట్ల కేటాయింపుపై నిర్ణయం తీసుకోవాలని భావిస్తోంది. కాంగ్రెస్ కోరుతున్న స్థానాలపై ఎస్పీ నేతలు అంతర్గతంగా చర్చించనున్నారు. ఆ పార్టీ ప్రతిపాదనలను పరిశీలించిన తర్వాత తమ అభిప్రాయాలను తదుపరి సమావేశంలో వెల్లడించనున్నారు. ఎస్పీ సుమారు 55 స్థానాలతో కూడిన ప్రతిపాదనను కాంగ్రెస్‌కు పంపినట్లు పార్టీ వర్గాలను ఉటంకిస్తూ నివేదికలు వెల్లడించాయి. అయితే ఈ సంఖ్యపై ఇరు పార్టీలు అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు.

అమేథీ, రాయ్‌బరేలీపై ప్రత్యేక దృష్టి కాంగ్రెస్ ప్రతిపాదించిన స్థానాల్లో అమేథీ, రాయ్‌బరేలీ జిల్లాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. ఈ రెండు ప్రాంతాలు గాంధీ కుటుంబ రాజకీయ ప్రస్థానంతో ముడిపడి ఉండటంతో కాంగ్రెస్ వాటిని ప్రతిష్ఠాత్మకంగా భావిస్తోంది. ఆయా జిల్లాల్లోని అన్ని అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేయాలని కోరుతోంది. గత ఎన్నికల్లో ఈ ప్రాంతాల్లోని కొన్ని స్థానాల్లో సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థులు విజయం సాధించారు. దీంతో సీట్ల కేటాయింపుపై చర్చలు ఆసక్తికరంగా మారాయి. మరోవైపు సహరన్‌పూర్ ప్రాంతంలోని కొన్ని స్థానాలపైనా కాంగ్రెస్ ఆసక్తి చూపుతోంది. ముఖ్యంగా సహరన్‌పూర్ దేహాత్, బెహట్ నియోజకవర్గాల విషయంలో ఇరు పార్టీల మధ్య ఏకాభిప్రాయం కుదరాల్సి ఉంది. ఈ స్థానాలపై కాంగ్రెస్ నేత ఇమ్రాన్ మసూద్ ప్రత్యేకంగా ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం.

గత ఎన్నికల ఫలితాలే కీలకం సీట్ల పంపకాల చర్చల్లో గత ఎన్నికల ఫలితాలు కీలక పాత్ర పోషించనున్నాయి. 2022 ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ 399 స్థానాల్లో పోటీ చేసి కేవలం రెండు స్థానాల్లోనే విజయం సాధించింది. ఓట్ల శాతం కూడా రెండు శాతానికి పరిమితమైంది. మరోవైపు సమాజ్‌వాదీ పార్టీ 111 స్థానాల్లో గెలిచింది. దీంతో సీట్ల కేటాయింపులో తమకు ఎక్కువ ప్రాధాన్యం ఉండాలని ఎస్పీ భావిస్తోంది. అయితే 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమి తరఫున కాంగ్రెస్, ఎస్పీ కలిసి పోటీ చేసి మంచి ఫలితాలు సాధించాయి. ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్ 17 స్థానాల్లో పోటీ చేసి ఆరు చోట్ల విజయం సాధించగా.. ఎస్పీ 62 స్థానాల్లో పోటీ చేసి 37 చోట్ల గెలిచింది. ఈ ఫలితాలనే ప్రాతిపదికగా తీసుకుని అసెంబ్లీ ఎన్నికల్లోనూ గౌరవప్రదమైన సీట్ల వాటా కోరాలని కాంగ్రెస్ భావిస్తోంది.

చర్చలు సానుకూలంగా సాగాయి: నేతలు

సమావేశం స్వల్ప వ్యవధిలో ముగిసినప్పటికీ.. చర్చలు విఫలమైనట్లు భావించాల్సిన అవసరం లేదని ఎస్పీ నేత రామ్‌గోపాల్ యాదవ్ స్పష్టం చేశారు.

ఇరు పక్షాలు ఒకరి అభిప్రాయాలను మరొకరు విన్నాయని, సమావేశం స్నేహపూర్వక వాతావరణంలో జరిగిందని తెలిపారు. మరో రెండు మూడు రోజుల్లో సీట్ల పంపకాల ప్రక్రియను పూర్తి చేస్తామని, మంగళవారం మరో విడత చర్చలు ఉంటాయని చెప్పారు. కాంగ్రెస్ నేత ఆరాధనా మిశ్రా కూడా చర్చలు సానుకూల వాతావరణంలో జరిగాయని వెల్లడించారు. సీట్ల సంఖ్యపై చర్చలు జరిగాయని, అయితే తుది వివరాలు తదుపరి సమావేశం తర్వాతే స్పష్టమవుతాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఉత్తరప్రదేశ్ ఇన్‌చార్జి రాజేంద్ర పాల్ గౌతమ్ మాట్లాడుతూ.. ఇరు పార్టీలు పరస్పరం విశ్వసిస్తున్నాయని, కలిసి ఎన్నికల్లో పోటీ చేయాలని నిర్ణయించుకున్నాయని తెలిపారు. సీట్ల పంపకాలపై గౌరవప్రదమైన ఒప్పందం కుదురుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్, ఎస్పీ నేతలు పొత్తు చర్చలను ముందుకు తీసుకెళ్తుండగా.. అధికార బీజేపీ మాత్రం ఈ కూటమిపై విమర్శలు గుప్పిస్తోంది. సీట్ల పంపకాల విషయంలో ఇరు పార్టీల మధ్య ఆధిపత్య పోరు నడుస్తోందని ఆరోపిస్తోంది. కాంగ్రెస్ గత అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన ఫలితాలను ప్రస్తావిస్తూ ఆ పార్టీకి ఎక్కువ స్థానాలు కేటాయించడంపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. అయితే కాంగ్రెస్, ఎస్పీ నేతలు మాత్రం తమ లక్ష్యం బీజేపీని ఓడించడమేనని చెబుతున్నారు. సీట్ల కేటాయింపులో పరస్పర అవగాహనతో ముందుకు సాగుతామని స్పష్టం చేస్తున్నారు.

రేపటి భేటీపై ఉత్కంఠ.. తుది నిర్ణయం ఎప్పుడంటే?

సోమవారం జరిగిన తొలి విడత చర్చలు ప్రతిపాదనలకే పరిమితం కావడంతో మంగళవారం జరిగే సమావేశం కీలకంగా మారింది. కాంగ్రెస్ సమర్పించిన 130 స్థానాల జాబితాపై

ఎస్పీ నాయకత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది ఆసక్తికరంగా మారింది. అమేథీ, రాయ్‌బరేలీతో పాటు ఇతర జిల్లాల్లోని స్థానాల కేటాయింపుపై ఏకాభిప్రాయం కుదరాల్సి ఉంది.

పిఠాపురం జనసేనలో అసమ్మతి:

పిఠాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ అభ్యర్థిగా బొజ్జా వెంకటేశ్వరరావు పేరును జనసేన పార్టీ ఖరారు చేసింది. అయితే ఈ నిర్ణయాన్ని స్థానిక జనసేన కౌన్సిలర్లు కొందరు తీవ్రంగా తప్పుబడుతున్నారు. గతంలో వైసీపీలో ఉన్న బొజ్జా వెంకటేశ్వరరావు ఎన్నికల సమయంలో పవన్ కల్యాణ్‌కు వ్యతిరేకంగా పనిచేశారని వారు ఆరోపిస్తున్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి నిలబడి పనిచేస్తున్న సీనియర్ కౌన్సిలర్ సంధ్యకు ఈ పదవి కేటాయించాలని వారు పట్టుబడుతున్నారు.అభ్యర్థి ఎంపిక విషయంలో కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌పై కౌన్సిలర్లు, పార్టీ కార్యకర్తలు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించి ఎంపీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసనకు దిగారు. ఈ నిరసనల క్రమంలో ఎంపీ పీఏ చక్రిపై కొందరు దాడికి యత్నించడంతో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. పరిస్థితి చేయిదాటిపోకుండా ఉండేందుకు పోలీసులు వెంటనే రంగప్రవేశం చేసి మున్సిపల్ కార్యాలయం పరిసరాల్లో భారీగా బలగాలను మోహరించారు. పిఠాపురం మున్సిపాలిటీలో మొత్తం 36 మంది కౌన్సిలర్లు ఉన్నారు. ఇందులో కూటమి బలం 25 కాగా, ఒక్క జనసేన పార్టీకే 18 మంది కౌన్సిలర్ల సంఖ్యాబలం ఉంది. స్పష్టమైన మెజారిటీ ఉన్నప్పటికీ, అంతర్గత విభేదాలు ఈ స్థాయిలో బహిర్గతం కావడం పార్టీ శ్రేణుల్లో చర్చనీయాంశంగా మారింది.

కాంగ్రెస్‌కు 90 సీట్లు ఎలా వస్తాయి?

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ప్రధాన హామీలపై స్పందిస్తూ, యువతకు నిరుద్యోగ భృతి ఇచ్చారా? అని సంజయ్ ప్రశ్నించారు. అలాగే అర్హులైన మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామన్న హామీ ఎందుకు అమలు కాలేదని ఆరోపించారు. ప్రజలు ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చారని, తెలంగాణలో బీజేపీకి అధికారం అప్పగించేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) అంశంలో కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ నేతలు అనవసర రాద్ధాంతం చేస్తున్నారని బండి సంజయ్ విమర్శించారు. "చనిపోయిన వారి ఓట్లు తీసేస్తే తప్పా? దేశద్రోహుల ఓట్లను తొలగించడం తప్పా?" అని ఆయన సూటిగా ప్రశ్నించారు. ప్రధానిని ఎవరు నిర్ణయించాలనేది ప్రజల చేతుల్లోనే ఉంటుందని స్పష్టం చేశారు. ఇప్పటికే రాజకీయ సమరం ప్రారంభమైందని, తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కాగా, బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై అధికార కాంగ్రెస్ పార్టీ లేదా ప్రభుత్వం నుంచి ఎలాంటి అధికారిక స్పందన వెలువడలేదు.

విశాఖ మేయర్ ముక్కా శ్రావణిని పరామర్శించిన మంత్రి లోకేశ్

సేవలను లోకేశ్ గుర్తు చేసుకున్నారు. ఈ కష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులకు సూచిస్తూ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మంత్రి లోకేశ్ వెంట ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు చోడె పట్టాభిరాం, ప్రధాన కార్యదర్శి లొడగల కృష్ణ, పెందుర్తి నియోజకవర్గ ఇంఛార్జ్ గండి బాబ్జి, పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పుచ్చా విజయ్ కుమార్ తదితరులు ఉన్నారు.

రాబోయే రోజుల్లో డేటా ఆధారిత నిర్ణయాలే కీలకం అవుతాయి

ప్రతి శాఖ కూడా తన పనితీరును నిరంతరం సమీక్షించుకోవాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో సాంఖిక సంక్షేమ, బీసీ సంక్షేమ, మైనారిటీ సంక్షేమ, ఆర్థిక, పురపాలక, ఇంధన శాఖల ఉన్నతాధికారులు మరియు ఆర్టీజీఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కేటీఆర్ ఊహా పపంచంలో బతుకుతున్నారు

2024 ఎన్నికల్లో చిత్తూరు పోలింగ్‌పై ఎలాంటి ఫిర్యాదులూ రాలేదు: ఏపీ సీఈవో వివేక్ యాదవ్

సాయంత్రం 6 గంటల వరకు క్యూలో ఉన్న 56,067 మందికి స్లిప్పులు

ఈవీఎంల లెక్కింపు ఫామ్ 17సీ డేటాతో సంపూర్ణంగా సరిపోయింది

కౌంటింగ్ వేళ ఏ రాజకీయ పార్టీ ఏజెంట్ కూడా అభ్యంతరం తెలపలేదు

ఈ వ్యవహారంలో ఎలాంటి ఎన్నికల పిటిషన్లు దాఖలు కాలేదని స్పష్టీకరణ

2024 సార్వత్రిక ఎన్నికల్లో చిత్తూరు లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో సాయంత్రం 6 గంటల తర్వాత జరిగిన పోలింగ్‌పై రాజకీయ పార్టీల నుంచి ఎలాంటి ఫిర్యాదులూ అందలేదని ఆంధ్రప్రదేశ్ ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) వివేక్ యాదవ్ స్పష్టం చేశారు. సాయంత్రం 6 గంటల తర్వాత ఓటు వేసిన వారి సంఖ్యలో వ్యత్యాసాలు ఉన్నాయంటూ ఓ వెబ్‌సైట్‌లో ప్రచురితమైన కథనంపై ఆయన అధికారికంగా స్పందిస్తూ సుదీర్ఘ వివరణ ఇచ్చారు.చిత్తూరు లోక్‌సభ పరిధిలో సాయంత్రం 6 గంటల సమయానికి ఇంకా క్యూలైన్లలో 56,067 మంది ఓటర్లు ఉన్నారని, అయితే అదే లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కలిపి ఆ సంఖ్య 24,596 మాత్రమేనని ఆ వెబ్‌సైట్ తన కథనంలో పేర్కొంది. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి జరిగినప్పుడు ఈ 31,000 పైచిలుకు ఓట్ల వ్యత్యాసం ఎలా వచ్చిందంటూ సదరు కథనం సందేహాలు లేవనెత్తింది. ఎన్నికల సంఘం అంతర్గత రికార్డులను ఉటంకిస్తూ వచ్చిన ఈ ఆరోపణలను సీఈవో తీవ్రంగా ఖండించారు.ఈ అంశంపై ఏపీ సీఈవో వివేక్ యాదవ్ తన అధికారిక 'ఎక్స్' ఖాతా ద్వారా వాస్తవాలను వెల్లడించారు. 2024 జూన్ 4న అప్పటి రిటర్నింగ్ అధికారి (ఆర్వో) కేంద్ర ఎన్నికల సంఘానికి పంపిన 'రిపోర్ట్-31' ప్రకారం.. సాయంత్రం 6 గంటల సమయానికి క్యూలో ఉన్న 56,067 మంది ఓటర్లకు స్లిప్పులు పంపిణీ చేసినట్లు పార్లమెంట్ ఆర్వో, జిల్లా ఎన్నికల అధికారి (డీఈవో) ధ్రువీకరించారని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీల పోలింగ్ ఏజెంట్ల సమక్షంలోనే ఈ స్లిప్పుల పంపిణీ జరిగిందని, ఆ సమయంలో దీనిపై ఎవరూ ఎలాంటి ఫిర్యాదు చేయలేదని స్పష్టం చేశారు. డీఈవో నివేదిక ప్రకారం పంపిణీ చేసిన 56,067 స్లిప్పుల వివరాలు తుది పోలింగ్ శాతంతో సరిపోయాయని సీఈవో పేర్కొన్నారు. చిత్తూరు పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో పోలైన ఓట్ల సంఖ్య, 'ఫామ్ 17సీ'లో నమోదైన లెక్కలు ఈవీఎంలలో నమోదైన ఓట్లతో నూటికి నూరు శాతం సరిగ్గా సరిపోయాయని వివరించారు. పోలింగ్ ముగిసిన వెంటనే ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ అభ్యర్థుల పోలింగ్ ఏజెంట్లకు సంతకం చేసిన ఫామ్ 17సీ ప్రతులను అందజేశామని, ఆ సమయంలో సాయంత్రం 6 గంటల తర్వాత జరిగిన పోలింగ్‌పై ఏ ఒక్కరూ అభ్యంతరం వ్యక్తం చేయలేదని తెలిపారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ సమయంలోనూ ఎన్నికల పరిశీలకుల సమక్షంలో ఏ రాజకీయ పార్టీకి చెందిన కౌంటింగ్ ఏజెంట్లు కూడా ఎలాంటి అభ్యంతరాలు తెలపలేదని, ఈసీకి కూడా ఎలాంటి ఫిర్యాదులు రాలేదని సీఈవో స్పష్టం చేశారు. ఎన్నికల ఫలితాలు, ఓటింగ్‌కు సంబంధించిన పూర్తి అధికారిక వివరాలు ఇండెక్స్ కార్డులు, స్టాటిస్టికల్ నివేదికల ద్వారా ఇప్పటికే ప్రజలకు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. అంతేకాకుండా, చిత్తూరు ఎన్నికల ఫలితాలు లేదా ఓటింగ్‌పై న్యాయస్థానాల్లో ఎలాంటి ఎన్నికల పిటిషన్లు కూడా దాఖలు కాలేదని వివేక్ యాదవ్ స్పష్టం చేశారు.



నేపాల్ ప్రధానికి శ్రీకాళహస్తి కలంకారీ సంపూర్ణ రామాయణం పెయింటింగ్ బహూకరించిన మోదీ

బహుమతులను అందజేశారు. భారత్‌లో అధికారిక పర్యటనలో ఉన్న నేపాల్ ప్రధాని బాలేంద్ర షాకు ప్రధాని మోదీ సోమవారం ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయనకు కాశీ పవిత్ర గంగాజలం, బనారసి బ్రోకేడ్ శాలువా, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన శ్రీకాళహస్తి కలంకారీ సంపూర్ణ రామాయణం పెయింటింగ్‌ను కానుకలుగా బహూకరించారు. కాశీలోని పవిత్ర గంగా నది నుంచి సేకరించిన జలాన్ని కళాత్మకంగా రూపొందించిన ఇత్తడి కలశంలో ఉంచి నేపాల్ ప్రధానికి అందించారు. కాశీ విశ్వనాథుని సన్నిధి నుంచి తెచ్చిన ఈ గంగాజలం పవిత్రతకు, భక్తికి, దైవిక ఆశీస్సులకు నిదర్శనంగా నిలుస్తుంది. కాశీ విశ్వనాథునికి, ఖాట్మండులోని పశుపతినాథునికి మధ్య గల అనాది ఆధ్యాత్మిక బంధాన్ని ఈ కానుక గుర్తుచేస్తుంది. ఇరు దేశాల ప్రజల మధ్య శాంతి, శ్రేయస్సు, ఆధ్యాత్మిక ఐక్యతను పెంపొందించడానికి ఇది సంకేతమని పేర్కొన్నారు. వీటితో పాటు వారణాసి చేనేత కళాకారులు అత్యంత నైపుణ్యంతో నేసిన బనారసి బ్రోకేడ్ సిల్క్ శాలువాను ప్రధాని మోదీ బహూకరించారు. ఈ శాలువాను గుజరాత్‌కు చెందిన సంప్రదాయ సదేలీ కళాకృతితో కూడిన చెక్క పెట్టెలో ఉంచి అందజేశారు. వారణాసి, గుజరాత్ రాష్ట్రాల హస్తకళా వైభవాన్ని, తరతరాల నైపుణ్యాన్ని ఈ బహుమతులు చాటిచెబుతున్నాయి. అలాగే, ఆంధ్రప్రదేశ్‌లోని ప్రసిద్ధ శ్రీకాళహస్తి శైలిలో రూపొందించిన 'సంపూర్ణ రామాయణం' కలంకారీ పెయింటింగ్‌ను కూడా నేపాల్ ప్రధానికి ప్రధాని మోదీ అందజేశారు. వెదురు కలం, సహజసిద్ధమైన రంగులను ఉపయోగించి పత్తి వస్త్రంపై శ్రీరాముడి జననం, వనవాసం, రావణ సంహారం, అయోధ్యకు తిరుగు ప్రయాణం వంటి ప్రధాన ఘట్టాలను అద్భుతంగా చిత్రించారు. శ్రీరాముడి జన్మస్థలమైన అయోధ్యకు, సీతాదేవి జన్మస్థలమైన జనక్‌పూర్‌కు మధ్య గల పవిత్ర సంబంధాన్ని ఈ పెయింటింగ్ ప్రతిబింబిస్తుంది. ఇరు దేశాల ఉమ్మడి వారసత్వాన్ని, శాశ్వత మైత్రిని ఈ ప్రత్యేక కానుకలు మరింత బలోపేతం చేస్తాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

24 ఏళ్ల యువతికి టీడీపీ బంపరాఫర్..

చేపడుతూ అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోని ఒంగోలు నగర పాలక సంస్థలో చోటుచేసుకున్న తాజా పరిణామం ఇందుకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచింది. కార్పొరేటర్‌గా గెలిచిన కొన్ని రోజుల్లోనే అత్యంత పిన్న వయసులో డిప్యూటీ మేయర్ కుర్చీని కైవసం చేసుకుని చావలి చర్పిత వార్తల్లో నిలిచారు. ఒంగోలు నగర పాలనలో ఒక అరుదైన దృశ్యం ఆవిష్కృతమైంది. నగర మేయర్‌గా శ్రీశిల్ప, డిప్యూటీ మేయర్‌గా చర్పిత బాధ్యతలు స్వీకరించడంతో పాలనా పగ్గాలు పూర్తిగా మహిళల చేతుల్లోకి వెళ్లాయి. ఇందులో ముఖ్యంగా 24 ఏళ్లకే డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైన చర్పిత గురించే ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా జోరుగా చర్చ సాగుతోంది. నెటిజన్లు, యువత ఆమెకు సోషల్ మీడియా వేదికగా పెద్ద ఎత్తున శుభాకాంక్షలు చెబుతున్నారు. చర్పిత ఎన్నికల ప్రయాణం ఎంతో ఆసక్తికరంగా సాగింది. టీడీపీ అభ్యర్థిగా 27వ డివిజన్ బరిలోకి దిగిన ఆమె, ప్రచారంలో వినూత్న శైలితో ప్రజల మనసులు గెలుచుకున్నారు. సాంప్రదాయ పద్ధతులకు భిన్నంగా రీల్స్, ప్రచార వీడియోలను ఉపయోగిస్తూ యువతను విశేషంగా ఆకట్టుకున్నారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్లను చిరునవ్వుతో పలకరిస్తూ ఆత్మీయత చూపించిన ఆమె ప్రచార వీడియోలు నెట్టింట విపరీతంగా చక్కర్లు కొట్టాయి. ప్రత్యర్థి పార్టీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిపై తిరుగులేని విజయం సాధించి కౌన్సిల్ హాల్‌లో అడుగుపెట్టారు. ప్రఖ్యాత ఎస్ఆర్ఎం ఇన్‌స్టిట్యూట్ నుంచి ఎంటెక్ పూర్తి చేసిన చర్పిత.. కార్పొరేట్ రంగంలో ఉన్నత ఉద్యోగ అవకాశాలు ఉన్నప్పటికీ సమాజ సేవ వైపే మొగ్గు చూపారు. ఆమె కుటుంబానికి టీడీపీతో నాలుగు దశాబ్దాల సుదీర్ఘ అనుబంధం ఉంది. తండ్రి మున్సిపల్ కాంట్రాక్టర్‌గా, తాత చావలి కృష్ణయ్య గతంలో కౌన్సిలర్‌గా ప్రజలకు సేవలందించారు. అమ్మమ్మ అనంతమ్మ ప్రస్తుతం అన్నవరం దేవస్థానం బోర్డు డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. గెలిచిన వెంటనే ఓటర్ల వద్దకు వెళ్లి కృతజ్ఞతలు తెలిపిన చర్పిత.. ఇప్పుడు యువ నాయకత్వ ప్రతిభను పరిపాలనలో నిరూపించాల్సిన కీలక బాధ్యతను భుజానికెత్తుకున్నారు.

సనాతన ధర్మాన్ని కాపాడటం అంటే పురాతన ఆలయాలను కూల్చడమేనా?: జగన్



తిరుపతి జిల్లా రేణిగుంట మండలం అంజనేయపురంలో శతాబ్దాల చరిత్ర కలిగిన అభయాంజనేయ స్వామి ఆలయాన్ని అధికారులు కూల్చివేశారంటూ వైసీపీ అధ్యక్షుడు జగన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వాన్ని తప్పుబడుతూ ఆయన సోషల్ మీడియా వేదికగా తీవ్ర విమర్శలు చేశారు."హే రామ్! ఆలయాలను రక్షించండి! ఆంధ్రప్రదేశ్‌ను కాపాడండి!" అంటూ వైఎస్ జగన్ తన సందేశంలో పేర్కొన్నారు. కోట్ల మంది భక్తుల విశ్వాసాలకు ప్రతీకగా ఉన్న పురాతన అభయాంజనేయ స్వామి ఆలయాన్ని బుల్డోజర్లతో కూల్చివేయడం అత్యంత బాధాకరమని అన్నారు. గతంలో తిరుమల వెయ్యి కాళ్ల మండపం తొలగింపు, విజయవాడ కృష్ణా పుష్కరాల సమయంలో 40 ఆలయాల కూల్చివేత, బద్వేల్‌లోని కాశీనాయన జ్యోతి క్షేత్రం ధ్వంసం వంటి ఘటనలను ప్రస్తావిస్తూ, చంద్రబాబు హయాంలో ఎలాంటి ప్రత్యామ్నాయాలూ అన్వేషించకుండా పవిత్ర కట్టడాలను కూల్చివేసే ధోరణి కొనసాగుతోందని ఆరోపించారు.తమ ప్రభుత్వ హయాంలో దేశవ్యాప్తంగా ఆలయాల నిర్మాణం, పునరుద్ధరణ కోసం 'శ్రీవాణి ట్రస్ట్'ను ఏర్పాటు చేస్తే, ప్రస్తుత ప్రభుత్వం చారిత్రక వారసత్వ సంపదను బుల్డోజర్లతో నేలమట్టం చేస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. సనాతన ధర్మాన్ని రక్షించడమంటే ఇదేనా అని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మరోవైపు, తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి కూడా ఈ ఘటనపై తీవ్రస్థాయిలో స్పందించారు. జాతీయ రహదారి 716 విస్తరణ కోసం రోడ్డు మార్గాన్ని (అలైన్‌మెంట్) మార్చే అవకాశం ఉన్నప్పటికీ, ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే ఈ పురాతన ఆలయాన్ని కూల్చివేసిందని ఒక వీడియో ప్రకటనలో ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హిందూ ధర్మాన్ని కాపాడే విధానం ఇదేనా అని ఆయన నిలదీశారు.కరకంబాడి సమీపంలో ఉన్న సంపన్న వర్గాల భూములు, ఆస్తులను కాపాడేందుకే జాతీయ రహదారి అలైన్‌మెంట్‌ను మార్చారని, దీనివల్లే చారిత్రక అభయాంజనేయ స్వామి ఆలయం బలైపోయిందని భూమన ఆరోపించారు. ఈ ఆలయ విశిష్టతను వివరిస్తూ, ఇక్కడి స్వామివారు స్వయంభూ అని, అగస్త్య మహర్షి భార్య లోపాముద్రతో ఈ క్షేత్రానికి సంబంధం ఉందని పేర్కొన్నారు. దాదాపు 1,400 ఏళ్ల క్రితం పల్లవ రాజులు ఈ ఆలయ గోపురం, కోనేరు నిర్మించారని, తాళ్లపాక అన్నమాచార్యులు కూడా స్వామివారిని కీర్తిస్తూ సంకీర్తనలు రచించారని గుర్తుచేశారు. కంచి కామకోటి పీఠాధిపతులు చంద్రశేఖరేంద్ర సరస్వతి, జయేంద్ర సరస్వతి సైతం ఇక్కడ విశేష పూజలు నిర్వహించారని తెలిపారు. ఈ ఆలయ ప్రాధాన్యతను గుర్తించే గతంలో బ్రిటిష్ పాలకులు కూడా మామండూరు సమీపంలో అంజనేయపురం రైల్వే స్టేషన్‌ను ఏర్పాటు చేశారని వివరించారు. ఎంతో పవిత్రమైన కార్తీక సోమవారం నాడు, కనీసం వేద పండితుల పర్యవేక్షణ కూడా లేకుండా జేసీబీలతో ఆలయాన్ని నేలమట్టం చేయడం తీవ్రమైన అపచారమని భూమన ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు సనాతన ధర్మాన్ని కాపాడతామని చెబుతూనే, మరోవైపు ప్రాచీన ఆలయాన్ని కూల్చివేసి హిందువుల మనోభావాలను తీవ్రంగా గాయపరిచారని ఆయన విమర్శించారు.

ఢిల్లీ పోలీస్ స్టేషన్‌లో ఐదుగురు పోలీసులను కత్తితో పొడిచిన వ్యక్తి.. ఛేజ్

టి సంద్రపల్లి,గ్రామపంచాయతీ అభివృద్ధి కావాలంటే..





సిపిఐ బలపరుస్తున్న గూడూరు రాజు ను

గెలిపించండిజిల్లా కార్యదర్శి

నిరంతరం ప్రజా సమస్యల పై పోరాడుతున్న

సిపిఐ అభ్యర్థులను గెలిపించండి

బద్వేల్ నవంబర్ 23నంది పత్రిక : టి సంద్రపల్లి గ్రామపంచాయతీ అభివృద్ధి జరగాలంటే భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ బలపరుస్తున్న గూడూరు రాజు ఉంగరం గుర్తుపై మీ అమూల్యమైన పవిత్రమైన ఓట్లు వేసి గెలిపించవలసిందిగా జిల్లా కార్యదర్శి గాలి చంద్ర ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.సోమవారం గోపవరం మండలం టి. సంద్రపల్లి సర్పంచ్ అభ్యర్థి గూడూరు రాజు,గెలుపు కోసం ఈరోజు విస్తృత ప్రచారం నిర్వహించినారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్న భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించడం వల్ల మన గ్రామ వార్డులు అభివృద్ధి జరుగుతాయని గత పాలకులు నేటి పాలకులు అభివృద్ధి చేయకుండా లక్షలు కోట్ల రూపాయలు ఖర్చులు చేసి ఓట్లు కొనుగోలు చేయాలని చూస్తున్నారని అధికారం డబ్బు ఉపయోగించి గెలిస్తే మన ప్రాంతాల అభివృద్ధి చేయకుండా డబ్బు సంపాదన దయంగా ఉంటారని అందుకే విజ్ఞులైన ఓటర్ మహాశయులు ఆలోచించి తమ అమూల్యమైన ఓటును నిత్యం ప్రజల్లో ఉంటున్న కమ్యూనిస్టు పార్టీ నాయకులకు వేయాలన్నారు ఆర్థిక బలంతో ఓటర్లను మభ్యపెట్టే మోసగాళ్ల మాటలు నమ్మవద్దండి రంగసముద్రం గ్రామ పంచాయతీల పరిధిలోని ఏ ప్రాంతానికి వెళ్లిన సరైనటువంటి రోడ్లు కరెంటు నీటి సౌకర్యం లేవని టి సంద్రపల్లి గ్రామపంచాయతీ అభివృద్ధి ఆమడ దూరంలో ఉందన్నారు నిధులు రాబట్టడంలో ప్రజా గొంతుకై ప్రశ్నించే కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థుల గెలుపే మన ప్రాంతాల అభివృద్ధి అని కావున ఓటర్లు తమ అమూల్యమైన పవిత్రమైన ఓటు వేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు ఈ ప్రచార కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీరశేఖర్ ఏరియా సహాయ కార్యదర్శి పి.వి రమణ గోపవరం మండల కార్యదర్శి గూడూరు పెంచలయ్య గోపవరం మండల నాయకులు వెంకటయ్య ఓబులేసు గురయ్య సుప్రజా వెంకటేశు సుబ్బరాయుడు లక్ష్మమ్మ శివ మరియు పంచాయతీ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

శ్రీ వీర భద్ర స్వామికి 2 లక్షల విలువైన వెండి కిరీటం బహూకరించిన భక్తులు.





బేతంచెర్ల నవంబర్ 23 (నంది పత్రిక). బేతంచెర్ల పట్టణంలోగల గౌరిపేట ప్రాంతం నందున్న,శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయమునకు ఎదురుగా ఉన్న, శ్రీ వీరభద్ర స్వామీ దేవాలయంలో కొలువై ఉన్న,శ్రీ వీర భద్ర స్వామి వారికి హైదరాబాద్ నివాసి బ్యాంక్ ఉద్యోగి మరియు సంతోషిని దంపతులు సోమవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి 2 లక్షల విలువ గల వెండి కిరీటం మరియు వెండి కవచమును సమర్పించారు. సుభాస్,సుభాషిణిల స్వస్థలం నంద్యాల జిల్లా, బేతంచెర్ల మండలం, సిమెంట్ నగర్ గ్రామము. వీరితో పాటు బేతంచెర్ల హిందూ ధార్మిక సంఘం నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ర్యాంకింగ్ చెస్ పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం

బహుమతులు అందచేసిన డాక్టర్ రవి కృష్ణ, రాహుల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ సుబ్బయ్య

ఏ రంగంలోనైనా క్రమశిక్షణతో కూడిన నిరంతర సాధన విజయాలకు సోపానం: డాక్టర్ రవి కృష్ణ



నంద్యాల ప్రతినిధి. నవంబర్ 23 . (నంది పత్రిక):నంద్యాల జిల్లా చెస్ సంఘం ఆధ్వర్యంలో, ఎన్. ఆర్ . జి. చెస్ అకాడమీ నిర్వహణలో దేవ నగర్ లోని రాహుల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల నందు నిర్వహించిన నంద్యాల జిల్లా స్థాయి 4 వ ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్ లో విజేతలకు నంద్యాల జిల్లా చెస్ సంఘం అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, రాహుల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల కరస్పాండెంట్ సుబ్బయ్య,నంద్యాల జిల్లా చెస్ అసోసియేషన్ సెక్రెటరీ రామ సుబ్బారెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయులు వెంకటన్న, యోగ శిక్షకులు పుల్లయ్య లు ట్రోఫీలు,పతకాలు ప్రదానం చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు,యువత ఆత్మవిశ్వాసంతో, బలమైన సంకల్పంతో, అంకితభావంతో, సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ క్రమశిక్షణ తో నిరంతర కృషి చేయడం ద్వారా ఏ రంగంలోనైనా విజయాలు సాధించవచ్చని అన్నారు.

విజేతల వివరాలు బాలుర విభాగంలో వివిధ కేటగిరీలలో మొదటి స్థానం సాధించిన క్రీడాకారులు: చార్విక్ నందన్,ధనిష్ రాయల్, ద్రువీత్, అబ్దుల్ ఆఫ్నాన్, షాహుల్ అమీన్, సోహాన్ బాలికల విభాగంలోషన్విత,లీలా అక్షర, లక్ష్మీ గీతిక,శాలిని, తపస్య.

కోటపాడు వైఎస్ఆర్సిపి సర్పంచ్ బరిలో దూదేకుల గురప్ప

భారీ మెజారిటీ దిశగా ప్రచారం



శిరివెళ్ల (నంది పత్రిక) :-సిరివెళ్ల మండల పరిధిలోని కోటపాడు గ్రామపంచాయతీ సర్పంచ్ బరిలో దూదేకుల గురప్ప నిలిచారు. ఎన్నికల అధికారులు ఆయనకు కత్తెర గుర్తు కేటాయించడంతో ప్రజల్లోకి ప్రచార నిమిత్తం దూసుకు వెళుతున్నారు. కోటపాడు గ్రామంలోని పలు వాడలలో చేసిన సర్పంచ్ ఎన్నికల ప్రచారానికి గ్రామపంచాయతీ ప్రజల నుండి అనూహ్య స్పందన లభిస్తోంది. గ్రామ ప్రజలలో మంచి పేరు ప్రఖ్యాతలు గల నాయకుడిగా గుర్రప్పకు గుర్తింపు ఉన్నదని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మద్దతు దారునిగా సర్పంచ్ బరిలో నిలవడం వల్ల ఆయన విజయం పై వైసిపి వర్గాలు ధీమా వ్యక్తం చేశారు. గ్రామ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారంలో ముందు ఉంటూ ప్రజలతో సస్తంబంధాలు కలిగి ఉండడం వల్ల దూదేకుల గుర్రప్ప గారి గెలుపు ఖాయమని మెజార్టీ పైనే దృష్టి అంతా అని కోటపాడు గ్రామపంచాయతీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. కత్తెర గుర్తు గడపగడపకు తీసుకువెళ్లి ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వంకదార సుబ్బ సత్యనారాయణ వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

భారీ ర్యాలీతో నామినేషన్ దాఖలు చేసిన టీడీపీ అభ్యర్థి చిత్రాల యేసుపాదం



ఖాజీపేట, (నంది పత్రిక) నవంబర్ 23: వైఎస్సార్ కడప జిల్లా ఖాజీపేట మండలం మీదుతూరు గ్రామ పంచాయతీ టీడీపీ అభ్యర్థిగా చిత్రాల యేసుపాదం భారీ ర్యాలీతో వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు. గ్రామంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మద్దతుదారులు పెద్ద సంఖ్యలో ర్యాలీలో పాల్గొన్నారు. గ్రామంలో ఉత్సాహభరిత వాతావరణంలో ర్యాలీ కొనసాగగా, అనంతరం సంబంధిత అధికారులకు చిత్రాల యేసుపాదం తన నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా చిత్రాల యేసుపాదం మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ప్రజలు తనపై నమ్మకం ఉంచి ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల ఆశీస్సులతో సర్పంచ్‌గా విజయం సాధిస్తే గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ఎమ్మెల్యే సహకారంతో గ్రామానికి అవసరమైన అభివృద్ధి పనులను చేపట్టేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. గ్రామంలోని ప్రధాన సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని, తాగునీరు, రహదారులు, వీధి దీపాలు, పారిశుద్ధ్యం, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని తెలిపారు. గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని ముందుకు సాగుతూ ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడిగా సేవలు అందిస్తానని చెప్పారు. గ్రామ ప్రజలు తనకు అందించే ప్రతి అవకాశాన్ని ప్రజా సేవకు వినియోగిస్తానని, గ్రామ అభివృద్ధి కోసం అందరి సహకారంతో పనిచేస్తానని చిత్రాల యేసుపాదం వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మద్దతుదారులు పాల్గొన్నారు.

కామినేని పల్లెఅభివృద్ధికి డబుల్ ఇంజన్ బలం

ఎంపీపీ, సర్పంచ్ కలిస్తే గ్రామ ప్రగతికి బాటలు





సిరివెళ్ల నవంబర్ 23(నంది పత్రిక) నంద్యాల జిల్లా సిరివెళ్ల మండలం కామినేని పల్లె గ్రామం నుంచి మెరువ శాంతి నరసింహారెడ్డి ఎంపీపీగా ఎన్నిక కావడం గ్రామ అభివృద్ధికి గొప్ప అవకాశంగా గ్రామస్థులు భావిస్తున్నారు. గ్రామం నుంచి నాయకురాలు మండల స్థాయిలో బాధ్యతలు చేపట్టడంతో కామినేని పల్లె అభివృద్ధికి మరింత బలం చేకూరుతుందని అభిప్రాయపడుతున్నారు.ఎంపీపీ మెరువశాంతి నరసింహారెడ్డి గ్రామ సర్పంచ్ ఒక్కటై సమన్వయంతో ముందుకు సాగితే గ్రామ అభివృద్ధి పనులకు మరింత వేగం వచ్చే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. మండల స్థాయి నాయకత్వం, గ్రామస్థాయి పాలన కలిసి పనిచేస్తే గ్రామ సమస్యల పరిష్కారంతో పాటు అభివృద్ధి పనులకు ప్రభుత్వ సహకారం, నిధులు సమకూర్చుకోవడంలో అనుకూల పరిస్థితులు ఏర్పడతాయని ఆశిస్తున్నారు.గ్రామంలో రహదారులు, తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, డ్రైనేజీలు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధికి సమిష్టి కృషి అవసరమని గ్రామస్థులు అభిప్రాయపడుతున్నారు. ఎంపీపీ, సర్పంచ్ ఒకే లక్ష్యంతో పనిచేస్తే ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టి కామినేని పల్లె ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దే అవకాశం ఉందని అంటున్నారు.

ఎంపీపీ అండ.. సర్పంచ్ నాయకత్వం గ్రామ అభివృద్ధిని ప్రధాన లక్ష్యంగా తీసుకుని ఎంపీపీ మెరువ శాంతి నరసింహారెడ్డి అండతో సర్పంచ్ అభ్యర్థి లక్క జయమ్మ ముందుకు సాగితే కామినేని పల్లె మరింత ప్రయోజనం చేకూరుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. గ్రామ సమస్యల పరిష్కారం, ప్రజలకు మెరుగైన సౌకర్యాల కల్పన, అభివృద్ధి పనుల అమలులో ఇద్దరి సమన్వయం కీలకంగా మారనుందని పేర్కొంటున్నారు. కామినేని పల్లె భవిష్యత్తు అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని సర్పంచ్ అభ్యర్థి లక్క జయమ్మఅధిక మెజారిటీతో మద్దతు తెలిపి గెలిపించాలని గ్రామ ఓటర్లకు విజ్ఞప్తి చేస్తున్నారు. మండల స్థాయి అండ, గ్రామ స్థాయి నాయకత్వం కలిస్తే కామినేని పల్లె అభివృద్ధికి కొత్త దిశ చూపుతుందనే ఆకాంక్ష గ్రామంలో వ్యక్తమవుతోంది.

రాత్రి 10 గంటల వరకు తరగతి గదులు నిర్వహణపై చర్యలు తీసుకోవాలి- ఏబీవీపీ



నంద్యాల ప్రతినిధి. నవంబర్ 23 . (నంది పత్రిక):నంద్యాల జిల్లాలో పలు ప్రైవేట్ పాఠశాలలు, విద్యార్థులను ఒత్తిడికి గురిచేస్తూ, ఉదయం 7 గంటల నుండి రాత్రి 10:00 వరకు లేదా 10:30 వరకు కూడా తరగతి గదులను నిర్వహిస్తున్నారు. వీటి పైన తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ పిల్లలు ఉదయం 7 నుంచి రాత్రి 10:30 వరకు, స్టడీ క్లాసుల పేరుతో, మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారని, అంతేగాక రాత్రి 9 అయితే చలి తీవ్రత ఎక్కువగా ఉంది, అలాంటి పరిస్థితుల్లో కూడా 10:30 వరకు తరగతి గదులు నిర్వహించడం ఏంటని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విధంగా తరగతి గదులు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో మానసిక ఒత్తిడి, అనారోగ్యాల పాలవుతారని తల్లిదండ్రులు భావిస్తున్నారు. దీనిని గమనించిన అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నంద్యాల శాఖ, వీటి పైన కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థులపై తీవ్రంగా ఒత్తిడికి గురిచేస్తున్న, పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని, డీఈవో జనార్దన్ ని కలిసి కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగ కన్వీనర్ మహేష్ నాయుడు, సిటీ సెక్రెటరీ నరేష్, చైతన్య , నరసింహ పాల్గొన్నారు.

సీపీఐ మద్దతుతో అంబాపురం సర్పంచ్ అభ్యర్థుల నామినేషన్ పత్రాలు దాఖలు.

బేతంచెర్లనవంబర్ 23 (నంది పత్రిక). భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ మద్దతుతో అంబాపురం గ్రామ సర్పంచ్ అభ్యర్థులుగా గుండి చంద్రశేఖర్ గోనెల సోమన్న మరియు 2వ వార్డు అభ్యర్థి గా వడ్డె రాజలక్ష్మి లు నామినేషన్ దాఖలు చేశారు.ఈ నామినేషన్ కార్యక్రమం లో సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్ యన్న, సహాయ కార్యదర్శి తాలూకా. తిరుమలేష్, ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్,ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ మండల కార్యదర్శులు ప్రదీప్, మధు మరియు సీపీఐ నాయకులు బాలు, గోపి, అంబాపురం గ్రామ సీపీఐ నాయకులు నాగేశేరరావు, నాగేష్, శ్రీరాములు, సురేష్ మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ



బేతంచెర్ల నవంబర్ 23 (నంది పత్రిక). బేతంచెర్ల పట్టణం నందున్న శేషారెడ్డి సామాజిక ఆరోగ్య కేంద్రం (ప్రభుత్వ ఆస్పత్రి) నందు, లయన్స్ క్లబ్ ఆఫ్ బేతంచెర్ల వారి ఆధ్వర్యంలో, కీ.శే.సిరిగిరి మల్లి కార్జునయ్య జ్ఞాపకార్థం వారి కుమారుడు సిరిగిరి నాగార్జున (అసిస్టెంట్ ఎపిఎస్పి డిసిఎల్) సహకారంతో గర్భిణీలకు,చికిత్స నిమిత్తం ఆసుపత్రికి వచ్చిన వారికి,అన్న ప్రసాద వితరణ కార్యక్రమం సోమవారం నాడు నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సూరా మధు సుధాకర్ రెడ్డి, ఓం శాంతి రమేష్, రామచంద్రయ్య,మారం పవన్ కుమార్,జంపాల శ్రీకాంత్, కమల్ భాష, మద్దయ్య లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో దుప్పట్ల పంపిణీ.

జెఎస్ఎస్ బ్రహ్మానంద చారి.

బేతంచెర్లనవంబర్23(నందిపత్రిక). బేతంచర్ల పట్టణంలోని మిస్ప వృద్ధాశ్రమంలో పలుకూరు గ్రామానికి చెందిన వై.దాయిదు సహకారంతో 30 మంది వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేసినట్లు జెకెఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జేఎస్ ఎస్ బ్రహ్మానందచారి తెలిపారు. ఈ కార్యక్రమం ఉద్దేశించి బ్రహ్మానంద చారి మాట్లాడుతూ వృద్ధుల సేవే భగవంతుడి సేవ అని, ప్రతి ఒక్కరు కూడా వృద్ధులకు సేవ చేయాలని బ్రహ్మానంద చారి అన్నారు. వృద్ధాశ్రమ నిర్వాహకుడు జక్రయ మాట్లాడుతూ మా ఆశ్రమంలో 30 మంది వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేసిన దాయిదుకు కృతజ్ఞతలు తెలిపారు. మా ఆశ్రమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా గుర్తించాలని, అలాగే దాతలు కూడా సహకరించాలని జక్రయ విజ్ఞప్తి చేశారు.అనంతరం ఆశ్రమంలోని 30 మంది వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం వృద్ధాశ్రమ నిర్వాహకుడు జకరయ్యను శ్రీ జేకారు సంక్షేమ సంఘం అధ్యక్షుడు జె ఎస్ ఎస్ బ్రహ్మానందచారిని ఘనంగా సన్మానించారు.వృద్ధాశ్రమ వృద్ధులు పలుకూరుకి చెందిన వై. దాయిదు, మద్దయ్య,కరెంట్ రాజు మరియు వృద్ధులు పాల్గొన్నారు.అనంతరం 30 మంది వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు.



సీపీఐ మద్దతుతో అంబాపురం సర్పంచ్ అభ్యర్థుల నామినేషన్ పత్రాలు దాఖలు.



బేతంచెర్లనవంబర్ 23 (నంది పత్రిక). భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ మద్దతుతో అంబాపురం గ్రామ సర్పంచ్ అభ్యర్థులుగా గుండి చంద్రశేఖర్ గోనెల సోమన్న మరియు 2వ వార్డు అభ్యర్థి గా వడ్డె రాజలక్ష్మి లు నామినేషన్ దాఖలు చేశారు.ఈ నామినేషన్ కార్యక్రమం లో సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్ యన్న, సహాయ కార్యదర్శి తాలూకా.తిరుమలేష్,ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్,ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ మండల కార్యదర్శులు ప్రదీప్, మధు మరియు సీపీఐ నాయకులు బాలు, గోపి, అంబాపురం గ్రామ సీపీఐ నాయకులు నాగేశేరరావు, నాగేష్, శ్రీరాములు, సురేష్ మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

బేతంచెర్ల నగర పంచాయితీ చైర్ పర్సన్, వార్డు సభ్యుల ప్రమాణ స్వీకారం.



బేతంచెర్ల నవంబర్ 23 (నందిపత్రిక). బేతంచెర్ల నగర పంచాయితీ కార్యాలయంలో సోమవారం బనగానపల్లె రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ నరేంద్రనాథ్ రెడ్డి స్పెషల్ ఆఫీసర్ గా, బేతంచెర్ల నగర పంచాయితీ కమిషనర్ హరిప్రసాద్ ఆధ్వర్యంలో,బేతంచెర్ల నగర పంచాయితీ ఎన్నికలో గెలుపొందిన వైసిపి, టిడిపి వార్డు కౌన్సిలర్లు సోమవారం పదవీ ప్రమాణం చేశారు. బేతంచెర్ల నగర పంచాయితీ చైర్ పర్సన్ గా దూదేకుల దస్తగిరి ప్రమాణం చేసి పదవీ భాద్యతలు చేపట్టారు. ఆయనతో పాటు వైఎస్ఆర్సిపి తరుపున గెలిచిన 18 మంది వార్డు కౌన్సిలర్లు పదవీ ప్రమాణం చేశారు.వీరిలో వైస్ ఛైర్మెన్ గా చింత నాగిరెడ్డిని ఎన్నుకోవడం జరిగింది.అలాగే తెలుగు దేశం పార్టి నుండి గెలిచిన 10 మంది వార్డు కౌన్సిల్ సభ్యులు కుడా ప్రమాణాలు చేసి, పదవీ భాద్యతలు చేపట్టారు.



రాజాసాహెబ్ పేట అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తా..

ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటా:సనమాల రాజు

వంకాయ గుర్తుపై ఓటు వేసి సర్పంచ్‌గా అవకాశం కల్పించాలని గ్రామ ప్రజలకు విజ్ఞప్తి



పోరుమామిళ్ల, నవంబర్ 23(నంది పత్రిక): వైఎస్ఆర్ కడప జిల్లా పోరుమామిళ్ల మండలం రాజాసాహెబ్ పేట గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సనమాల రాజు పోటీ చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన గ్రామ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధిని ప్రధాన లక్ష్యంగా పెట్టుకొని సర్పంచ్ అభ్యర్థిగా మీ ముందుకు వస్తున్నానని తెలిపారు. తనకు ఒక అవకాశం కల్పించి వంకాయ గుర్తుపై తమ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని గ్రామ ప్రజలను కోరారు. సర్పంచ్‌గా విజయం సాధిస్తే గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేయడంతో పాటు పారిశుధ్య నిర్వహణ, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణం, వీధిలైట్ల ఏర్పాటు, గ్రామంలోని మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తానని పేర్కొన్నారు. అదేవిధంగా గ్రామ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను నేరుగా తెలుసుకొని, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా సంబంధిత అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్తానని తెలిపారు. గ్రామంలో ఏ కుటుంబానికి ఏ అవసరం వచ్చినా తన పరిధిలో సాధ్యమైనంత సహాయ సహకారాలు అందిస్తూ ప్రజాసేవకు అంకితమవుతానని హామీ ఇచ్చారు.కావున గ్రామ ప్రజలందరూ సహకరించి వంకాయ గుర్తుపై ఓటు వేసి తనకు అవకాశం కల్పించాలని సనమాల రాజు విజ్ఞప్తి చేశారు.

వీరారెడ్డి పల్లె అభివృద్ధే లక్ష్యం.. అవకాశం ఇస్తే ప్రజలకు నిరంతరం సేవ చేస్తా: సర్పంచ్ అభ్యర్థి మందాల శివారెడ్డి



సిరివెళ్లనవంబర్ 23 (నంది పత్రిక):వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సిరివెళ్ల మండలం వీరారెడ్డి పల్లె గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి మందాల శివారెడ్డి గ్రామ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా ఎన్నికల బరిలో నిలిచారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలు తనపై నమ్మకంతో ఓటు వేసి గెలిపిస్తే, అందరికీ అందుబాటులో ఉంటూ నిస్వార్థంగా సేవలు అందిస్తానని హామీ ఇచ్చారు.గ్రామంలో నెలకొన్న పారిశుధ్య సమస్యలను పరిష్కరించడం, తాగునీటి సరఫరాను మెరుగుపరచడం, వీధి దీపాల ఏర్పాటు, సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. గ్రామంలోని అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయడంతో పాటు, మహిళలు, వృద్ధులు, యువత సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ పరిష్కారా నికి కృషి చేస్తానన్నారు. గ్రామంలో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తూ, ప్రతి వీధి అభివృద్ధి చెందేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతానని పేర్కొన్నారు. గ్రామానికి మరింత మెరుగైన సేవలు అందిస్తానని ఆయన మాట ఇచ్చారు. రాజకీయాలకు అతీతంగా గ్రామంలోని ప్రతి ఒక్కరినీ కలుపుకొని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తానని తెలిపారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలు తనకు ఒక అవకాశం ఇచ్చి, కత్తెర గుర్తుపై తమ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని మందాల శివారెడ్డి ప్రజలను విజ్ఞప్తి చేశారు.

పుణ్యక్షేత్రాలలో పరమేశ్వరికి పూజలు



బండి ఆత్మకూరు నంది పత్రిక నవంబర్ 23: కార్తీక మాసం రెండవ సోమవారం సందర్భంగా శైవ క్షేత్రాలలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని పూజలు నిర్వహించారు. బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న ఓంకార సిద్దేశ్వర స్వామి ఆలయంలో, కడమలకాల్వ గ్రామంలోని శివనంది ఆలయం తో పాటు కృష్ణనంది ఆలయంలో భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు. భక్తి శ్రద్ధలతో ఓంకార పుణ్యక్షేత్రంలోని పంచభూగ్గల కోనేరులో స్నానం ఆచరించారు. కార్తీక దీపాలు వెలిగించి స్వామివారికి పంచామృత అభిషేకం చేయించారు. అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించి పూజా కార్యక్రమాలలో పాల్గొని పరమేష్టి సేవలో పాల్గొని భక్తులు తరించారు. ఈ సందర్భంగా ఓంకార సిద్దేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీ సాయి నాత్యాంజలి కూచిపూడి క్షేత్రము నంద్యాల వారిచే కూచిపూడి నాట్య ప్రదర్శనను నిర్వహించారు. కూచిపూడి నాట్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం దేవస్థానమునకు వచ్చు భక్తులకు ప్రసాద వితరణ గావించారు. ఈ కార్యక్రమంలో ఓంకార దేవస్థానం చైర్మన్ అల్లే చెన్నారెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నాగప్రసాద్ తోపాటు ధర్మకర్తల మండలి సభ్యులు అర్చకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి నాయకత్వ బాధ్యతలోకి రవీంద్రనాథ్..

బాల అకాడమీలో ఘన సత్కారం!



నంద్యాల సిటీ బ్యూరో నవంబర్ 23(నంది పత్రిక)

విద్యారంగంలో విశేష సేవలు అందిస్తూ, విద్యాసంస్థల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న బాల అకాడమీ డైరెక్టర్ ఎంజీఎఫ్ లయన్ జి.వి. రవీంద్రనాథ్ ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్నిక కావడం పాఠశాల కుటుంబానికి గర్వకారణంగా నిలిచింది. ఈ సందర్భంగా బాల అకాడమీలో ఉపాధ్యాయులు, విద్యార్థుల ఆధ్వర్యంలో ప్రత్యేక అభినందన సభ నిర్వహించి ఆయనను ఘనంగా సత్కరించారు.

ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు రవీంద్రనాథ్ కు పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాతో సత్కరించి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఒక విద్యాసంస్థ అభివృద్ధికి మాత్రమే పరిమితం కాకుండా రాష్ట్రస్థాయిలో విద్యారంగానికి సేవలందించే ఉన్నత బాధ్యతను చేపట్టడం ఎంతో ప్రశంసనీయమని కొనియాడారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్ మాట్లాడుతూ..ఏపీ, పి .పి ఎస్,ఏ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా తనకు లభించిన ఈ బాధ్యత ఎంతో గౌరవప్రదమైనదని, అదే సమయంలో మరింత బాధ్యతతో పనిచేయాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తోందని తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ప్రైవేట్ పాఠశాలల అభివృద్ధికి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, విద్యా ప్రమాణాల పెంపునకు తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం, ఉపాధ్యాయులకు తగిన ప్రోత్సాహం కల్పించడం, విద్యాసంస్థల మధ్య సమన్వయం పెంపొందించడం వంటి అంశాలకు ప్రాధాన్యతనిస్తూ మరింత కర్తవ్యనిష్ఠతో పనిచేస్తానని తన ప్రసంగం ద్వారా తెలియజేశారు. అలాగే, ఒక వ్యక్తికి లభించే పదవి కేవలం హోదా మాత్రమే కాదని, సమాజానికి మరింత సేవ చేసే అవకాశమని, బాధ్యతను నిబద్ధతతో నిర్వహించినప్పుడే ఆ పదవికి నిజమైన గౌరవం లభిస్తుందని ఆయన సందేశమిచ్చారు. రవీంద్రనాథ్ ఈ రాష్ట్రస్థాయి ఎన్నిక బాల అకాడమీ విద్యా ప్రస్థానంలో ఒక విశేష గౌరవంగా నిలిచిందని ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఆయన సాధించిన ఈ గుర్తింపు విద్యార్థులకు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవడానికి, ఉపాధ్యాయులకు మరింత అంకితభావంతో పనిచేయడానికి స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు. ఈ అభినందన సభ ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరిగింది. బాల అకాడమీ కుటుంబమంతా రవీంద్రనాథ్ కు మరోసారి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, ఆయన రాష్ట్రస్థాయిలో మరిన్ని ఉన్నత బాధ్యతలు చేపట్టి విద్యారంగానికి విశేష సేవలందించాలని ఆకాంక్షించారు.



కేజీబీవీ స్కూల్లో న్యాయ విజ్ఞాన సదస్సు..

పోక్సో చట్టంపై అవగాహన కల్పిస్తున్న

పారా లీగల్ వాలంటీర్ చెన్నకేశవన్



చాగలమర్రి నవంబర్ 23, నంది పత్రిక మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఇచ్చిన ఆదేశాల మేరకు సోమవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక తహసిల్దార్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ మౌనిక, కేజీబీవీ స్కూల్ ప్రిన్సిపల్ స్వప్న కుమారి హాజరయ్యారు. ఈ సందర్భంగా పారా లీగల్ వాలంటీర్ చెన్నకేశవన్ మాట్లాడుతూ సురక్షిత్ బచ్చన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులకు ఫోక్సో చట్టం గురించి అవగాహన నిర్వహించారు. లైంగిక వేధింపుల నుంచి బాలలను రక్షించే చట్టం, భారత పార్లమెంట్ ఆమోదించిన ప్రతిష్టాత్మకమైన చట్టం, మహిళా శిశువు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఒక మార్గదర్శకాన్ని ఆమోదించిన చట్టమని ఆయన తెలిపారు. 18 సంవత్సరాల లోపు వారందరినీ పొక్సో చట్టం పరిగణలోకి తీసుకుందన్నారు. లింగభేదం లేదు బాధితులు బాలురైన బాలికలైన ఇతరులైన అందరికీ చట్టం రక్షణ కల్పిస్తుంది అన్నారు. నేర తీవ్రతను బట్టి జైలు శిక్షలు మరణ శిక్ష కూడా విధించే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

అప్రజాస్వామ్య పద్ధతుల్లో మున్సిపల్ వైస్ చైర్మన్ పీఠం కైవసం

టీడీపీ తీరుపై శిల్పా రవిరెడ్డి తీవ్ర ఆగ్రహం





క్యాంప్ రాజకీయాలు, ప్రలోభాలతో అధికార పార్టీ కుట్రలు: మాజీ ఎమ్మెల్యే విమర్శ

గైర్హాజరైన వైసీపీ అభ్యర్థి ఆచూకీపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్

ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారన్న ఎమ్మెల్సీ ఇసాక్ బాషా

నంద్యాల సిటీ బ్యూరో నవంబర్ 23 ,(నంది పత్రిక)

మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక ప్రక్రియలో తెలుగుదేశం పార్టీ అప్రజాస్వామ్య పద్ధతులను అనుసరించిందని నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి తీవ్రంగా ఆరోపించారు. వార్డు కౌన్సిలర్లు, చైర్మన్ మరియు వైస్ చైర్మన్ ప్రమాణస్వీకార కార్యక్రమం అనంతరం, స్థానిక వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికార పార్టీ కుట్రలపై ఆరోపణలు: మున్సిపల్ ఎన్నికల్లో వైసీపీకి స్పష్టమైన మెజారిటీ (27 స్థానాలు) ఉన్నప్పటికీ, టీడీపీ క్యాంప్ రాజకీయాలకు తెరలేపిందని శిల్పా రవిరెడ్డి విమర్శించారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభం నుండి ప్రమాణస్వీకారం వరకు అధికార పార్టీ కుట్రలు పన్నిందని, తమ పార్టీకి చెందిన ఒక కౌన్సిలర్ అభ్యర్థిని సభకు రాకుండా అడ్డుకున్నారని ఆయన ఆరోపించారు. ఆ అభ్యర్థిని ఎక్కడ ఉంచారు, బెదిరించారా లేదా ప్రలోభాలకు గురిచేశారా అనే విషయంపై ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రక్రియపై అభ్యంతరాలు: కౌన్సిల్ సమావేశంలో వైస్ చైర్మన్ ఎన్నిక సందర్భంగా చేతులు ఎత్తి మద్దతు తెలిపే క్రమంలో టీడీపీ కౌన్సిలర్ ఖండే శ్యాంసుందర్ లాల్ సుముఖంగా లేకపోయినా, ఎంపీ శబరి స్వయంగా ఆయన చేతిని పైకి ఎత్తడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని శిల్పా రవిరెడ్డి పేర్కొన్నారు. నందికోట్కూరులో ఓటు హక్కు వినియోగించుకోవాల్సిన ఎంపీ నంద్యాలలో ఓటు వేయడం, కొత్త జీఓల ద్వారా చైర్మన్‌కు అదనపు ఓటు హక్కు కల్పించడం వంటి చర్యలతో అర్హత లేకపోయినా టీడీపీ వైస్ చైర్మన్ పదవిని దక్కించుకుందని శిల్పా రవిరెడ్డి విమర్శించారు. ప్రలోభాలకు లొంగకుండా నిలబడిన వైసీపీ కౌన్సిలర్లను అభినందించారు. పోలీసుల తీరు, భవిష్యత్ కార్యాచరణ: తనను హౌస్ అరెస్ట్ చేయడానికి చూపిన ఉత్సాహాన్ని పోలీసులు ప్రజాస్వామ్య పరిరక్షణకు, ప్రజలకు రక్షణ కల్పించడానికి చూపాలని శిల్పా రవిరెడ్డి హితవు పలికారు. ప్రస్తుత పరిణామాలకు రానున్న రోజుల్లో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. తమ పార్టీలోని లోపాలను సరిదిద్దుకుని మరింత బలోపేతమై 2029 ఎన్నికల్లో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ ఇసాక్ బాషా స్పందన: ఈ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ ఇసాక్ బాషా మాట్లాడుతూ.. మెజారిటీ ఉన్న వైసీపీని కాదని క్యాంప్ రాజకీయాలతో టీడీపీ నేతలు వైస్ చైర్మన్ పదవిని దక్కించుకోవడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు వంటిదని విమర్శించారు. నంద్యాల మున్సిపాలిటీలో అధికార పార్టీ అనుసరించిన తీరు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. పదవులు ఉన్నా లేకపోయినా తాము ప్రజలకు అండగా ఉంటామని, రాబోయే రెండేళ్లలో తిరిగి వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.



Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications #D.NO.: 1-639-1-7-11, NEAR NANDYAL ROAD, CPI COLONY, 4TH ROAD, TADIPARI, ANANTHAPURAMU, ANDHRA PRADESH-515411, GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No:-APTEL/26/A6831. Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com

పతివ్రత పుణ్యం ముందు యమపాశం కూడా చిన్నపోతుంది

-పండితురాలు పసుపులేటి నీలిమ

ఇంట్లో ఒక్క దీపం వెలిగితే చాలు -

ఆ ఇల్లే వైకుంఠమవుతుంది

కర్నూలు ప్రతినిధి. నవంబర్ 23 . (నంది పత్రిక): కార్తిక మాసాన్ని పురస్కరించుకుని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఆధ్వర్యంలో కర్నూలు నగరం, నాగిరెడ్డి రెవిన్యూ కాలనీలోని శ్రీ భరతమాత దేవస్థానం నందు జరుగుతున్న ధార్మిక ప్రవచన సప్తాహంలో భాగంగా ఆరవ రోజు సుశీల – మందర వృత్తాంతాన్ని తెలుగు పండితురాలు పసుపులేటి నీలిమ అత్యంత హృద్యంగా ప్రవచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కార్తిక పురాణంలో సుశీల – మందర కథ కేవలం ఒక కథ కాదని, ప్రతి కుటుంబానికి దారి చూపే దీప స్తంభం లాంటిదని వివరించారు. పూర్వం మందరుడు అనే బ్రాహ్మణుడు వేదాలు చదివి కూడా దుష్ట సావాసంతో దారి తప్పాడు. దొంగతనాలు, మద్యపానంతో పాపపు జీవితం గడిపాడు. కానీ అతని భార్య సుశీల మాత్రం పాతివ్రత్య ధర్మానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచింది. భర్త ఎంత చెడ్డవాడైనా భర్తనే దైవంగా భావించి, ప్రతిరోజూ కార్తిక స్నానం, దీపారాధన, తులసి పూజ, ఏకాదశి ఉపవాసం చేస్తూ తన పుణ్యాన్నంతా భర్త కోసమే ధారపోసింది. ఒకరోజు మందరుడు దొంగతనానికి వెళ్ళి రాజభటుల చేతిలో చిక్కి మరణించాడు. యమదూతలు అతన్ని నరకానికి తీసుకుపోవడానికి వచ్చారు. అదే సమయంలో సుశీల చేసిన కార్తిక వ్రత పుణ్యం వల్ల విష్ణుదూతలు ప్రత్యక్షమై, ఈ మందరుడు పాపి కావచ్చు, కానీ ఇతని భార్య చేసిన కార్తిక వ్రత పుణ్యం వల్ల ఇతనికి మోక్షం లభిస్తుంది అని చెప్పి, అతన్ని వైకుంఠానికి తీసుకువెళ్ళారు. భార్య వెలిగించిన ఒక్క కార్తిక దీపం భర్త చేసిన వేయి పాపాలను కాల్చివేస్తుంది. భార్య చేసిన ఒక్క ఉపవాసం భర్తకు స్వర్గాన్ని తెచ్చిపెడుతుంది. అందుకే కార్తికంలో స్త్రీ చేసే పూజ కేవలం తన కోసం కాదు, తన కుటుంబం కోసం అని పసుపులేటి నీలిమ కళ్ళు చెమర్చేలా వివరించారు. సుశీలలాంటి భార్య ఉంటే మందరుడిలాంటి భర్త కూడా తరిస్తాడు. అందుకే ఇంట్లో ఒక్కరైనా కార్తిక వ్రతం చేస్తే ఆ ఇంట్లో ఉన్నవారందరూ తరిస్తారని, అదే కార్తిక మహిమ అని పేర్కొన్నారు. ప్రవచనానంతరం భక్తులు సామూహికంగా నామసంకీర్తన, దీపారాధన చేసి, సుశీలమ్మను స్మరించుకుంటూ తులసి కోట వద్ద ప్రదక్షిణలు చేశారు. ఈ కార్యక్రమంలో హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి, భరతమాత సేవా సమితి అధ్యక్షులు సందడి మహేశ్, విష్ణు సహస్ర నామ సంఘం అధ్యక్షులు మల్లెల పెద్దపుల్లారెడ్డి, వేదపండితులు భరద్వాజ్ శర్మ, గోపీశర్మ, ఎన్. చంద్రారెడ్డి, వై. శివశంకర్ రెడ్డి, ధార్మిక ప్రవచకులు విద్వాన్ మారేడు రాముడు, వసుంధరమ్మ, లావణ్య, సీతమ్మ, నందమ్మ, రామసుబ్బమ్మ, శకుంతలతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



మైదుకూరు మున్సిపాలిటీలో కౌన్సిలర్‌గా ప్రమాణ స్వీకారం చేసిన దొండపాటి వరకుమార్‌కు సన్మానం

ఖాజీపేట (నంది పత్రిక) మైదుకూరు), నవంబర్ 23: మైదుకూరు పట్టణ మున్సిపాలిటీలో 14వ వార్డు కౌన్సిలర్‌గా దొండపాటి వరకుమార్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయనను దేవకుమార్ విజయుడు, ఇశ్రాయేలు, జైకే పాలు, సంతోష్ కుమార్ తదితరులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ దొండపాటి వరకుమార్‌కు అభినందనలు తెలియజేస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ వార్డు అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు.



ఎర్రగుంట్ల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తా..

ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటా: రిహానా బేగం దంపతులు

మంచం గుర్తుపై ఓటు వేసి సర్పంచ్‌గా అవకాశం కల్పించాలని గ్రామ ప్రజలకు విజ్ఞప్తి



సిరివెళ్ల నవంబర్ 23(నంది పత్రిక): సిరివెళ్లమండల పరిధిలోని ఎర్రగుంట్ల గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ బలపరిచిన రీహానా బేగం దంపతులు పోటీ చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన గ్రామ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధిని ప్రధాన లక్ష్యంగా పెట్టుకొని సర్పంచ్ అభ్యర్థిగా మీ ముందుకు వస్తున్నానని తెలిపారు. తనకు ఒక అవకాశం కల్పించి మంచం గుర్తుపై తమ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని గ్రామ ప్రజలను కోరారు. సర్పంచ్‌గా విజయం సాధిస్తే గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేయడంతో పాటు పారిశుధ్య నిర్వహణ, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణం, వీధిలైట్ల ఏర్పాటు, గ్రామంలోని మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తానని పేర్కొన్నారు. అదేవిధంగా గ్రామ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను నేరుగా తెలుసుకొని, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా సంబంధిత అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్తానని తెలిపారు. గ్రామంలో ఏ కుటుంబానికి ఏ అవసరం వచ్చినా తన పరిధిలో సాధ్యమైనంత సహాయ సహకారాలు అందిస్తూ ప్రజాసేవకు అంకితమవుతానని హామీ ఇచ్చారు.కావున గ్రామ ప్రజలందరూ సహకరించి మంచం గుర్తుపై ఓటు వేసి తనకు అవకాశం కల్పించాలని రిహానా బేగం దంపతులు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ యొక్క కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మందుల రామకృష్ణ, బరకోట్ల ఉసేని, అత్తర్ రఫీ కాంగ్రెస్ పార్టీ అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు.

గుంతకల్ డివిజన్ రైల్వేయూజర్స్,కమిటీ సభ్యుడిగా పఠాన్ కరిముల్లా ఖాన్ (ఖలీం)

నందలూరు,(నంది పత్రిక ప్రతినిధి)నవంబర్ 23. గుంతకల్ డివిజన్ రైల్వే యూజర్స్ కమిటీ (ణ=ఖజజ) సభ్యుడిగా పఠాన్ కరిముల్లా ఖాన్ (ఖలీం)నియమితులయ్యారు. ఈ మేరకు గుంతకల్ సీనియర్ డీసీఎంసత్యనారాయణనియామకఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఖలీం మాట్లాడుతూ, తన కుటుంబానికి రైల్వే శాఖతో మూడు తరాల అనుబంధం ఉందని గుర్తు చేసుకున్నారు. బ్రిటిష్ కాలంలో నందలూరుకు రైల్వే సర్వీసులు ప్రారంభమైనప్పుడు తన తాత షేక్ మహమ్మద్ హుస్సేన్ రైల్వేడ్రైవర్‌గాసేవలందించారని తెలిపారు. తండ్రి షఫాయతుల్లా ఖాన్ (ూ.ు. ఖష్ణుఅ) గుంతకల్ డివిజన్‌లో రిటైర్డ్ సీనియర్ ప్యాసింజర్ డ్రైవర్‌గా పనిచేశారని, దక్షిణ మధ్య రైల్వే తరపున ఇరాక్ దేశంలో రెండేళ్ల పాటువిధులునిర్వర్తించి ఎన్నో సేఫ్టీఅవార్డులు అందుకున్నారని పేర్కొన్నారు.నూతనంగా ఏర్పాటైన విశాఖ రైల్వే జోన్ పరిధిలోని గుంతకల్ డివిజన్‌కుమొట్టమొదటి డీఆర్‌యూసీసీ (ణ=ఖజజ) సభ్యుడిగా తనను నామినేట్ చేసేందుకు కృషి చేసిన రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథ్ రెడ్డి కి,సహాయసహకారాలు అందించిన రాజంపేట మాజీ ఎమ్మెల్యే మేడా వెంకట మల్లికార్జున రెడ్డి కి, నందలూరు మండల మాజీ ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి కి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలుతెలియజేశారు.డివిజన్‌లోని ప్రయాణికులు, రైల్వే సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాననిహామీఇచ్చారు.తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన ధన్యవాదాలుతెలిపారు.



పోక్సో కేసులో మలయాళ నటుడికి ఏడాది జైలుశిక్ష

పాఠశాల విద్యార్థుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన కేసులో మలయాళ నటుడు శ్రీజిత్ రవికి కేరళలోని త్రిస్సూర్ ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక కోర్టు ఏడాది జైలు శిక్ష విధించింది. పోక్సో (ూూజూూ) చట్టం కింద దాఖలైన ఈ కేసులో శిక్షతో పాటు అతనికి రూ.50,000 జరిమానా కూడా విధిస్తూ న్యాయస్థానం తీర్పు వెలువరించింది. అయితే, ఈ తీర్పుపై పైకోర్టులో అప్పీల్ చేసుకునేందుకు వీలుగా శ్రీజిత్ రవికి కోర్టు నెల రోజుల గడువుతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసు నేపథ్యాన్ని పరిశీలిస్తే.. 2022 జూలై 4న త్రిస్సూర్‌లోని అయ్యంతోల్ గ్రౌండ్ సమీపంలో శ్రీజిత్ రవి పాఠశాల విద్యార్థుల ఎదుట అసభ్యంగా ప్రవర్తించారని (ఇండీసెంట్ ఎక్స్‌పోజర్) ఆరోపణలు వచ్చాయి. ఇద్దరు చిన్నారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన పోలీసులు, ఘటనా స్థలంలోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించి అతడిని అదుపులోకి తీసుకున్నారు.

విద్యార్థుల జీవితంలో పదవతరగతి కీలకమైన మైలురాయి.



నంద్యాల సిటీ బ్యూరో నవంబర్ 23 (నంది పత్రిక) విద్యార్థుల జీవితాల్లో పదవతరగతి అత్యంత కీలకమైన మైలురాయి అని శ్రీ సంకల్ప, శ్రీ శాంతినికేతన్ విద్యాసంస్థల అధినేత సుధాకర్ పేర్కొన్నారు. నంద్యాల పట్టణం సంజీవనగర్ శ్రీ సంకల్ప్ ఒలింపియాడ్ పాఠశాలలో సోమవారం శ్రీ శాంతినికేతన్ శ్రీ సంకల్ప్ విద్యా సంస్థల పదవ తరగతి విద్యార్థులను వార్షిక పరీక్షలకు మరింత సమర్థవంతంగా సన్నద్ధం చేయాలనే లక్ష్యంతో పదవ తరగతి పాఠ్యాంశాలకు సంబంధించిన బ్రెయిన్ బాటిల్ క్విజ్ పోటీని ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు.ఈ పోటీలలో పదో తరగతి పాఠ్యపుస్తకాలలోని వివిధ అంశాలపై ప్రశ్నలు అడగగా విద్యార్థులు ఎంతో ఆసక్తితో, ఉత్సాహంతో సమాధానాలు ఇచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులలోని జ్ఞాపకశక్తి, విషయ పరిజ్ఞానం,సమయస్ఫూర్తి, పోటీతత్వం వెలుగులోకి వచ్చాయి.ఈ సందర్భంగా శ్రీ సంకల్ప్ , శ్రీ శాంతినికేతన్ విద్యాసంస్థల అధినేత పాఠశాల అధినేత సుధాకర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, పదవ తరగతి విద్యార్థుల జీవితంలో అత్యంత కీలకమైన మైలురాయి అని పేర్కొన్నారు. పాఠ్యాంశాలను కేవలం పరీక్షల కోసమే కాకుండా, ప్రతి అంశాన్ని పూర్తిగా అర్థం చేసుకొని అధ్యయనం చేయాలని సూచించారు.ఇటువంటి క్విజ్ పోటీలు విద్యార్థుల్లో చదువుపట్ల ఆసక్తిని పెంపొందించడమే కాకుండా, తమ ప్రతిభను పరీక్షించుకునేందుకు చక్కని వేదికగా నిలుస్తాయని తెలిపారు. పోటీలలో పాల్గొనడం ఎంత ముఖ్యమో, వాటి ద్వారా తమ లోపాలను గుర్తించి సరిదిద్దుకోవడం కూడా అంతే ముఖ్యమని వివరించారు.విద్యార్థులు నిరంతర సాధన, క్రమశిక్షణ, పట్టుదలతో చదివి పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. ప్రతి విద్యార్థి తనపై తాను నమ్మకం ఉంచుకొని ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని, వాటి సాధనకు నిరంతరం కృషి చేయాలని ప్రోత్సహించారు. అనంతరం ఈ క్విజ్ పోటీ నందు విజేతలుగా నిలిచిన విద్యార్థులను జ్ఞాపిక మరియు మెడల్‌తో సత్కరించారు.



కార్తీక పౌర్ణమి వేళ పుష్పగిరి గిరి ప్రదక్షిణ

బొల్లు రామమోహన్

కడప నవంబర్ 23 (నంది పత్రిక రిపోర్టర్)భక్తి బాటలో అడుగులు. ఆధ్యాత్మిక కతలో తడిసే మనసులు!కార్తీక మాసం.. శివకేశవుల ఆరాధనకు అత్యంత పవిత్రమైన మాసం. అందులోనూ కార్తీక పౌర్ణమి.. కోటి దీపాల వెలుగుల్లో దైవచింతనను నింపుకునే మహాపర్వం. ఈ పవిత్ర వేళ కడప జిల్లాలోని పుష్పగిరి పుణ్యక్షేత్ర గిరి ప్రదక్షిణ భక్తులకు అపురూప ఆధ్యాత్మిక అనుభూతిని పంచుతుంది. ప్రకృతి ఒడిలో, కొండ చుట్టూ సాగే ప్రతి అడుగు ఓ భక్తి సంకల్పంగా.. ప్రతి నామస్మరణ మనసుకు ప్రశాంతతను ఇచ్చే దివ్య ఔషధంగా మారుతుంది.

హరిహర క్షేత్రం.. మధ్య కైలాసం.. మధ్య అహోబిలం

కడప నగరానికి సుమారు 16 కిలోమీటర్ల దూరంలో, పెన్నానది తీరాన వెలసిన పుష్పగిరి శైవ, వైష్ణవ సంప్రదాయాల సంగమ క్షేత్రం. శైవులకు ఇది 'మధ్య కైలాసం' అయితే, వైష్ణవులకు 'మధ్య అహోబిలం'. ఒకే ప్రాంగణంలో శ్రీ వైద్యనాథేశ్వర స్వామి, శ్రీ చెన్నకేశవ స్వామి కొలువై ఉండటం హరిహర అభేద భావనకు నిలువెత్తు నిదర్శనం. ఇక్కడి ఆలయాల ప్రాచీనత, అద్భుత శిల్పకళ, పవిత్ర నదీ పరివాహక ప్రాంతం ఈ క్షేత్రానికి ప్రత్యేక శోభను చేకూరుస్తున్నాయి. "దిక్కులు వేరైనా వెలుగునిచ్చే సూర్యుడు ఒక్కడే.. మార్గాలు వేరైనా మోక్షాన్నిచ్చే పరమాత్మ ఒక్కడే!"అన్న సత్యాన్ని పుష్పగిరి క్షేత్రం ప్రపంచానికి చాటిచెబుతోంది.

అమృత బిందువులతో ఆవిర్భవించిన పుష్పగిరి

పుష్పగిరి పేరు వెనుక ఓ అద్భుత స్థలపురాణం ఉంది. గరుత్మంతుడు అమృతభాండాన్ని తీసుకెళ్తున్న సమయంలో, కొన్ని అమృత బిందువులు ఇక్కడి పవిత్ర సరస్సులో పడ్డాయట. ఆ సరస్సు మహిమ వల్ల మరణం లేకుండా పోతుందని భావించిన దేవతల ఆజ్ఞతో, ఆంజనేయుడు ఒక కొండను తెచ్చి ఆ సరస్సుపై వేశాడు. అయితే, ఆ కొండ మునిగిపోకుండా నీటిపై పుష్పంలా తేలింది. అనంతరం శివకేశవులు తమ పాదముద్రలతో ఆ కొండను స్థిరపరిచారు. నీటిపై పుష్పంలా తేలిన గిరి కాబట్టి దీనికి 'పుష్పగిరి' అనే పేరు స్థిరపడింది. ప్రకృతిలోని పర్వతాలు, నదులను దైవస్వరూపాలుగా గౌరవించాలనే గొప్ప సందేశం ఈ గాథలో దాగి ఉంది. "చరిత్ర మనకు మూలాలను నేర్పితే.. పురాణం మనకు మానవత్వపు విలువలను నేర్పుతుంది."

పంచనదుల సంగమం.. పర్వత ప్రదక్షిణ వైభవం

పెన్నా, పాపాగ్ని, కుముద్వతి, వల్మల, మాండవి నదుల సంగమ ప్రాంతంగా పుష్పగిరికి 'పంచనదీ క్షేత్రం' అనే ప్రాశస్త్యం ఉంది. దాదాపు ఆరు దశాబ్దాల విరామం తర్వాత, 2023లో ఈ గిరి ప్రదక్షిణ సంప్రదాయాన్ని మళ్ళీ ఘనంగా పునరుద్ధరించారు. చెన్నకేశవ స్వామి ఆలయం వద్ద మొదలై కుమ్మరానిపల్లె వంతెన, మూలపాక తదితర ప్రాంతాల మీదుగా సాగే సుమారు 11 కిలోమీటర్ల ప్రదక్షిణ మార్గం భక్తులకు కొత్త ఉత్సాహాన్ని ఇస్తోంది. ఎక్కడా తొందరపడకుండా, తోటి భక్తులకు సహకరిస్తూ సాగే ఈ యాత్ర మనిషిలోని అహంకారాన్ని కరిగించి వినయాన్ని పెంచుతుంది. "పట్టుదల ఉంటే పర్వతాన్నైనా దాటవచ్చు.. ప్రశాంతత ఉంటే పరమాత్మనే చేరవచ్చు."



కార్తీక పౌర్ణమి.. దీపాల కాంతుల్లో పుణ్యయాత్ర

కార్తీక పౌర్ణమి నాడు నదీ స్నానాలు, దీపారాధన, దానధర్మాలకు విశేష ఫలం ఉంటుంది. ఉదయపు మంచు తెరల మధ్య దైవనామ స్మరణతో మొదలయ్యే గిరి ప్రదక్షిణ.. భక్తుల కోలాహలంతో ఆధ్యాత్మిక ఉత్సవంగా మారుతుంది. "హరహర మహాదేవ", "గోవిందా" నామస్మరణలతో పుష్పగిరి కొండలు ప్రతిధ్వనిస్తాయి. కార్తీక దీపం మనలోని అజ్ఞానాన్ని తొలగిస్తే, గిరి ప్రదక్షిణ మనలోని అహంకారాన్ని తొలగిస్తుంది. "చిన్న ప్రమిదైనా చీకటిని తరిమేస్తుంది.. చిన్న భక్తి భావమైనా జీవితాన్ని వెలిగిస్తుంది."

ప్రదక్షిణలో సేవే పరమ ధర్మం

గిరి ప్రదక్షిణ అంటే కేవలం నడక మాత్రమే కాదు, అది సేవాభావానికి పరీక్ష కూడా. ప్రదక్షిణలో అలసిన భక్తులకు తాగునీరు, మజ్జిగ, అల్పాహారం అందించడం, వృద్ధులకు చేయూతనివ్వడం వంటి సేవా కార్యక్రమాల్లో స్థానికులు, స్వచ్ఛంద సంస్థలు ఎంతో ఉత్సాహంగా పాల్గొంటాయి. ఒకరు నామస్మరణ చేస్తే, మరొకరు ఆకలిదప్పులు తీర్చడం నిజమైన భక్తికి నిదర్శనం. "చెట్టుకు నీరు పోస్తే పూలు పూస్తాయి.. తోటి మనిషికి సాయం చేస్తే మానవత్వం వికసిస్తుంది."

జీవిత ప్రదక్షిణకు దిక్సూచి.. పర్యావరణ బాధ్యత

పర్వతం చుట్టూ తిరిగే భక్తుడు తన జీవితాన్ని కూడా ధర్మమార్గంలో నడిపించుకోవాలన్నదే ఈ యాత్ర అంతరార్థం. జీవితంలోని కష్టాలనే కొండలను దాటాలంటే దైవబలం, ఆత్మవిశ్వాసం ఎంతో అవసరం. "మంచి బాటలో వేసిన ఒక్క అడుగైనా వ్యర్థం కాదు.. ధర్మం వైపు నడిచే మనిషికి దైవం ఎప్పుడూ తోడుంటుంది." అదే సమయంలో, పుష్పగిరి వంటి ప్రాచీన క్షేత్రాల పవిత్రతను కాపాడుకోవడం మనందరి బాధ్యత. ప్రదక్షిణ మార్గంలో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నివారించి, ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి. "పరిశుభ్రత ఉన్నచోట దేవుడు కొలువుంటాడు.. బాధ్యత ఉన్నచోట భక్తి పరిమళిస్తుంది." కార్తీక పౌర్ణమి పుష్పగిరి గిరి ప్రదక్షిణ భక్తి నుంచి వినయానికి, వినయం నుంచి సేవకు, సేవ నుంచి విశ్వమానవ ప్రేమకు నడిపించే పవిత్ర వారధి. కార్తీక దీపాల కాంతుల్లో, పెన్నమ్మ ఒడిలో కొలువైన ఆ హరిహరుల అనుగ్రహంతో భక్తులందరి జీవితాల్లో సుఖశాంతులు విరజిల్లాలని ఆకాంక్షిద్దాం!

కార్మికులకు వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలి

పోలింగ్ తేదీలలో అన్ని దుకాణాలు, సంస్థలకు వర్తింపు

ఓటు హక్కు వినియోగించుకునేందుకు యజమానులు సహకరించాలి

ఆత్మకూరు సహాయ కార్మిక అధికారి ఎం. వేణుగోపాల్ రెడ్డి

ఆత్మకూరు (వెలుగోడు), నవంబర్ 23, నందిపత్రిక: గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో దుకాణాలు, వ్యాపార సంస్థలలో పనిచేస్తున్న కార్మికులందరికీ పోలింగ్ తేదీలలో తప్పనిసరిగా వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని ఆత్మకూరు సహాయ కార్మిక అధికారి ఎం. వేణుగోపాల్ రెడ్డి ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు.నవంబర్ 26, నవంబర్ 29 మరియు డిసెంబర్ 2వ తేదీలలో గ్రామ సర్పంచ్, వార్డు మెంబర్ల ఎన్నికలు జరగనున్నాయని ఆయన తెలిపారు. శ్రీశైలం నియోజకవర్గ పరిధిలోని ఆత్మకూరు, వెలుగోడు, పాములపాడు, కొత్తపల్లె మరియు సుండిపెంట మండల కేంద్రాలతో పాటు ఆయా గ్రామాలలో పోలింగ్ జరిగే రోజులలో ఈ నిబంధన ఖచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరూ తమ విలువైన ఓటు హక్కును వినియోగించుకునే విధంగా దుకాణాల యజమానులు సహకరించాలని ఆయన కోరారు. ఎన్నికలు జరిగే ఆయా తేదీలలో షాపులు, ఇతర వాణిజ్య సంస్థలలో పనిచేసే కార్మికులు, ఉద్యోగులకు వేతనంలో ఎటువంటి కోత విధించకుండా సెలవు మంజూరు చేయాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి కార్మికులను ఓటు హక్కుకు దూరం చేసే యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు.



డిజిటల్ మోసాల కట్టడికి ఆర్‌బీఐ కీలక ప్రతిపాదన..

బ్యాంక్ ఖాతాలకు 'స్టాప్ స్విచ్' ఫీచర్

ఆన్‌లైన్ బ్యాంకింగ్, డిజిటల్ లావాదేవీల్లో పెరుగుతున్న మోసాలను అరికట్టేందుకు, ఖాతాదారుల ప్రయోజనాలకు మరింత పటిష్ఠ రక్షణ కల్పించేందుకు భారత రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) సరికొత్త సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. ఎలక్ట్రానిక్ బ్యాంకింగ్ మోసాల బారిన పడకుండా ఖాతాదారులే స్వయంగా తమ ఖాతా నుంచి నిధుల బదిలీని తక్షణమే నిలిపివేసేలా 'స్టాప్ స్విచ్' (ూశీజూ ూఎఖ్ఖ్ఎష్ఠ) సదుపాయాన్ని బ్యాంకులు తప్పనిసరిగా అందించాలని ఆర్‌బీఐ ప్రతిపాదించింది. 'కస్టమర్ ప్రొటెక్షన్ ఇన్ ఫ్రాడ్యులెంట్ ఎలక్ట్రానిక్ బ్యాంకింగ్ ట్రాన్సాక్షన్స్' సవరించిన నిబంధనల ముసాయిదాలో భాగంగా ఈ కీలక మార్పులను తీసుకొచ్చారు. అనధికార లావాదేవీలు జరిగినప్పుడు ఖాతాదారుల బాధ్యతను పరిమితం చేయడమే కాకుండా, అసలు మోసాలు జరగకుండా ముందస్తు రక్షణ చర్యలు కల్పించడమే ఈ నిర్ణయం వెనుక ఉన్న ముఖ్య ఉద్దేశం. డిజిటల్ చెల్లింపుల వ్యవస్థపై వినియోగదారులకు మరింత నియంత్రణ కల్పించేందుకు ఈ ప్రతిపాదనలు ఉపయోగపడతాయని ఆర్‌బీఐ పేర్కొంది.

ముగిసిన నామినేషన్ల ఘట్టం

జూపాడుబంగ్లా, నవంబర్ :23 :(నంది పత్రిక) సర్పంచులు, వార్డు సభ్యుల ఎన్నికల కొరకు ఎన్నికల కమిషనర్ ఎన్నికల నిర్వహణ నోటిఫికేషన్ విడుదల చేసింది. సోమవారం జూపాడుబంగ్లా మండలంలోని నాలుగు నామినేషన్ కేంద్రాలలో మూడవరోజు నామినేషన్ దాఖలు చేసే ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. మూడో విడతగ్రామపంచాయతీలో ఎన్నికల నేపథ్యంలో జూపాడు బంగ్లా మండలంలోని 12 గ్రామ పంచాయతీలకు గాను మూడవ రోజైన సోమవారంజూపాడుబంగ్లా నామినేషన్ కేంద్రంలో జూపాడుబంగ్లా చెందిన సర్పంచ్ అభ్యర్థులుగా టిడిపి పార్టీ బలపరిచిన ఎం.వెంకటమ్మ, ప్రసన్నలక్ష్మి రెడ్డి , తాటిపాడు గ్రామానికి చెందిన టిడిపి పార్టీ బలపరిచిన ఉస్మాన్ భాష ,షర్మిల భాను మన్సూర్ భాష,లు సర్పంచ్ అభ్యర్థులుగా నామినేషన్లు వేశారు. నామినేషన్ పత్రాలను ఆర్ఓసుభాకర్ కు అందజేశారు. మండ్లేము నామినేషన్ కేంద్రంలో తంగడంచ గ్రామానికి చెందిన టిడిపి పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థిగా శ్యామలమ్మ, తర్తురు గ్రామం చెందిన టిడిపి పార్టీ బలపరిచిన సుభద్రమ్మ సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. మండ్లేము గ్రామానికి చెందిన టిడిపి పార్టీ బలపరిచిన తెలుగు లక్ష్మీదేవి, వైసిపి పార్టీ బలపరిచిన హజీరాంబి ,హుస్సేన్ బీ లు సర్పంచ్ అభ్యర్థులుగా నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ పత్రాలను ఆర్ఓ సాయిరాంకు అందజేశారు. 80బన్నూరు నామినేషన్ కేంద్రంలో తరిగోపుల గ్రామానికి చెందిన టిడిపి పార్టీ బలపరిచిన సి .గిరీశ్వర్ రెడ్డి నారాయణరెడ్డి కృష్ణమ్మ, 80 బన్నూరు గ్రామానికి చెందిన వైసీపీ పార్టీ బలపరిచిన ఎల్లారెడ్డి టిడిపి పార్టీ బలపరిచిన ప్రతాపరెడ్డిలు సర్పంచ్ అభ్యర్థులుగా నామినేషన్ దాఖలు చేశారు .నామినేషన్ పత్రాలను ఆర్ఓ కు అందజేశారు. పారుమంచాల నామినేషన్ కేంద్రంలో పారుపంచల గ్రామానికి చెందిన స్వతంత్ర అభ్యర్థి సంపత్ నాయుడు సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు నామి నేషన్ పత్రాలు ఆరో వెంక టేశ్వర్లు అందజేశారు. మూడు రోజుల నామి నేషన్ ప్రక్రియ ఇలాంటి సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా ముగిసినట్లు డిస్ట్రిక్ట్ అసిస్టెంట్ ఎలక్షన్ అధికారి గోపికృష్ణ తెలిపారు మూడు రోజుల సర్పంచ్ అభ్యర్థుల నామినేషన్లు 74 వార్డు సభ్యులకు నామినేషన్లు 398 వచ్చినట్లు ఆయన తెలిపారు. అలాగే 24వ తేదీ నామినేషన్ల పరిశీలన ఉంటుందని నామినేషన్. దాఖలు చేసిన అభ్యర్థులు ఉదయం ఆయా కేంద్రాలలోపరిశీలనకు హాజరుకావాలని ఆయన అన్నారు. ఈ నామినేషన్ ప్రక్రియ లో మూడు రోజులు నామినేషన్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జూపాడు బంగ్లాఎస్ఐ మల్లికార్జున ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.



చమర్తి వ్యూహంతో పాతికేళ్ల టీడీపీ కల సాకారం

రాజంపేట పురపాలిక పీఠంపై కొలువుదీరిన కూటమి సర్కారు





రాజ్యాంగబద్ధంగా ప్రమాణం చేయించిన సబ్ కలెక్టర్ కుమారి హెచ్.ఎస్. భావన

రాజంపేట(నందిపత్రిక ప్రతినిధి)నవంబర్ 23: రాజంపేట మున్సిపల్ రాజకీయ చరిత్రలో నూతన అధ్యాయం ఆవిష్కృతమైంది. నియోజకవర్గ ఇన్‌చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు సమర్థవంతమైన సారథ్యంలో, సుమారు 25 సంవత్సరాల సుదీర్ఘ విరామం తర్వాత తెలుగుదేశం పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించి, రాజంపేట పురపీఠంపై టీడీపీ జెండాను రెపరెపలాడించడం ద్వారా ఆయన సరికొత్త రికార్డు సృష్టించారు. చమర్తి జగన్ మోహన్ రాజు వ్యూహాత్మక నాయకత్వంలో పురపాలక సంఘం చైర్‌పర్సన్ పీఠంపై మొట్టమొదటిసారిగా తెలుగుదేశం పార్టీ అభ్యర్థిని కుమారి డాక్టర్ దొంత గాయత్రి కొలువుదీరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో రాజంపేట సబ్ కలెక్టర్ కుమారి హెచ్.ఎస్. భావన (ఐఆర్ఎస్) నూతన చైర్‌పర్సన్ డాక్టర్ దొంత గాయత్రితో పాటు కొత్తగా ఎన్నికైన కౌన్సిలర్లందరితో రాజ్యాంగబద్ధంగా ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు, రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి దొంతం శివప్రసాద్ నూతన చైర్‌పర్సన్‌ను ప్రత్యేకంగా ఆహ్వానించి, చైర్‌పర్సన్ పీఠంపై ఆసీనులను చేశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గానికి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

పట్టణ సమగ్రాభివృద్ధికి కృషి చేయాలి: ఈ సందర్భంగా చమర్తి జగన్ మోహన్ రాజు మాట్లాడుతూ.. పాతికేళ్ల తర్వాత ప్రజలు ఎంతో నమ్మకంతో కూటమి అభ్యర్థులకు పట్టం కట్టారని, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ నూతన మున్సిపల్ కార్యవర్గం రాజంపేట పట్టణ అభివృద్ధికి నిరంతరం పాటుపడాలని సూచించారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముందు చైర్‌పర్సన్ అభ్యర్థి డాక్టర్ దొంత గాయత్రి మరియు కౌన్సిలర్లందరూ స్థానిక వినాయక స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుండి ర్యాలీగా వెళ్లి స్వర్గీయ నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం భారీ జనసందోహం మధ్య మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట నియోజకవర్గంలోని అన్ని మండలాల తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.





ముందస్తు గుర్తింపుతో క్యాన్సర్‌ను సమర్థంగా ఎదుర్కోవచ్చు : డా. ఎన్. కిరణ్మయి



అన్నమాచార్య విశ్వవిద్యాలయంలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో క్యాన్సర్ పై అవగాహన సదస్సు

రాజంపేట (నందిపత్రిక ప్రతినిధి) నవంబర్ 23: క్యాన్సర్‌పై అపోహలను తొలగించి, వ్యాధి పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందించడంతో పాటు ముందస్తు గుర్తింపు ప్రాముఖ్యతను తెలియజేసే లక్ష్యంతో అన్నమాచార్య విశ్వవిద్యాలయంలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో సోమవారం క్యాన్సర్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా ప్రముఖ మెడికల్ అండ్ హెమటో-ఆంకాలజిస్ట్ డా.ఎన్. కిరణ్మయి హాజరై విద్యార్థులు, అధ్యాపకులకు క్యాన్సర్ వ్యాధి, దాని వివిధ రకాలు, ప్రారంభ లక్షణాలు, నివారణ చర్యలు, ఆధునిక చికిత్సా విధానాలపై సమగ్ర అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రొమ్ము క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్, పెద్దప్రేగు క్యాన్సర్, గైనకాలజికల్ క్యాన్సర్లు, చిన్నారుల్లో వచ్చే క్యాన్సర్లు, గ్యాస్ట్రిక్ క్యాన్సర్ తదితర వ్యాధుల గురించి వివరించారు. క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించినట్లయితే సమర్థవంతమైన చికిత్స పొందేందుకు, వ్యాధిని నియంత్రించేందుకు మెరుగైన అవకాశాలు ఉంటాయని ఆమె పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని, శరీరంలో కనిపించే అసాధారణ మార్పులను నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని సూచించారు. వయస్సు, ఆరోగ్య పరిస్థితి, వ్యక్తిగత ప్రమాద కారకాలను బట్టి అవసరమైన వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా క్యాన్సర్‌ను ముందస్తుగా గుర్తించే అవకాశం ఉంటుందని వివరించారు.ఈ కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ డీన్ డా.ఎస్.ఎం.వి. నారాయణ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా. కె. జనార్ధన్, మహిళా సాధికారత విభాగం కోఆర్డినేటర్ డా. వి. మౌనేశ్వరి పాల్గొన్నారు. క్యాన్సర్ అంటే మరణమేనన్న భయాన్ని వీడి, వ్యాధిపై సరైన అవగాహన పెంపొందించుకోవాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ప్రజల్లో నెలకొన్న అపోహలను తొలగించడం, ముందస్తు నిర్ధారణ, నివారణ చర్యలపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. “ముందస్తు గుర్తింపే క్యాన్సర్‌ను ఎదుర్కొనే తొలి అడుగు.. అవగాహనే ఆరోగ్యకరమైన సమాజానికి మార్గం” అనే సందేశంతో కార్యక్రమం ముగిసింది.



ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు భోజన ప్లేట్లు పంపిణి

ఆళ్లగడ్డ ప్రతినిధి నవంబర్ 23, నంది పత్రిక అవొపా వారి శాశ్వత సేవా నిధి కార్యక్రమంలో భాగంగా వంకదార నాగేశ్వరరావు జ్ఞాపకార్థం వారి కుమారులు, కుటుంబ సభ్యులు సోమవారం దేవరాయపురం ఎంపీపీ పాఠశాలలోని విద్యార్థులకు ఏడు వేల విలువైన 70 భోజన ప్లేట్లను పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో వంకదార హరిప్రసాద్, వంకదార రవీంద్రనాథ్, అవొపా అధ్యక్షులు తంగుటూరి సత్యనారాయణ, కోశాధికారి వందార రాజేంద్రప్రసాద్, చీఫ్ కన్వీనర్ గంగిశెట్టి వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



మున్సిపాలిటీ చైర్మన్ గా డా" ఏ గోవిందరాజులు.వైస్ చైర్మన్ గా రాజమత్ ఖాజా వైసు కర్ని మరియు కౌన్సిలర్ల ప్రమాణస్వీకారం

ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ,



నంది పత్రిక ఆత్మకూరు నంద్యాల జిల్లా ఆత్మకూరు మండలం లోని నంద్యాల టర్నింగ్ నుంచి గౌడ్ సెంటర్ ఎన్టీఆర్ విగ్రహం వరకు ఎన్ డి ఏ కూటమినేతలతో భారీ ర్యాలీ నిర్వహించి ఎన్టీఆర్ విగ్రహానికి , పూల మాలతో సత్కరించిచైర్మన్ ఆవుల గోవింద రాజులు తో సహా ప్రమాణస్వీకారం చేసిన ఎన్డీయే కూటమి కౌన్సిలర్లు, వైస్ చైర్మన్ గా 29వ వార్డు కౌన్సిలర్ రాజమత్ గారి ఖాజా వైస్ ఖర్ని ఏకగ్రీవ ఎన్నిక,నూతన పాలకవర్గం మున్సిపాలిటీ ప్రజానికానికి మెరుగైన సేవలందిస్తూ.. తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆకాంక్ష,ఆత్మకూరు మున్సిపాలిటీ అభివృద్ధికి కలిసికట్టుగా కృషిచెద్దామని పిలుపుతో ,రాబోయే రెండేళ్లలో ప్రతి ఇంటికి త్రాగునీరు అందిస్తామని వారి వార్డుల అభివృద్ధి చేస్తామని.. ఇప్పటికే కోట్లాది రూపాయలతో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణాలు చేపట్టామని వెల్లడి.పట్టణంలో పచ్చదనం, పార్కుల అభివృద్ధి చేపడుతామని హామీ, ఇస్తూ సంక్షేమం, అభివృద్ధే ఎన్డీయే కూటమి ప్రధాన ధ్యేయం అని వెల్లడించి కౌన్సిలర్ వార్డులలో రాజకీయాలకతీతంగా అభివృద్ధి చేపడుతామని తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు



రాజంపేట మండలం తాళ్లపాకలో ఘనంగా కార్తిక సోమవారం ఉత్సవాలు



రాజంపేట(నందిపత్రిక ప్రతినిధి) నవంబర్ 23: కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి పరమ భక్తుడు, పద కవితా పితామహుడు అన్నమాచార్యుల జన్మస్థలి రాజంపేట మండలం తాళ్లపాక సిద్దేశ్వర స్వామి వారి ఆలయంలో సోమవారం ప్రత్యేకంగా కార్తీక పౌర్ణమి పూజలు నిర్వహించినట్లు నిర్వాహకులు తోట శ్రీనివాస ధీరజ్ తెలిపారు. గత ఎనిమిది సంవత్సరాలుగా అనగా 2018 వ సంవత్సరం నుండి ప్రతి సంవత్సరం కార్తీక పౌర్ణమి రోజున తాళ్లపాక గ్రామంలో 12వ శతాబ్దంలో నిర్మించబడి శ్రీరామునిచే ప్రతిష్టింపబడి అన్నమాచార్యుల తాత, అన్నమాచార్యుల నాన్న, అన్నమాచార్యుల అర్చకులుగా పనిచేసిన తాళ్లపాక సిద్దేశ్వర స్వామి వారి శివాలయంలో పూలతో, అరటి పిల్లలతో, మామిడి తోరణాలతో శివాలయం అంతా అలంకరించి, వచ్చిన భక్తులకు అయిదు రకాల ప్రసాదాలు వితరణ చేసినట్లు వివరించారు. ప్రతి సంవత్సరం లాగే ఈ తొమ్మిదోవ సంవత్సరం కూడా మహోన్నతమైన ఈ కార్యక్రమం నా దగ్గర చదువుకున్న మనసులో ఎటువంటి కల్మషం లేని నా తమ్ముళ్లు, చెల్లెళ్లతో చేయించినట్లు పేర్కొన్నారు. ఉదయం నుండి సాయంత్రం వరకు తిండి తిప్పలు మానేసి, వర్షం సైతం లెక్కచేయకుండా, స్వామివారి సేవలో ప్రతి సంవత్సరం పాల్గొంటున్న మా పిల్లలకి, వారికి అనుమతి ఇచ్చి, వారి చేత ఇంత మంచి కార్యక్రమం చేయడానికి అనుమతి ఇస్తున్న వారి కుటుంబాలకి, ఉపాధ్యాయులకి బంగారు భవిష్యత్తు ప్రసాదించాలని ఆ పరమేశ్వరుని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.



చౌడేశ్వరి అమ్మవారి ఆలయ అభివృద్ధికి రూ.50 వేల విరాళం

ఓం కన్స్ట్రక్షన్స్ అధినేత ఆరికట్ల శివమోహన్ రెడ్డి కుటుంబ సభ్యుల దాతృత్వం

బనగానపల్లె, నవంబర్ 23 నందిపత్రిక బనగానపల్లె మండలం నందవరం గ్రామంలో కొలువుదీరిన శ్రీ చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానం అభివృద్ధికి నంద్యాల జిల్లా ఉయ్యాలవాడ మండలం అల్లూరు గ్రామానికి చెందిన ఓం కన్స్ట్రక్షన్స్ అధినేత ఆరికట్ల శివమోహన్ రెడ్డి తమ కుటుంబ సభ్యులతో కలిసి రూ.50,000 విరాళంగా అందజేశారు. ఆలయ అభివృద్ధి పనులకు తమ వంతు సహకారంగా అందించిన ఈ విరాళాన్ని ఆలయ డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ పి.వి. కుమార్ రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ పి.వి. నాగార్జున రెడ్డి సమక్షంలో ఆలయ అర్చకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు వచ్చి సహకారం అందించడం అభినందనీయమని ఆలయ కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. అమ్మవారి ఆశీస్సులు దాతల కుటుంబ సభ్యులపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.



ముగిసిన నామినేషన్ల ప్రక్రియ

-మూడవ రోజు38 సర్పంచు, 135 వార్డు మెంబర్లు నామినేషన్లు దాఖలు

కొత్తపల్లి – నంది పత్రిక : ఈ నెల 21 వ తేది నుంచి గ్రామాల్లోని సర్పంచు, వార్డు మెంబర్లకు నామినేషన్లు ప్రారంభమై సోమవారంతో ముగిశాయి. మూడవ రోజు చివరిరోజు కావడంతో నామినేషన్లు జోరుగా సాగాయి. చివరిరోజు 38 మంది అభ్యర్థులు సర్పంచు స్థానాలకు, 135 మంది అభ్యర్థులు వార్డు మెంబర్లుగా నామినేన్లు దాఖలు చేశారని అసిస్టెంట్ ఎన్నికల అధికారి దాసరి మేరి తెలిపారు. చివరిరోజు దుద్యాల క్లస్టర్ నుంచి 16 మంది సర్పంచు. 23 మంది వార్డు మెంబర్లకు, కొత్తపల్లి క్లస్టర్ నందు 5 మంది సర్పంచు స్థానాలకు, 33 మంది అభ్యర్థులు వార్డు మెంబర్లకు నామినేషన్లు దాఖలు చేశారని చెప్పారు. అదేవిధంగా గోకవరం క్లస్టర్ నందు 7 మంది అభ్యర్తులు, 23 మంది అభ్యర్థులు, ముసలిమడుగు క్లస్టర్ నందు 10 మంది, 56 మంది అభ్యర్తులు సర్పంచు, వార్డు మెంబర్లకు నామినేషన్లు దాఖలు చేశారని చెప్పారు. మెత్తం మూడు రోజులకు గాను సర్పంచు స్థానాలకు 85 అభ్యర్థులు, వార్డు మెంబర్ల స్థానాలకు 315 మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారని వెల్లడించారు.

బద్వేల్ నూతన మున్సిపల్ పాలకవర్గానికి మంచూరు సూర్యనారాయణ రెడ్డి శుభాకాంక్షలు

24, 34, 33వ వార్డు కౌన్సిలర్లను కలిసి అభినందించిన నాగదాసరి అఖిల్ రవికుమార్



బద్వేల్ నవంబర్ 23 (నంది పత్రిక): బద్వేల్ మున్సిపాలిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో బద్వేల్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్, కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు. నూతన చైర్మన్‌గా శ్రీమతి దివ్య తేజ, వైస్ చైర్‌పర్సన్‌గా శ్రీమతి రేవూరు సుమలతతో పాటు 40 మంది కౌన్సిలర్లు ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా బద్వేల్ మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు నూతన పాలకవర్గం సమష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు. పట్టణంలో రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, వీధి దీపాలు, పారిశుద్ధ్యం వంటి మౌలిక వసతులను మెరుగుపరిచి ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించాలని సూచించారు.

కౌన్సిలర్లను కలిసి అభినందించిన నాగదాసరి అఖిల్ రవికుమార్

నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం అనంతరం నాగదాసరి అఖిల్ రవికుమార్ ప్రత్యేకంగా పలువురు నూతన కౌన్సిలర్లను కలిసి అభినందనలు తెలియజేశారు. 24వ వార్డు కౌన్సిలర్లు జహంగీర్ భాష, లక్ష్మీదేవి, 34వ వార్డు కౌన్సిలర్ శివ జ్యోతి, 33వ వార్డు కౌన్సిలర్ పెద్దలపల్లి చరణ్‌లను కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లు తమ తమ వార్డుల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అఖిల్ రవికుమార్ ఆకాంక్షించారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ వార్డుల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని కోరారు.

ఎమ్మిగనూరు మున్సిపాలిటీకి కొత్త పాలకవర్గం

చైర్‌పర్సన్‌గా మాచాని సునీత.. వైస్ చైర్మన్‌గా తురేకల్ నజీర్ అహ్మద్





ఎమ్మిగనూరు నవంబర్ 23(నంది పత్రిక) ఎమ్మిగనూరు మున్సిపాలిటీ నూతన పాలకవర్గం సోమవారం కొలువుదీరింది. మున్సిపాలిటీ చైర్‌పర్సన్‌గా మాచాని సునీత, వైస్ చైర్మన్‌గా తురేకల్ నజీర్ అహ్మద్ ప్రమాణ స్వీకారం చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని 44 వార్డుల్లో విజయం సాధించిన మొత్తం 44 మంది కౌన్సిలర్లు ప్రమాణ స్వీకారం చేశారు. వీరిలో 40 మంది తెలుగుదేశం పార్టీ కౌన్సిలర్లు, ఇద్దరు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు, ఇద్దరు స్వతంత్ర కౌన్సిలర్లు ఉన్నారు. ఎన్నికల అధికారి వై. మధుసూదన్ రెడ్డి నూతన పాలకవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మిగనూరు ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయ నాగేశ్వర రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా నూతన చైర్‌పర్సన్ మాచాని సునీత, వైస్ చైర్మన్ తురేగల్ నజీర్ అహ్మద్ మాట్లాడుతూ తమపై నమ్మకంతో గెలిపించిన వార్డు ప్రజలకు, కౌన్సిలర్లకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని తెలిపారు. ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చే సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధితో పాటు అన్ని వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఎమ్మిగనూరు మున్సి పాలిటీలో నూతన పాలకవర్గం బాధ్యతలు చేపట్టగా, రానున్న రోజుల్లో పట్టణ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంపై కొత్త పాలకవర్గం ఎలా ముందుకు సాగుతుందోనన్న ఆసక్తి పట్టణ ప్రజల్లో నెలకొంది.



యాగంటి క్షేత్రంలో భక్తులకు అన్నదానం

బసవన్న గోశాల ఆధ్వర్యంలో అన్నసంతర్పణ

250 గోవులతో గోసంరక్షణ సేవలు.. బుర్ర వెంకటేశ్వర్లు వెల్లడి



బనగానపల్లె, నవంబర్ 23, నందిపత్రిక ఎర్రమల కొండల్లో వెలసిన ప్రముఖ పుణ్యక్షేత్రం యాగంటి శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవస్థానం సమీపంలోని బసవన్న గోశాలలో కార్తీక మాసం రెండో సోమవారం సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్తీక సోమవారం కావడంతో స్వామివారిని దర్శించుకునేందుకు ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు యాగంటికి తరలివచ్చారు.ఈ సందర్భంగా బసవన్న గోశాల అధినేతబుర్ర వెంకటేశ్వర్లు, వర్ర చందు ఆధ్వర్యంలో ఉదయం నుంచి భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి హాజరై, అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు స్వయంగా అన్నం వడ్డించారు.ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ తోట బుచ్చిరెడ్డి, బండి బ్రహ్మానంద రెడ్డి, వై. మనోహర్ రెడ్డి, బండి పుల్లారెడ్డి, ప్రసాద్ రెడ్డి, పాతపాడు గడ్డం రామిరెడ్డి, గడ్డం వెంకటేశ్వర రెడ్డి, గడ్డం కృష్ణారెడ్డి, వెంకట రాముడు, శివారెడ్డి, క్రిష్ణగిరి నాగేశ్వరరావు రమేష్ తదితరులు పాల్గొన్నారు. చుట్టుపక్కల గ్రామాలతో పాటు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భోజనాలు స్వీకరించారు. ఈ సందర్భంగా గోశాల అధినేత బుర్ర వెంకటేశ్వర్లు మాట్లాడుతూమండలంలోని తన స్వగ్రామమైన పండ్లాపురంలో గత కొన్ని సంవత్సరాలుగా 100కు పైగా గోవులను పెంచుతూ వాటిని సంరక్షిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా 2020 సంవత్సరం నుంచి యాగంటి సమీపంలో బసవన్న గోశాలను ఏర్పాటు చేసి, గోవుల సంరక్షణకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పిస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు.ప్రస్తుతం గోశాలలో సుమారు 250 గోవులు ఉన్నాయని, గోవుల సంరక్షణే తన ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు. యాగంటి శ్రీ ఉమామహేశ్వర స్వామివారి అనుగ్రహంతో పాటు నందవరం గ్రామంలో కొలువుదీరిన శ్రీ చౌడేశ్వరి అమ్మవారి ఆశీస్సులతో గోసేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తున్నట్లు తెలిపారు.బసవన్న గోశాలలోని గోవుల పాలతో భక్తులు యాగంటి స్వామివారికి అభిషేకాలు నిర్వహించేందుకు పాలను తీసుకెళ్తున్నారని చెప్పారు. అంతేకాకుండా తల్లిపాలు అందుబాటులో లేని చిన్నారులకు గోపుపాలు అందించాలనే ఉద్దేశంతో పలువురు ప్రజలు గోశాలకు వచ్చి పాలు తీసుకెళ్తున్నారని వివరించారు. గోపుపాలు అవసరమైన వారు బసవన్న గోశాలను సంప్రదించి పొందవచ్చని కోరారు.కార్తీక రెండో సోమవారం సందర్భంగా యాగంటి క్షేత్రానికి వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులకు అన్నదానం నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందని బుర్ర వెంకటేశ్వర్లు, వర్ర చందు తెలిపారు.

బనగానపల్లె లో ఆర్యవైశ్య వ్యాపారి మృతి

మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



బనగానపల్లె, నవంబర్ 23 నందిపత్రిక బనగానపల్లె పట్టణంలోని ఆస్థానం వద్ద నివాసం ఉంటున్న ఆర్యవైశ్య ప్రముఖుడు, కిరాణా దుకాణం యజమాని పి.ఎస్. రాజేంద్ర (72) గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతి విషయం తెలుసుకున్న బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో సిద్ధం రెడ్డి రామ్మోహన్ రెడ్డి, ఆర్యవైశ్య ప్రముఖులు పసుపుల సుబ్బ సత్యనారాయణ, పి.ఎస్. సాగర్, ప్రకాష్ తదితరులు పాల్గొని రాజేంద్ర మృతికి సంతాపం వ్యక్తం చేశారు.

కడపజిల్లా జడ్పీచైర్మన్ పుత్త నరసింహారెడ్డిని కలిసినఎద్దులవిజయసాగర్



నందలూరు (నందిపత్రిక ప్రతినిధి)నవంబర్ 23. కడప జిల్లా జడ్పీచైర్మన్ పుత్త నరసింహారెడ్డిని కమలాపురం ఎమ్మెల్యే పుత్త. చైతన్య రెడ్డి ని నందలూరు మండల ఎంపీపీ ఎద్దులసాగర్ ప్రమీల, తెలుగుదేశం యువనాయకులు చక్రాలసాయినాథ్ ,ఎద్దుల చంద్రశేఖర్,ఉప్పు శెట్టి సుధీర్, కొత్తపల్లి వంశీకృష్ణ, సుబ్బనరసయ్య ,పెంచలయ్య,మనీ, మర్యాదపూర్వకంగా కలిసీ శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

మహానంది పుణ్యక్షేత్రంలో వైభవంగా జల హారతులు





మహానంది నవంబర్ 23 (నంది పత్రిక):– మహానంది పుణ్యక్షేత్రంలో కార్తీక రెండవ సోమవారాన్ని పురస్క రించుకుని జలహారతుల మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈవో శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు, అర్చకులు గంగాదేవికి శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని కోనేరు వద్ద దశవిధ హారతులను భక్తిశ్రద్ధలతో సమర్పించారు. వేదమంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ సాగిన ఈ ఆధ్యాత్మిక వేడుక ఆలయ పరిసరాలను భక్తిపారవశ్యంలో ముంచెత్తింది.అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని హారతులను వీక్షించారు.

భక్తులతో కిటకిటలాడిన మహానంది క్షేత్రం

మహానంది నవంబర్ 23 (నంది పత్రిక):– ప్రముఖ శైవక్షేత్రమైన మహానందిలో కార్తీక మాస శోభ సంతరించుకుంది.కార్తీక రెండవ సోమవారాన్ని పురస్కరించుకుని వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు ఆలయానికి తరలిరావడంతో క్షేత్ర ప్రాంగణమంతా భక్తులతో కిటకిటలాడింది. వేకువజాము నుంచే భక్తులు ఆలయ కోనేరులో పవిత్ర పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం శ్రీ కామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక అభిషేకాలు, అర్చన పూజలు, కేదారేశ్వర నోములు నిర్వహించుకున్నారు. ఆలయ ప్రాంగణంలోని నాగుల కట్ట, నంది స్తూపం వద్ద భక్తులు భక్తిశ్రద్ధలతో కార్తీక దీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. శివనామస్మరణతో మహానంది క్షేత్రం ఆధ్యాత్మిక వాతావరణంతో మార్మోగింది.





కార్తీక పౌర్ణమి సందర్భంగా నేడే పుష్పాచల కార్తీక జ్యోతి సహస్ర దీపోత్సవం

పుష్పాచలం కొండపై మహా జ్యోతి ప్రజ్వలనకు ఏర్పాట్లు పూర్తి

ఖాజీపేట, (నంది పత్రిక) నవంబర్ 23: వైఎస్సార్ కడప జిల్లా వల్లూరు మండలం కోట్లూరు గ్రామ పంచాయతీ పరిధిలోని పుష్పాచలం కొండపై వెలసిన స్వయంభూ శ్రీ పుష్పాచలేశ్వర స్వామి దేవస్థానంలో కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని నవంబర్ 24న చతుర్థ వార్షిక పుష్పాచల కార్తీక జ్యోతి, సహస్ర దీపోత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఉదయం స్వామివారికి కార్తీక జ్యోతి ఆజ్యారాధన, విశేష అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేయనున్నారు. సాయంత్రం 6:30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీ పుష్పాచలేశ్వర స్వామివారి మహా కార్తీక జ్యోతిని ప్రజ్వలన చేయడంతో పాటు సహస్ర దీపోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ మహోత్సవానికి సంబంధించి వల్లూరు మండల తహసీల్దార్ శ్రీవాణి, నందలూరు నాగిరెడ్డి, ప్రముఖ న్యాయవాది, బీజేపీ నాయకుడు గొర్రె శ్రీనివాసులు, కోట్లూరు పంచాయతీ మాజీ సర్పంచ్ తెలిదల చిన్న పుల్లయ్య, తల్లపురెడ్డి నాగసుబ్బారెడ్డి తదితర ప్రముఖులకు ఆహ్వాన పత్రికలు అందజేశారు. అలాగే కోట్లూరు పంచాయతీ ప్రజలు, హిందూ బంధువులు, శివభక్తులను ఆహ్వానించారు. ఈ సందర్భంగా భక్తులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కార్తీక మహాజ్యోతిని దర్శించుకుని, సహస్ర దీపోత్సవంలో భాగస్వాములు కావాలని దేవస్థానం నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. పుష్పాచలం కొండపైకి వచ్చే భక్తులు వ్యక్తిగత భద్రత పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, కొండపై ప్రయాణించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ వివరాలను స్వయంభూ శ్రీ పుష్పాచలేశ్వర స్వామి దేవస్థానం అర్చకులు, దేవస్థాన పునఃప్రారంభకులు, శ్రీరామరాజ్యం హిందుత్వ చైతన్య వేదిక ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు అంబాబత్తుల అండకొండరాముడు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సేవకులు శ్యామల దేవి, ప్రధాన కార్యదర్శి అశ్విని, అంబాయి గారి వెంకటసాయి, జింక మహేష్, పరదేశి తదితరులు పాల్గొననున్నారు.



మహబూబ్‌నగర్‌లో పసుపుల శృతికి మద్దతుగా మాజీ సర్పంచ్ చిత్తా రవి ప్రకాష్ రెడ్డి పర్యటన..

రంగసముద్రం అభివృద్ధికి మద్దతు కోరుతూ ప్రచారం



పోరుమామిళ్ల, నవంబర్ 23 (నంది పత్రిక): వైయస్సార్ కడప జిల్లా పోరుమామిళ్ల మండలం రంగసముద్రం గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి పసుపుల శృతికి మద్దతుగా మాజీ సర్పంచ్ చిత్తా రవి ప్రకాష్ రెడ్డి మహబూబ్‌నగర్‌లో పర్యటించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పసుపుల శృతితో కలిసి స్థానికులను కలుసుకుని ఆమెకు మద్దతు తెలపాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా పసుపుల శృతి ఎన్నికల బరిలో నిలిచినట్లు వివరించారు. గతంలో గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను కొనసాగిస్తూ, నిర్లక్ష్యానికి గురైన పార్కులను పునరుద్ధరించడం, పారిశుధ్య సమస్యలను పరిష్కరించడం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు.రంగసముద్రం గ్రామ పంచాయతీ అభివృద్ధికి పసుపుల శృతికి మద్దతు ఇవ్వాలని, రాబోయే ఎన్నికల్లో వంకాయ గుర్తుపై ఓటు వేయాలని మాజీ సర్పంచ్ చిత్తా రవి ప్రకాష్ రెడ్డి స్థానికులను కోరారు.



టంగుటూరు సర్పంచ్ కూటమి అభ్యర్థి గుజ్జల నాగమణిని గెలిపించండి

టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్



నందలూరు (నంది పత్రికా ప్రతినిధి) నవంబర్ 23: నందలూరు మండలం టంగుటూరు గ్రామపంచాయతీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం టంగుటూరు గ్రామంలో తెలుగుదేశం పార్టీ కూటమి బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి గుజ్జల నాగమణి విజయాన్ని కాంక్షిస్తూ జడ్పీటీసీ చుక్క యానాదితో కలిసి టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా రేవూరి వేణుగోపాల్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ప్రజలు కూటమి బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి గుజ్జల నాగమణికి మంచం గుర్తుపై ఓటు వేసి అండగా నిలవాలని పిలుపునిచ్చారు.టంగుటూరు గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రచారంలో భాగంగా ప్రజలకు వివరించారు. గ్రామ ప్రజల సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేసే నాయకత్వాన్ని ఎన్నుకోవాల్సిన బాధ్యత ప్రతి ఓటరుపై ఉందన్నారు.గుజ్జల నాగమణిని అత్యధిక మెజారిటీతో గెలిపించి టంగుటూరు గ్రామ అభివృద్ధికి బాటలు వేయాలని ఆయన గ్రామ ప్రజలను కోరారు. ఈ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఎమ్మిగనూరు నియోజకవర్గంలో గోనెగండ్ల జడ్పీటీసీ ఎన్నికల బ్యాలెట్ పేపర్ల జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు

రీ-ఎలక్షన్ నిర్వహించాలి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన ఎస్వీ మోహన్ రెడ్డి, రాజీవ్ రెడ్డి

ఎమ్మిగనూరు నవంబర్ 23 (నంది పత్రిక) ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని గోనెగండ్ల జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించిన బ్యాలెట్ పేపర్లు బయటపడిన ఘటనపై వైఎస్సార్‌సీపీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు జరిగినట్లు తేలితే తక్షణమే రీ-ఎలక్షన్ నిర్వహించాలని వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి, ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇంచార్జ్ ఎర్రకోట రాజీవ్ రెడ్డి డిమాండ్ చేశారు.సోమవారం కర్నూలు జిల్లా కలెక్టర్ సిరి గారి కి ఈ ఘటనపై వారు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటమి భయంతో టీడీపీ నాయకులు కుట్ర రాజకీయాలకు పాల్పడ్డారని ఆరోపించారు.నామినేషన్ నుంచి కౌంటింగ్ వరకు వేధింపులునామినేషన్ దశ నుంచి పోలింగ్, కౌంటింగ్ వరకు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను లక్ష్యంగా చేసుకుని దౌర్జన్యాలు, బెదిరింపులకు పాల్పడ్డారని విమర్శించారు. పోలింగ్ అనంతరం కౌంటింగ్ ప్రక్రియలోనూ అక్రమాలు జరిగాయని, వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు సంబంధించిన బ్యాలెట్ పేపర్లు మాయమయ్యాయని ఆరోపించారు. ముఖ్యంగా గోనెగండ్ల జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించిన బ్యాలెట్ పేపర్లు చెత్తకుప్పలో బయటపడటం ఎన్నికల పారదర్శకతపై అనేక అనుమానాలకు తావిస్తోందని పేర్కొన్నారు. ఈ ఘటన ప్రజాస్వామ్య వ్యవస్థకే సవాల్‌గా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.ఎన్నికల పేరుతో దౌర్జన్యాలు.. బ్యాలెట్ పేపర్లతో అక్రమాలు: రాజీవ్ రెడ్డి.ఈ సందర్భంగా ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇంచార్జ్ రాజీవ్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అధికార పార్టీ నేతలు ఎన్నికల ప్రక్రియను తమకు అనుకూలంగా మార్చుకునేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. బ్యాలెట్ పేపర్లు బయటపడిన ఘటన ఎన్నికల నిర్వహణలో పారదర్శకతపై తీవ్రమైన ప్రశ్నలు లేవనెత్తుతోందని అన్నారు.ఎన్నికల్లో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అక్రమాలపై ఆధారాలు ఉన్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఈ ఘటనపై అధికారులు తక్షణమే స్పందించి, పూర్తి స్థాయి విచారణ చేపట్టి బాధ్యులపై



చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.గోనెగండ్ల జడ్పీటీసీ ఎన్నికలపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, నిబంధనల ప్రకారం న్యాయం చేయాలని, అవసరమైతే రీ-ఎలక్షన్ నిర్వహించాలని కోరారు. లేనిపక్షంలో వైఎస్సార్‌సీపీ తరఫున న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మిగనూరు నియోజకవర్గ పరిశీలకులు తెర్లేకల్ సురేంద్ర రెడ్డి, వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ గుర్రాజు రావు, జడ్పీటీసీ అభ్యర్థి జహంగీర్, జిల్లా కార్యదర్శి బండే నవాజ్, మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ మన్సూర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

తరిగోపుల గ్రామాన్ని అభివృద్ధి చేసి చూపిస్తా



జూపాడుబంగ్లా, నవంబర్ :23 :(నంది పత్రిక) గ్రామ అభివృద్ధికి ప్రణాళికాబద్ధమైన చర్యలు తీసుకుంటూ, ప్రజా సమస్యలు పరిష్కారానికి అందుబాటులో ఉంటానని తరిగోపుల గ్రామ సర్పంచ్ పదవికి కూటమి బలపరిచిన అభ్యర్థి మందడిదొరబాబు రెడ్డి తెలిపారు. తనను ఆదరించి సర్పంచిగా గెలిపిస్తే గ్రామ రూపురేఖలు మార్చేందుకు కృషి చేస్తానని విజ్ఞప్తి చేశారు. తండ్రి నారాయణరెడ్డి రాజకీయ నేపద్యం ఉన్న కుటుంబము కాబట్టి ఆయన గ్రామంలోనూ ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలు తెలుసుకుంటూ తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. సర్పంచ్ గా అవకాశం కల్పిస్తే గ్రామంలోని తాగునీటి సమస్య పరిష్కారం అంతర్గత రహదారులు అభివృద్ధి, మురుగునీటి కాలువ నిర్మాణము, పారిశుద్ధ్య నిర్వహణ, వీధి దీపాల ఏర్పాటు ఉంటే మౌలిక సదుపాయాలు కల్పనకు ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా కృషి చేయడంతో పాటు పింఛన్లు, రేషన్, ఇతర ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతానన్నారు. గ్రామంలో యువతకు ఉపాధి అవకాశాలు, మహిళా సంఘాలకు ప్రోత్సాహము, పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధి, పచ్చదనం పెంపువంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని అన్నారు. గ్రామ సభల ద్వారా ప్రజల అభిప్రాయాలు తెలుసుకొని, అభివృద్ధి పనుల్లో పారదర్శకతను పెద్దపీట వేస్తానన్నారు. ఎమ్మెల్యే గిత్త జయసూర్య సహకారంతో గ్రామానికి అవసరమైన నిధులు ప్రభుత్వ పథకాలు తీసుకువచ్చి అపరిష్మ త సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సర్పంచి పదవిని బాధ్యతగా భావించి ప్రజలకు అందుబాటులో ఉంటూ, గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరినే భాగస్వాములు చేసుకుంటానని పేర్కొన్నారు. ప్రజల ఆధారాభిమానాలు, మద్దతుతో సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసినట్లు తెలిపారు. తనకు మద్దతు ఇచ్చి ఆశీర్వదించాలని గ్రామ ప్రజలను కోరారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడమే పోలీస్ శాఖ లక్ష్యం...

జిల్లా ఎస్పీ.. సునీల్ షారోన్



చాగలమర్రి నవంబర్ 23, నంది పత్రిక చాగలమర్రిలో పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా, నిర్వహించడమే పోలీసు లక్ష్యమని నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షారోన్ అన్నారు. సోమవారం ప్రచార సమయంలో చోటు చేసుకున్న ఉద్రిక్త సంఘటనపై జిల్లా ఎస్పీ చాగలమర్రి చేరుకుని ఘర్షణలకు దారి తీసిన పరిస్థితులపై విచారణ చేపట్టారు. ఈ ఘటనకు సంబంధించి ఘర్షణలకు పాల్పడిన ఇరువర్గాలపై కేసు నమోదు చేయడం జరిగింది. ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత నిస్తూ పోలీస్ శాఖ నిరంతరం అప్రమత్తంగా ఉండి పని చేస్తుందన్నారు. ఎన్నికల సమయంలో సంయమనం పాటిస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు రావివ్వకుండా వ్యవహరించేందుకు పోలీస్ శాఖ పూర్తిస్థాయిలో సహకరించాలన్నారు. జిల్లా ఎస్పీ తో పాటు ఏ ఆర్ అడిషనల్ ఎస్పీ చిన్ని కృష్ణ, ఆళ్లగడ్డ డి.ఎస్.పి రవికుమార్, చాగలమర్రి ఎస్సై నాగేంద్ర ప్రసాద్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



ముసల్‌రెడ్డిపల్లిలో 120 ఎకరాల భూమి ఆక్రమణకు యత్నం..

కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకోవాలి: పోతిరెడ్డి నాగార్జున రెడ్డి

పోరుమామిళ్ల, నవంబర్ 23 (నంది పత్రిక):కడప జిల్లా పోరుమామిళ్ల మండలం ముసల్‌రెడ్డిపల్లి గ్రామ పరిధిలో భూమి ఆక్రమణలు జరుగుతున్నాయని, వాటిని తక్షణమే అడ్డుకుని బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మాజీ ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జున రెడ్డి జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.ఈ మేరకు 2026 నవంబర్ 23న జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తూ, ముసల్‌రెడ్డిపల్లి గ్రామ పరిధిలో తమ పూర్వీకుల నుంచి సుమారు 1,750 ఎకరాల భూమి సంక్రమించిందని, గతంలో ప్రభుత్వం ఆ భూమిని స్వాధీనం చేసుకుందని తెలిపారు. ఈ భూమికి సంబంధించి హైకోర్టులో న్యాయపోరాటం కొనసాగుతోందని, ఇప్పటివరకు తాము ఎలాంటి పరిహారం కూడా పొందలేదని పేర్కొన్నారు.అయితే, అదే గ్రామానికి చెందిన సయ్యద్ మహమ్మద్ షఫీ అనే వ్యక్తి ఎలాంటి పట్టాలు లేదా భూ హక్కులకు సంబంధించిన ఆధారాలు లేకుండానే సదరు భూమిలోకి ప్రవేశించి ఆక్రమణలకు పాల్పడుతున్నారని ఫిర్యాదులో ఆరోపించారు. ఇప్పటికే సుమారు 70 ఎకరాల్లో చెట్లను తొలగించి భూమిని చదును చేశారని, తాజాగా మరో 50 ఎకరాల వరకు జేసీబీలు, డోజర్లతో భూమిని చదును చేస్తూ కయ్యలు ఏర్పాటు చేస్తున్నారని పేర్కొన్నారు.గతంలో ఈ విషయాన్ని ఆర్డీవో, తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లగా రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, అది ప్రభుత్వ భూమి అని సూచిస్తూ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారని తెలిపారు. అయితే ప్రస్తుతం ఆ బోర్డును తొలగించి మళ్లీ ఆక్రమణలకు పాల్పడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.ఈ ఆక్రమణలను వెంటనే అడ్డుకోకపోతే మరికొందరు కూడా భూములను ఆక్రమించుకునే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయం కావడంతో అధికారుల పర్యవేక్షణ తక్కువగా ఉంటుందనే ఉద్దేశంతోనే పనులు కొనసాగిస్తున్నారనే అనుమానాన్ని వ్యక్తం చేశారు.జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో విచారణ జరిపించాలని, భూమి చదును పనులను నిలిపివేయించి, ఆక్రమణల ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టి న్యాయపరంగా, చట్టపరంగా చర్యలు తీసుకోవాలని పోతిరెడ్డి నాగార్జున రెడ్డి కోరారు ఈ వినతిపత్రం ప్రతులను జాయింట్ కలెక్టర్, కడప; ఆర్డీవో, బద్వేల్; తహసీల్దార్, పోరుమామిళ్ల వారికి కూడా పంపించాను అని అన్నారు.



టీడీపీ సర్పంచ్ అభ్యర్థుల విజయానికి ఉమాపతి నాయుడు ప్రచారం.

ఆదోని మండలంలో గనేకల్, జి.వాసల్లి గ్రామాల్లో విస్తృత ఎన్నికల ప్రచారం.



ఆదోని నంది పత్రిక ప్రతినిధి ఆదోని మండలంలోని గనేకల్, జి.వాసల్లి గ్రామాల్లో టీడీపీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులకు మద్దతుగా టీడీపీ సీనియర్ నాయకులు కొంకా ఉమాపతి నాయుడు సోమవారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు.గనేకల్ గ్రామంలో టీడీపీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి జె.సి. బంగారయ్యకు, జి.వాసల్లి గ్రామంలో సర్పంచ్ అభ్యర్థి కె. మీనాక్షికి మద్దతుగా ఆయా గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటా ప్రచారం చేపట్టారు. గ్రామ ప్రజలను కలుసుకుని అభ్యర్థుల విజయానికి తమ ఓటు వేసి అండగా నిలవాలని కోరారు. ఈ సందర్భంగా ఉమాపతి నాయుడు మాట్లాడుతూ టీడీపీ బలపరిచిన అభ్యర్థులను గెలిపిస్తే గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం నుంచి అవసరమైన సహకారం అందేలా కృషి చేస్తామని తెలిపారు. గ్రామాల్లో ప్రజల సమస్యలను పరిష్కరించడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రంగస్వామి నాయుడు, గోపాల్ రెడ్డి, జిందేశంకర్, రంగన్న, కృష్ణారెడ్డి, గనేకల్ విరుపాక్షి, తాయప్ప, రంగస్వామి, పరమేష్, హనుమంత్ రెడ్డి, బంగారయ్య, విశ్వనాథ్ రెడ్డి, రాఘవేంద్ర, గంగన్న, దేవా, మహాదేవ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ వీడి టిడిపిలోకి...

150 కుటుంబాలు చేరిక, వైసీపీకి బిగ్ షాక్..

నియోజకవర్గం అభివృద్ధి ధ్యేయంగా ముందుకు వెళ్తున్నాం

ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ





చాగలమర్రి నవంబర్ 23 నంది పత్రిక చాగలమర్రి పట్టణంలో వైసిపి వీడి టిడిపిలోకి సుమారు 150 కుటుంబాలు సోమవారం ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ సమక్షంలో చేరి వైసీపీకి బిగ్ షాక్ ఇచ్చారు. చాగలమర్రి పట్టణంలోని 2,4,5,6 వార్డులతోపాటు 13, 15 వార్డులకు సంబంధించిన బుడ్డా బాయ్ గారి మాబు పీరా, బుడ్డా బాయ్ గారి షబ్బీర్, భాష, వాజిద్, అక్రమ్, కమల్, కలం బీడీ బషీర్, కాశీం వలి, విదేకుల బాషా, జమాల్ బాషా, నిజాం, తదితరులు చేరారు. ఆళ్లగడ్డ తాలూకాలో పలు గ్రామాలలో తెలుగుదేశం పార్టీ అభివృద్ధిని చూసి కండోపతండాలుగా, వలసలుగా వైసీపీ నుంచి టిడిపిలోకి చేరారని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు ఆన్సర్ భాష ,భూమా అభిమానులు పాల్గొన్నారు

కడప చిన్నారులను జాతీయ స్థాయి గుర్రపు స్వారీ క్రీడాకారులుగా తీర్చిదిద్దాలి



జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ పెంపొందించేందుకు క్రీడలు దోహదం

కడప, బ్యూరో చీఫ్ నవంబర్ 23 నంది పత్రిక : చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలని.. కడప జిల్లా విద్యార్థులను జాతీయ స్థాయి గుర్రపు స్వారీ క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు ప్రోత్సాహం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. సోమవారం నగర శివార్లలోని నగర వనంలో రాష్ట్ర విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ప్రారంభించిన గుర్రపు స్వారీ శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఇప్పటివరకు విద్యార్థుల ప్రతిభను ప్రధానంగా చదువులు, మార్కుల ఆధారంగా అంచనా వేసేవారని, ప్రస్తుతం ప్రభుత్వం క్రీడలు సహా వివిధ రంగాల్లో విద్యార్థులకు అవకాశాలు కల్పిస్తోందని తెలిపారు. విద్యాశాఖ మంత్రి, ముఖ్యమంత్రి, సమగ్ర శిక్ష ఉన్నతాధికారుల సహకారంతో జిల్లాలో తొలిసారిగా గుర్రపు స్వారీ శిక్షణ ప్రారంభించడం విద్యార్థులకు గొప్ప అవకాశమని పేర్కొన్నారు. గుర్రపు స్వారీ అనేది కేవలం ఒక క్రీడ మాత్రమే కాదని, దానికి ఎంతో ఓపిక, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, మానసిక, శారీరక సమతుల్యత అవసరమని కలెక్టర్ వివరించారు. ఒక మూగజీవితో అనుబంధం పెంచుకుని, ప్రేమతో దాని నమ్మకాన్ని పొందుతూ స్వారీ చేయడం ద్వారా పిల్లల్లో బాధ్యత, సహనం, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని తెలిపారు. ప్రతిరోజూ నిబద్ధతతో సాధన చేస్తూ, ముందుగా తమపై తాము నియంత్రణ సాధించిన విద్యార్థులు భవిష్యత్తులో ఏ రంగంలోనైనా ఉత్తమ నాయకులుగా ఎదగగలరని అన్నారు. ముఖ్యంగా విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. భవిష్యత్తు సమాజాన్ని, భావితరాలను ముందుకు నడిపించడంలో మహిళల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. 2027 లేదా 2028 నాటికి కడప నుంచి కనీసం ఇద్దరు విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి, జిల్లాకు, పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కడప విద్యార్థుల్లో దేశంలోనే అత్యుత్తమంగా నిలిచే సామర్థ్యం ఉందని, సరైన శిక్షణ, పట్టుదల, నిరంతర సాధన ఉంటే లక్ష్యాన్ని తప్పక సాధించవచ్చని ప్రోత్సహించారు. శిక్షణ పొందుతున్న విద్యార్థుల ప్రతిభ, పురోగతిని అధికారులు నిరంతరం పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. ప్రతి 15 రోజులకు ఒకసారి వారి నైపుణ్యాలను అంచనా వేసి, ప్రతిభ కనబరిచిన వారిని తదుపరి స్థాయి శిక్షణకు ఎంపిక చేయాలని ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్‌లో అందుబాటులో ఉన్న శిక్షణ వసరులను వినియోగించుకోవడంతో పాటు, తిరుపతిలోని ఎన్‌సీసీ గుర్రపు స్వారీ శిక్షణ కేంద్రం వంటి సంస్థల సహకారంతో విద్యార్థులను ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. చిన్న వయస్సులోనే ఇలాంటి ప్రత్యేక క్రీడల్లో శిక్షణ పొందడం విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడుతుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కడప జిల్లాకు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావాలని కలెక్టర్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిఎవో శంశుద్దీన్, సమగ్ర శిక్ష ఏపిసి అనురాధ, డీఎస్ఓ జగన్నాథ్ రెడ్డి, విద్యాశాఖ అధికారులు, సిబ్బంది, శిక్షకులు, విద్యార్థులు పాల్గొన్నారు





అంతర్జాతీయ మార్కెట్లలో జోరు.. భారీగా లాభపడిన పసిడి, వెండి

గత వారం భారీగా పతనమైన పసిడి, వెండి ధరలు సోమవారం నాటకీయంగా పుంజుకున్నాయి. కనిష్ఠ ధరల వద్ద మదుపర్లు కొనుగోళ్లకు మొగ్గు చూపడం, అంతర్జాతీయ మార్కెట్లో అమెరికన్ డాలర్ కాస్త బలహీనపడటంతో బులియన్ మార్కెట్లలో తిరిగి ఉత్సాహం కనిపించింది. ఈ తాజా ర్యాలీతో దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో ఇటీవల చోటుచేసుకున్న ధరల తగ్గుదల ఎంతకాలం కొనసాగుతుందనే అంశంపై మళ్లీ చర్చ

Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications #2-189, journalist colony, lakshmi narasimha swamy temple back side, Pulivendula Town, Y.S.R Kadapa District, Andhra Pradesh -PinCode:-516390, GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No:- APTEL/26/A6827 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com

తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ గా ఎం.శ్రీనివాస ప్రసాద్, డిప్యూటీ మేయర్ గా పాలడుగు విజయ ప్రమాణ స్వీకారం







మేయర్, డిప్యూటీ మేయర్ మరియు కార్పొరేటర్లతో ప్రమాణ స్వీకారం చేయించిన జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్

తిరుపతి, బ్యూరో చీఫ్ నవంబర్ 23 నంది పత్రిక: తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ గా ఎం. శ్రీనివాస ప్రసాద్, డిప్యూటీ మేయర్ గా పాలడుగు విజయలతో స్థానిక ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకులు డా.ఎం.వరప్రసాద్ సమక్షంలో జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ ప్రమాణ స్వీకారం చేయించారు. సోమవారం స్థానిక ఎస్ వి యూనివర్సిటీలోని శ్రీనివాస ఆడిటోరియం నందు తిరుపతి నగర పాలక సంస్థ మేయర్, కార్పొరేటర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమం అనంతరం ఎస్ వి యూనివర్సిటీ సెనేట్ హాల్ నందు డిప్యూటీ మేయర్ ఎన్నిక మరియు ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. ముందుగా శ్రీనివాస ఆడిటోరియంలో నగర పాలక సంస్థ మేయర్ గా ఎన్నికైన ఎం.శ్రీనివాస ప్రసాద్ (అనే జే బి శ్రీనివాస్) చేత జిల్లా కలెక్టర్ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం అక్షర క్రమంలో ఒక్కొక్కరిగా 66 మంది కార్పొరేటర్ లతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి తిరుపతి, చంద్రగిరి ఎం ఎల్ ఏ లు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని, తుడా ఛైర్మన్ డాలర్ దివాకర్ రెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ ఎం. జయకృష్ణ, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, రాష్ట్ర గ్రీనరీ మరియు బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఛైర్మన్ సుగుణమ్మ, రాష్ట్ర హస్తకళాల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ డా. పసుపులేటి హరి ప్రసాద్, మాజీ కేంద్ర మంత్రి పనబాక లక్ష్మీ, ఎస్ వి బి సి ఛైర్మన్ శ్రీధర్ వర్మ, తిరుపతి నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ యు. శారదాదేవి, స్మార్ట్ సిటీ జిఎం చంద్రమౌళి, మున్సిపల్ అధికారులు, కార్పొరేటర్ ల కుటుంబ సభ్యులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎస్ వి సెనేట్ హాల్ నందు డిప్యూటీ మేయర్ ఎంపిక కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఇందులో భాగంగా 35వ డివిజన్ నుండి ఎంపికైన జనసేన అభ్యర్థిని పాలడుగు విజయ పేరును డిప్యూటీ మేయర్ గా జనసేనకు చెందిన 34వ డివిజన్ కార్పొరేటర్ డి.నీతా పటేల్ ప్రతిపాదించగా, అదే పార్టీకి చెందిన 10వ వార్డు కార్పొరేటర్ పురిమిట్ల రాణి బలపరిచారు. డిప్యూటీ మేయర్ పదవికి ప్రతిపాదిత అభ్యర్థి పాలడుగు విజయను 62 మంది కార్పొరేటర్లు, స్థానిక ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుతో కలిపి మొత్తం 63 మంది సభ్యులు ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ ఎం. శ్రీనివాస ప్రసాద్, తిరుపతి ఎం ఎల్ ఏ ఆరణి శ్రీనివాసులు, నగరపాలక సంస్థ కమిషనర్ ఎం. జయకృష్ణ, తిరుపతి నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ యు. శారదాదేవి, స్మార్ట్ సిటీ జిఎం చంద్రమౌళి, మున్సిపల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.









కొలువుతీరిన తిరుపతి నగరపాలక సంస్థ నూతన పాలకవర్గం



ఘనంగా ప్రమాణస్వీకార మహోత్సవం

మేయర్ గా మన్నెం శ్రీనివాస ప్రసాద్ఏ జేబీ శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ గా పాలడుగు విజయ ప్రమాణం

తిరుపతి బ్యూరో చీఫ్ నవంబర్ 23 నంది పత్రిక తిరుపతి నగరపాలక సంస్థ నూతన పాలకవర్గం సోమవారం ఘనంగా కొలువుదీరింది. మేయర్ గా గెలుపొందిన తరువాత గ్రామదేవత శ్రీ తాతయ్యగుంట గంగమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం టౌన్ క్లబ్ కూడలి లోని తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆ తరువాత బాలాజీ కాలనీ కూడలిలోని జ్యోతిరావు పూలే విగ్రహానికి పుష్పాంజలి సమర్పించారు. ఆ తరువాత శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ముందు ఉన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. అక్కడి నుంచి భారీ జనసంద్రోహం నడుమ ఊరేగింపు గా శ్రీనివాస ఆడిటోరియం వద్దకు చేరుకున్నారు.

మేయర్ ప్రమాణస్వీకారం తో హోరెత్తిన ఆడిటోరియం

నగరంలోని శ్రీనివాస ఆడిటోరియంలో జరిగిన ప్రమాణస్వీకార మహోత్సవంలో మేయర్ గా మన్నెం శ్రీనివాస ప్రసాద్ఏ జేబీ శ్రీనివాస్ చేత జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ప్రమాణం చేయించారు. ఆయన ప్రమాణస్వీకారం చేస్తున్న అంతసమయం ఆడిటోరియం మొత్తం అభిమానులు కేరింతలతో ఆడిటోరియం హోరెత్తింది. అనంతరం 66 మంది కార్పొరేటర్లతో కలెక్టర్ ప్రమాణ స్వీకారం చేయించారు.

డిప్యూటీ మేయర్ ఎన్నిక..! అనంతరం ఎస్వీయూ సెనేట్ హాల్లో జరిగిన డిప్యూటీ మేయర్ ఎన్నికలో 35వ డివిజన్ నుండి ఎంపికైన జనసేన అభ్యర్థిని పాలడుగు విజయ పేరును డిప్యూటీ మేయర్ గా జనసేనకు చెందిన 34వ డివిజన్ కార్పొరేటర్ డి.నీతా పటేల్ ప్రతిపాదించగా, అదే పార్టీకి చెందిన 10వ వార్డు కార్పొరేటర్ పురిమిట్ల రాణి బలపరిచారు. డిప్యూటీ మేయర్ పదవికి ప్రతిపాదిత అభ్యర్థి పాలడుగు విజయను 62 మంది కార్పొరేటర్లు, స్థానిక ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు (ఎక్స్ అఫీసియో) సభ్యులతో కలిపి మొత్తం 63 మంది సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆమెతో కలెక్టర్ డిప్యూటీ మేయర్ గా ప్రమాణం చేయించారు. తిరుపతి, చంద్రగిరి ఎం ఎల్ ఏ లు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని, తుడా ఛైర్మన్ డాలర్ దివాకర్ రెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ ఎం. జయకృష్ణ, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, రాష్ట్ర గ్రీనరీ మరియు బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఛైర్మన్ సుగుణమ్మ, రాష్ట్ర హస్తకళాల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ డా. పసుపులేటి హరి ప్రసాద్, టీటీడీ బోర్డు సభ్యులు పనబాక లక్ష్మీ, భావప్రకాష్ రెడ్డి, ఎస్విబిసి ఛైర్మన్ శ్రీధర్ వర్మ, తాతయ్య గుంట ఆలయ ఛైర్మన్ మహేష్ యాదవ్, తిరుపతి నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ యు. శారదాదేవి, స్మార్ట్ సిటీ జిఎం చంద్రమౌళి, మున్సిపల్ అధికారులు, కార్పొరేటర్లు కుటుంబ సభ్యులు, కూటమి పార్టీల నాయకులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ జేబీ శ్రీనివాస్ మీడియాతో మాట్లాడారు... అత్యధిక మెజారిటీతో గెలిపించిన నగర ప్రజలకు పాదాభివందనం చేస్తున్నాను. 100రోజుల ప్రణాళికతో అభివృద్ధిని చేసి చూపిస్తాను. తిరుపతిని అభివృద్ధిని చూసి మిగతా నగరాలు మారేలా చేస్తాను. తిరుపతిని మరింత అభివృద్ధి చేయాలని లోకేష్ ఆదేశించారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ల ఆదేశాలకు అనుగుణంగా పనిచేస్తాను. త్వరలో యూడీసీ సమస్యకు పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చారు



పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ, స్ట్రాంగ్ రూమ్ ఏర్పాట్లు పరిశీలించిన జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ



భీమవరం బ్యూరో చీఫ్ నవంబర్ 23 నంది పత్రిక ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నిర్వహిస్తున్న పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను, పోస్టల్ బ్యాలెట్‌ల భద్రత కోసం ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ను సోమవారం జిల్లా ఇన్చార్జి కలెక్టర్ కె.ఆర్ కల్పశ్రీ పరిశీలించారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే ఎన్నికల సిబ్బందికి కల్పించిన సౌకర్యాలు, ఓటింగ్ ప్రక్రియ నిర్వహణ, బ్యాలెట్ పత్రాల స్వీకరణ, వాటి భద్రత తదితర అంశాలను జిల్లా ఇన్చార్జ్ కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ

పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా, పారదర్శకంగా, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు.అలాగే పోస్టల్ బ్యాలెట్ పత్రాలను భద్రపరిచేందుకు ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్ భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల పర్యవేక్షణ, రికార్డుల నిర్వహణ, స్ట్రాంగ్ రూమ్ వద్ద విధులు నిర్వహించే సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వహించాలన్నారు.పోస్టల్ బ్యాలెట్ పత్రాల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, నిరంతర పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఎన్నికల ప్రక్రియలో ప్రతి దశను నిబంధనల ప్రకారం నిర్వహిస్తూ, ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు సమర్థవంతంగా చేయాలని జిల్లా ఇన్చార్జ్ కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

సందర్భంలో ఆర్డీవో కే ప్రవీణ్ కుమార్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఎం రామచంద్రారెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు,





28 వార్డు కౌన్సిలర్ గా మోమిన్ హుస్సేన్



నంది పత్రిక ఆత్మకూరు సంద్యాల జిల్లా ఆత్మకూరు పట్టణంలో వైఎస్ఆర్ సీపీ కార్యాలయం నందు శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి ఆశీస్సులతో ఆత్మకూరు మున్సిపాలిటీ 28వ వార్డు కౌన్సిలర్ గా ఏకగ్రీవంగా ఎన్నికైనటువంటి మోమిన్ హుస్సేన్ ఆయన తండ్రి రాష్ట్ర వైఎస్సార్సీపీ మైనార్టీ సెల్ కార్యదర్శి మోమిన్ మునీర్ భాష మరియు 28వ వార్డు ప్రజలతో కలిసి శ్రీశైలం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డిని మరియు శ్రీశైలం నియోజకవర్గ సమన్వయకర్త శిల్ప భువనేశ్వర్ రెడ్డిని గజమాలా వేసిఘనముగాసన్మానించారు. 28వ వార్డులో సిసి రోడ్ల నిర్మాణము డ్రైనేజీ నిర్మాణము అదేవిధంగా అభివృద్ధిలో ముందుకు తీసుకొని పోతానని హామీ ఇస్తూ 28వ వార్డులో ఏ ఇబ్బందులు ఉన్నా ప్రజలకు అన్నివేళలా ఆదుకుంటానని హామీ ఇస్తూ వార్డు సభ్యులతో కలిసి మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి గజమాలతో సత్కరించడం జరిగింది

మున్సిపల్ కౌన్సిలర్లుగా వైసీపీ అభ్యర్థుల ప్రమాణ స్వీకారం

అభినందించిన మాజీ ప్రభుత్వ విప్పు గంగుల ప్రభాకర్ రెడ్డి



ఆళ్లగడ్డ ప్రతినిధి నవంబర్ 23, నంది పత్రిక ఆళ్లగడ్డ మున్సిపాలిటీ నూతన కౌన్సిలర్లుగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు సోమవారం ప్రమాన స్వీకారం చేశారు. మున్సిపల్ కార్యాలయంలో ప్రీసైడింగ్ అధికారి శ్రీధర్ రెడ్డి 8 మంది వైసీపీ కౌన్సిలర్లతో ప్రమాన స్వీకారం చేయించారు. అనంతరం కర్నూలు పార్లమెంట్ పరిశీలకులు గంగుల ప్రభాకర్ రెడ్డి వారిని ప్రత్యేకంగా కలుసుకొని హృదయ పూర్వక అభినందనలు తెలిపారు.

బేతంచెర్ల మండలంలో నామినేషన్ల ప్రక్రియ ముగింపు.

బి19 గ్రామ పంచాయతీలకు 149 సర్పంచ్, 477 వార్డు నామి నేషన్లు. -తెలిపిన ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్.



బేతంచెర్ల: నవంబర్ 23(నందిపత్రిక).మండల పరిధిలోని 19 గ్రామ పంచాయతీలకు నిర్వహించిన గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ సోమవారంతో ముగిసింది. మూడు రోజుల పాటు కొనసాగిన నామినేషన్ల ప్రక్రియలో చివరి రోజు 44 మంది సర్పంచ్ అభ్యర్థులు, 197 మంది వార్డు మెంబర్ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు.మూడు రోజుల నామినేషన్ ప్రక్రియ ముగిసే సమయానికి మండలంలోని 19 గ్రామ పంచాయతీల పరిధిలో మొత్తం 149 మంది సర్పంచ్ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా, వార్డు మెంబర్ స్థానాలకు 477 నామినేషన్లు నమోదయ్యాయి. ఎన్నికల ప్రక్రియలో భాగంగా నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం ముగియడంతో, తదుపరి నామినేషన్ల పరిశీలన ప్రక్రియ 24-11-2026 ఉదయం 8:00 గంటలకు నామినేషన్ల పరిశీలన ప్రక్రియ నిర్వహించబడుతుందని కావున అభ్యర్థులందరూ కూడా తప్పకుండా పాల్గొనవలసిందిగా కోరడమైనది . గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని అన్ని నామినేషన్ కేంద్రాల్లో ఎన్నికల అధికారులు నిబంధనల ప్రకారం విధులు నిర్వహించారు.

నంద్యాల జిల్లా జూనియర్ బేస్‌బాల్ ఎంపిక పోటీలు విజయవంతం

ఆళ్లగడ్డలో ఉత్సాహంగా సాగిన జిల్లా స్థాయి సెలక్షన్లు.. సుమారు 200 మంది బాలబాలికల ప్రతిభ ప్రదర్శన



ఆళ్లగడ్డ ప్రతినిధి నవంబర్ 23 నంది పత్రిక ఆళ్లగడ్డ పట్టణంలోని ఎద్దుల పాపమ్మ హైస్కూల్ క్రీడా మైదానంలో నంద్యాల జిల్లా బేస్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి జూనియర్ బేస్‌బాల్ ఎంపిక పోటీలు విజయవంతంగా ముగిశాయి. ఈ ఎంపిక పోటీలకు జిల్లా నలుమూలల నుంచి సుమారు 200 మంది బాలబాలికలు పాల్గొని తమ క్రీడా ప్రతిభను చాటుకున్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీరరాఘవయ్య, క్రెడిట్ విజిలెన్స్ అధికారి నాగస్వరం నరసింహ, ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బ్రహ్మానందరెడ్డి, మాజీ ఎస్‌జీఎఫ్ సెక్రటరీ విశ్వనాథ్ హాజరయ్యారు. అలాగే అబ్జర్వర్ కోచ్ వెంకటరమణ, పీడీ నాగేంద్ర, దాదాపీర్, పుల్లయ్య, రమణయ్య, నరసింహ, శ్రీనాథ్ రెడ్డి, షేక్షావలి, దేవేంద్ర, బుచ్చిబాబు, చంద్రబాబు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నంద్యాల జిల్లా బేస్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ సుబ్బయ్య మాట్లాడుతూ.. జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరిచి ఎంపికైన బాలికల జట్టు డిసెంబర్ 4, 5 తేదీలలో మార్కాపురం జిల్లా కంచర్లవారిపల్లెలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు.అదేవిధంగా బాలుర జట్టు డిసెంబర్ 12, 13 తేదీలలో ఒంగోలు జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీల్లో నంద్యాల జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తుందని వెల్లడించారు.జిల్లాలో బేస్‌బాల్ క్రీడను మరింత అభివృద్ధి చేయడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి రాష్ట్ర, జాతీయ స్థాయికి తీర్చిదిద్దడమే అసోసియేషన్ లక్ష్యమని పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి నంద్యాల జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఈ సందర్భంగా అతిథులు, క్రీడా నిర్వాహకులు ఆకాంక్షించారు.



మిల్లర్ల నుంచి సేకరించిన గోనె సంచులను రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు పంపిణీ చేయాలి.





జిల్లాలో ఖరీఫ్ 2026-27 ధాన్యం కొనుగోలు సేకరణ, గోనె సంచుల పంపిణీ పై అవగాహన కార్యక్రమం.

ఇంచార్జి జిల్లా కలెక్టర్ కె ఆర్ కల్ప శ్రీ

భీమవరం, బ్యూరో చీఫ్ నవంబర్,23 నంది పత్రిక

ధాన్యం సేకరణ ప్రక్రియలో భాగంగా మిల్లర్ల నుంచి సేకరించిన గోనె సంచులను రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు పంపిణీ చేయాలని ఇంచార్జి జిల్లా కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ పేర్కొన్నారు.సోమవారం ఎస్ ఆర్ కె ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియం లో గోనె సంచుల సేకరణ, రైతు సేవా కేంద్రాల ద్వారా పంపిణీ విధానం, యాప్‌లో వివరాల నమోదు, డేటా అప్‌లోడ్ ప్రక్రియ, రికార్డుల నిర్వహణ తదితర అంశాలపై డేటా ఆపరేటర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఇన్చార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గోనె సంచుల పంపిణీ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని అన్నారు. ఖరీఫ్ సీజన్ 2026-27 లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా వ్యాప్తంగా అన్ని చోట్ల ప్రారంభించడం జరిగిందని, ఇందుకు అవసరమైన గోనెసంచు లు అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులకు తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు అవసరమైన గోనె సంచులను సకాలంలో అందుబాటులో ఉంచడం అత్యంత ముఖ్యమన్నారు. మిల్లర్ల నుంచి సేకరించిన గోనె సంచులను రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు అందజేసే విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు.

యాప్‌లో వివరాల నమోదు తప్పనిసరి

గోనె సంచుల పంపిణీకి సంబంధించిన పూర్తి వివరాలను డేటా ఆపరేటర్లు నిర్దేశించిన యాప్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేసి అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. గోనె సంచుల పంపిణీ ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండేలా ప్రతి దశకు సంబంధించిన వివరాలను డిజిటల్ విధానంలో నమోదు చేయాలని స్పష్టం చేశారు. రైతులకు పంపిణీ చేసిన గోనె సంచుల సంఖ్య, పంపిణీ వివరాలు తదితర సమాచారాన్ని సంబంధిత డేటా ఆపరేటర్లు యాప్‌లో తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలన్నారు. డేటా ఆపరేటర్లు యాప్ వినియోగంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, వివరాలను నమోదు చేసే సమయంలో ఎలాంటి తప్పులు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో వాస్తవంగా జరిగిన పంపిణీకి, యాప్‌లో నమోదు చేసిన వివరాలకు మధ్య వ్యత్యాసం లేకుండా చూసుకోవాలన్నారు.

పంపిణీ ప్రక్రియపై నిరంతర పర్యవేక్షణ

మిల్లర్ల నుంచి గోనె సంచుల సేకరణ, రైతు సేవా కేంద్రాలకు వాటి తరలింపు, రైతులకు పంపిణీ వంటి ప్రతి దశను సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. గోనె సంచుల నిల్వలు, పంపిణీ వివరాలకు సంబంధించి రికార్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు. రైతులకు గోనె సంచులు అందించడంలో ఎటువంటి జాప్యం జరగకుండా రైతు సేవా కేంద్రాల సిబ్బంది, మిల్లర్లు, డేటా ఆపరేటర్లు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. రైతులు ధాన్యం విక్రయించే సమయంలో అవసరమైన గోనె సంచులు అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సిబ్బంది అందుబాటులో ఉండేలా యం.ఎల్.ఒ లే బాధ్యత వహించాలని ఆయన అన్నారు. జిల్లాలో అన్ని ధాన్యం కేంద్రాలను రైతులు సౌకర్యార్థం సిద్ధంగా ఉండాలని ఆయన అన్నారు. మిల్లర్లు గొనె సంచులను సరఫరా చేయు టకు సిద్ధంగా ఉండాలని ఈ సందర్భంగా తెలియజేశారు. ధాన్యం కొనుగోలు సమయంలో అధికారులు జాగ్రత్త వహించాలని, మిల్లు వద్ద ఉన్న వాహనాలకు ట్రక్ షీట్ లు జనరేట్ చేయవద్దని తెలిపారు. రైతు సేవ కేంద్రాల వద్ద ఉన్న వాహనాలకు మాత్రమే ట్రక్ సీట్లు జనరేట్ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో రైతులకు ఎటువంటి సమస్యలు ఉన్న క్విక్ టీములను ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించడం జరుగుతుందన్నారు. రైతులకు ఎటువంటి సమస్యలు ఉన్న జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నెంబర్ 8121676653 టోల్ ఫ్రీ నెంబర్ కు సంప్రదించవచ్చని తెలిపారు. అవగాహన కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల మేనేజర్ ఇబ్రహీం, జిల్లా కో ఆపరేటివ్ అధికారి, డేటా ఎంట్రీ ఆపరేటర్ లు, తదితరులు పాల్గొన్నారు.

అగ్రిస్టాక్ అమలుతో రైతులకు ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా అందించాలి..

ఇన్చార్జి జిల్లా కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ

భీమవరం బ్యూరో చీఫ్ నవంబర్ 23 నంది పత్రిక

పశ్చిమగోదావరి జిల్లాలో అగ్రిస్టాక్ అమలు, రైతుల నమోదు, భూముల వివరాల ప్రక్షాళన, వ్యవసాయ అనుబంధ శాఖల సమాచార సమన్వయంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఇన్చార్జి జిల్లా కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ సూచించారు. సోమవారం కలెక్టరేట్లోని జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో సంబంధిత శాఖల అధికారులతో అగ్రిస్టాక్ జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ తొలి సమావేశం (అగ్రిస్టాక్ మీటింగ్) నిర్వహించారు. ఈ కమిటీకి జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా, జిల్లా వ్యవసాయ అధికారి కన్వీనర్‌గా వ్యవహరిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలో అగ్రిస్టాక్ అమలు పురోగతి, రైతుల నమోదు, భూముల వివరాల నమోదు, వివిధ శాఖల సమాచార అనుసంధానంపై సమీక్షించారు. జిల్లాలో మొత్తం 1,75,684 మంది రైతులకు గాను ఇంకా 50,300 మంది రైతులు రైతు రిజిస్ట్రీలో నమోదు కావాల్సి ఉందని, మిగిలిన రైతులందరినీ ప్రాధాన్యత క్రమంలో త్వరితగతిన నమోదు చేసి 100 శాతం లక్ష్యాన్ని సాధించాలని ఆదేశించారు. అర్హులైన కౌలు రైతులను కూడా నమోదు ప్రక్రియలో చేర్చాలన్నారు. రైతు గుర్తింపు సంఖ్య ద్వారా అన్నదాత సుఖీభవపీఎం కిసాన్, పంటల బీమా, ధాన్యం సేకరణ, వ్యవసాయ రుణాలు తదితర ప్రభుత్వ సేవలను పారదర్శకంగా అందించవచ్చని తెలిపారు.రెవెన్యూ, వ్యవసాయ, నీటిపారుదల శాఖలు సమన్వయంతో వెట్‌ల్యాండ్ రికార్డుల్లో అసంపూర్తి మ్యుటేషన్లు, భూముల వివరాల్లో తప్పులు, మిస్సింగ్ సర్వే నంబర్లు, రీసర్వే వ్యత్యాసాలు, ఆధార్ అనుసంధాన సమస్యలను పరిష్కరించాలని సూచించారు. కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డుల జారీ, పంట రుణాల మంజూరులో ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకో వాలన్నారు.ఉద్యాన, మార్కెటింగ్, పౌరసరఫరాలు, సహకార, నీటిపారుదల తదితర శాఖలు తమ పరిధిలోని రైతులు, పంటలు, సాగునీటి వనరులు, మార్కెట్ ధరలు, ధాన్యం సేకరణ, నిల్వ సదుపాయాలకు సంబంధించిన సమాచారాన్ని అగ్రిస్టాక్‌తో అనుసంధానం చేయాలని తెలిపారు. తుఫాన్లు, వరదల సమయంలో రైతులకు వేగంగా సేవలందించేలా గ్రామస్థాయి సమాచారాన్ని కూడా అందుబాటులో ఉంచాలన్నారు.అగ్రిస్టాక్ అమలుకు జిల్లా కలెక్టర్ అధ్యక్షతన 18 మంది ప్రతినిధులతో జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి శాఖ నుంచి ఒక నోడల్ అధికారిని



నియమించి జిల్లా వ్యవసాయ అధికారితో సమన్వయం చేసుకోవాలని, రెవెన్యూ, వ్యవసాయ, పంచాయతీరాజ్ శాఖలు సంయుక్తంగా గ్రామస్థాయిలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించి రైతుల నమోదు, భూముల రికార్డుల ప్రక్షాళన చేపట్టాలని ఆదేశించారు. రైతుల వ్యక్తిగత సమాచార భద్రతకు ప్రాధాన్యతనిస్తూ నిర్దిష్ట కాలవ్యవధిలో లక్ష్యాలను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ కమిటీ సమావేశం డివిజన్ స్థాయిల్లో కూడా నిర్వహణ జరిగేలాగా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జి. సునీత, ఎల్‌డీఎం, జిల్లా ఉద్యాన శాఖ అధికారి (డీహెచ్ఓ), వ్యవసాయ శాఖ ఏవో శామ్యూల్ జాన్సన్ వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆల్లగడ్డ మున్సిపాలిటీ అభివృద్ధి చేయడమే మా లక్ష్యం







ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

ప్రమాణ స్వీకారానికి వైసిపి కౌన్సిలర్లు హాజరు కాకపోవడం సరికాదు

ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

ఆళ్లగడ్డ ప్రతినిధి నవంబర్ 23 నంది పత్రిక

ఆళ్లగడ్డ పట్టణ మున్సిపాలిటీలో రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ వెల్లడించారు. సోమవారం టీడీపీ సీనియర్ నాయకులు భార్గవ్ రామ్ నాయకుడు, టీడీపీ యువ నాయకులు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఆళ్లగడ్డ మున్సిపాలిటీ నూతన పాలకవర్గమైన చైర్మన్ షేక్ అన్సియా, కౌన్సిలర్ల ప్రమాణ స్వీకారోత్సవానికిహాజరయ్యారు.ఈ సందర్భంగా భూమా అఖిలప్రియ మాట్లాడుతూ ప్రస్తుతం మున్సిపాలిటీలో బ్రిటిష్ కాలం నాటి భవనంలో సమావేశాలు నిర్వహిస్తున్నారన్నారు. భవనం లేక సమావేశాలు జరుపుకోవడానికి ఇబ్బందిగా మారిందని రూ.3 కోట్లతో అన్ని అంగులతో భవన నిర్మాణం చేపట్టనున్నట్లు తెలియజేశారు. ఆళ్లగడ్డ మున్సిపాలిటీకి మంజూరైన రూ.21 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వివరించారు. ఆళ్లగడ్డలో ఐదు కోట్లతో డిగ్రీ కళాశాలతో పాటు రెండు పార్కులు ఏర్పాటు చేస్తున్నామని ఆమె వివరించారు. గత ప్రభుత్వ హయాంలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులను అడ్డుకున్నారని ఆరోపించారు. అభ్యర్థులను కిడ్నాప్ చేసి ఇబ్బందులు పెట్టారన్నారు.ముఖ్యమంత్రి మాటల మనిషి కాదు చేతల మనిషి అని అన్నారు. ప్రజల ఆశీర్వాదం మన బలం వల్లనే అధికంగా ఏకగ్రీవాలు అయ్యాయని తెలిపారు. కూటమి నాయకులు ఉంటేనే అభివృద్ధి సాధ్యమని ప్రజలు గుర్తించారన్నారు. ప్రతినిత్యం అందుబాటులో ఉంటూ ఆళ్లగడ్డ మున్సిపాలిటీలో అవసరమైన పనులు చేపట్టి అభివృద్ధికి పెద్దపీట వేస్తామన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వారు విడిగా కాకుండా అందరూ కలిసి ఒకేసారి ప్రమాణస్వీకారం చేసి ఉంటే బాగుండేదని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. నేడు విడిగా ప్రమాణస్వీకారం చేసిన సమావేశంలో కలిసి పనిచేయవలసి ఉంటుందని ఆమె అన్నారు. మూడు సార్లు వరుసగా సమావేశాలకు రాకపోతే పదవికి అనర్హులవుతారు అన్నారు. ప్రతి ఒక్కరూ మున్సిపల్ సమావేశాలకు కచ్చితంగా హాజరు కావాలని ఆమె సూచించారు. భూమా, కాటసాని, సోముల, చింతకుంట వర్గాల వారికి మున్సిపాలిటీలో ప్రాతినిధ్యం కల్పించామన్నారు. పార్టీ నుంచి ఇతర పార్టీలో ఉన్న వారిని తిరిగి పార్టీలో చేరితే ఆహ్వానించేందుకు సిద్ధంగా ఉన్నామని పునరుద్ఘాటించారు. అంతకు ముందు మున్సిపల్ కార్యాలయంలో ప్రిసైడింగ్ అధికారి శ్రీధర్ రెడ్డి నూతన మున్సిపల్ చైర్మన్ గా షేక్ అనిస్సియా టిడిపి కౌన్సిలర్లు జనసేన ఇద్దరు కౌన్సిలర్లు చేత ప్రమాణ స్వీకారం చేయించారు ఈ సందర్భంగా నూతన చైర్మన్ మాట్లాడుతూ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అడుగుజాడల్లో మున్సిపాలిటీని అభివృద్ధి పదములో నడిపిస్తామని వీధిలైట్లు కాలువలు పార్కులు ఆధునిక మున్సిపాలిటీని తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని అని అన్నారు. టిడిపి కౌన్సిలర్, హుస్సేన్ భాష భూమా కుటుంబానికి రుణపడి ఉన్నామని తన తండ్రి షరీఫ్ భాష ఆశయాన్ని నిలబెట్టించిన ఘనత భూమా కుటుంబానికి దక్కిందని వారందరికీ తాము సదా రుణపడి ఉంటామని అందుకు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ టిడిపి సీనియర్ నాయకులు భార్గవరాం టిడిపి యువనేత భూమా జగత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పట్టణ సీఐ రాము పట్టణ ఎస్ఐ పీరయ్య ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నూతన కౌన్సిలర్లు న్యాయవాది శివరామిరెడ్డి, రామచంద్రారెడ్డి, తెలుగుదేశం నాయకులు భూమా అభిమానులు తదితరులు పాల్గొన్నారు.





నామినేషన్ స్వీకరణ ప్రక్రియను పరిశీలించిన జిల్లా ఇన్చార్జ్ కలెక్టర్ కె.ఆర్ కల్పశ్రీ



భీమవరం బ్యూరో చీఫ్ నవంబర్ 23 నంది పత్రిక వీరవాసరం మండలం నౌడూరు గ్రామంలో రెండో విడత గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి నిర్వహిస్తున్న నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను సోమవారం జిల్లా ఇన్చార్జి కలెక్టర్ కె.ఆర్ కల్పశ్రీ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా నామినేషన్ల స్వీకరణకు సంబంధించి అధికారులను వివరాలను అడిగి తెలుసుకొని పలు సూచనలను జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్చార్జి కలెక్టర్ కె.ఆర్ కల్పశ్రీ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలన్నారు. నిబంధనలకు అనుగుణంగా నామినేషన్ స్వీకరణ పత్రిను నిర్వహించాలని అధికారులు ఆదేశించారు. నామినేషన్ దాఖలు చేసేందుకు వచ్చిన అభ్యర్థులకు అవసరమైన సమాచారాన్ని స్పష్టంగా అందించాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు కావు లేకుండా ప్రతి అంశమును పారదర్శకత పాటిస్తూ నిష్పక్షపాతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కె .ప్రవీణ్ కుమార్ రెడ్డి, తాహసిల్దార్ బి. కనకదుర్గ, తదితరులు పాల్గొన్నారు.

యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్‌పై ఆక్వా రైతులకు అవగాహన కల్పించాలి

ఇన్చార్జి జిల్లా కలెక్టర్ కె ఆర్ కల్పశ్రీ



భీమవరం బ్యూరో చీఫ్ నవంబర్ 23 నంది పత్రికయాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్) నివారణకు యాంటీబయాటిక్స్ వినియోగంలో తగిన జాగ్రత్తలు పాటిస్తూ, శాస్త్రీయ పద్ధతుల్లో ఆక్వా సాగు నిర్వహించాలని ఇన్చార్జి జిల్లా కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ సూచించారు. ప్రపంచ యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా నవంబర్ 18 నుంచి 24 వరకు నిర్వహిస్తున్న ప్రచార కార్యక్రమంలో భాగంగా సోమవారం వీరవాసరం మండలం కొణితివాడ గ్రామం నవదూరు జంక్షన్‌లోని శ్రీ పద్దాలాల్ వెంకమ్మ అమ్మవారి ఫంక్షన్ హాల్‌లో జాతీయ సుస్థిర ఆక్వాకల్చర్ కేంద్రం (నాక్సా), ఎంపీఈడీఏ ఆధ్వర్యంలో పదో విడత ఏఎంఆర్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఇన్చార్జి జిల్లా కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రొయ్యల సాగులో యాంటీబయాటిక్స్‌ను అనవసరంగా వినియోగించడం వల్ల వాటి అవశేషాలు రొయ్యల్లోనే కాకుండా పర్యావరణం, మానవ ఆరోగ్యంపై కూడా ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. నాణ్యమైన ఆక్వా ఉత్పత్తుల ద్వారా ఎగుమతులను ప్రోత్సహించేందుకు రైతులు మంచి ఆక్వాకల్చర్ నిర్వహణ పద్ధతులను పాటించాలని సూచించారు.నాక్సా సీఈఓ దైహున్ ఖోంగ్లూం ఏఎంఆర్ ప్రాముఖ్యత, దాని నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఉండి మత్స్య పరిశోధనా కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త, అధిపతి డాక్టర్ ఎ. చంద్రశేఖర్ రావు ఎగుమతులు, యాంటీబయాటిక్ అవశేషాలు, యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్ అంశాలపై సాంకేతిక వివరణ ఇచ్చారు. ఎంపీఈడీఏ భీమవరం జేటీఓ ఎస్. దుర్గారావు భారతీయ ఆక్వాకల్చర్‌లో యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్ ప్రభావంపై ప్రజెంటేషన్ ఇచ్చారు. మత్స్యశాఖ భీమవరం ఎఫ్‌డీఓ వివేక్ యాంటీబయాటిక్స్ వినియోగం వల్ల మానవ ఆరోగ్యంపై కలిగే దుష్ప్రభావాలు, ఆక్వాకల్చర్‌లో వాటి వినియోగంతో ఎదురయ్యే సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి డాక్టర్ జి. వరలక్ష్మి, నాక్సా ఎస్‌సీఓ ఎస్. బాలాజీ, ఎఫ్ఎం ఎం. విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. జిల్లాలోని 89 మంది ఆక్వా రైతులు పాల్గొని ఏఎంఆర్ నివారణ, శాస్త్రీయ ఆక్వా సాగు పద్ధతులపై అవగాహన పొందారు. నాక్సా ఎస్‌సీఓ ఎస్. బాలాజీ వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.



పంటల బీమా నమోదులో అర్హులైన రైతులందరికీ అవకాశం కల్పించాలి

జిల్లాస్థాయి పర్యవేక్షణ కమిటీ (డీఎల్ఎంసీ) సమావేశంలో ఇంచార్జి జిల్లా కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ



భీమవరం బ్యూరో చీఫ్ నవంబర్ 23 నంది పత్రిక రబీ 202425, ఖరీఫ్ 2025 పంటల బీమా ప్రీమియం చెల్లించిన రైతుల వివరాలను ఈ-క్రాప్ నమోదుతో సరిపోల్చి క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా ధ్రువీకరించాలని ఇంచార్జి జిల్లా కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ అధికారులను ఆదేశించారు. సోమవారం జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి పర్యవేక్షణ కమిటీ (డీఎల్ఎంసీ) సమావేశంలో ఆమె మాట్లాడుతూ, క్షేత్రస్థాయి ధ్రువీకరణ అనంతరం అర్హులైన రైతుల వివరాలను కమిటీ పరిశీలించి ఆమోదించిన తరువాత ప్రభుత్వానికి పంపించే ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలన్నారు. 2026 పంటల బీమా సీజన్‌కు సంబంధించి ఇప్పటివరకు నమోదైన రైతుల సంఖ్య, ఇంకా నమోదు చేసుకోవాల్సిన అర్హులైన రైతుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అర్హులైన రైతులందరికీ పంటల బీమా పథకంలో భాగస్వామ్యం కల్పించేలా మిగిలిన నమోదు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జి సునీత, వ్యవసాయ శాఖ ఏవో సామ్యూల్ జాన్సన్ కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.



ప్రమాణ స్వీ కార చేస్తున్న కౌన్సిలర్ అభ్యర్థి శ్రీలత,,





ఎమ్మిగనూరు నంది పత్రిక నవంబర్ 23ఎమ్మిగనూరు నియోజకవర్గంలో ఎమ్మిగనూరు పట్టణంలో 4.వార్డు కౌన్సిలర్ అభ్యర్థి శ్రీలత పదవి ప్రమాణ స్వీకారం చేశారు అనంతరం శ్రీలత మాట్లాడుతూ 4.వార్డ్ ప్రజలకు నాకు ఓటు వేసి 281 మెజార్టీతో గెలిపించినందుకు ఎల్లవేళలా రుణపడి ఉంటానని విలేకరులు సమావేశంలో తెలిపారు ఈ కార్యక్రమంలో మహేష్ కుమార్, జైపాల్ (జోష్) టైటాన్స్, అఖిల్, అనిల్ ,వార్డు ప్రజలు సన్మానించారు



మూడో దశ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ పూర్తి

జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

చివరి రోజు 461 సర్పంచ్, 1,546 వార్డు సభ్యుల స్థానాలకు నామినేషన్లు దాఖలు

మూడు రోజుల్లో 1,366 సర్పంచ్, 4,270 వార్డు సభ్యుల నామినేషన్ల నమోదు



కడప, బ్యూరో చీఫ్ నవంబర్ 23 నంది పత్రిక: జిల్లాలో మూడో దశ గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల దాఖలు ప్రక్రియ సోమవారంతో ముగిసిందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. మూడో రోజు చివరి రోజున జిల్లాలోని 13 మండలాల్లో కలిపి సర్పంచ్ స్థానాలకు 461, వార్డు సభ్యుల స్థానాలకు 1,546 నామినేషన్లు దాఖలైనట్లు వెల్లడించారు. మూడు రోజుల నామినేషన్ల వివరాలను పరిశీలిస్తే.. మొదటి రోజు నవంబర్ 21న సర్పంచ్ స్థానాలకు 465, వార్డు సభ్యుల స్థానాలకు 1,120 నామినేషన్లు, రెండో రోజు నవంబర్ 22న సర్పంచ్ స్థానాలకు 440, వార్డు సభ్యుల స్థానాలకు 1,604 నామినేషన్లు దాఖలయ్యాయి. మూడో రోజు నవంబర్ 23న సర్పంచ్ స్థానాలకు 461, వార్డు సభ్యుల స్థానాలకు 1,546 నామినేషన్లు నమోదయ్యాయి. దీంతో మూడు రోజుల్లో కలిపి సర్పంచ్ స్థానాలకు 1,366, వార్డు సభ్యుల స్థానాలకు 4,270 నామినేషన్లు దాఖలైనట్లు జిల్లా కలెక్టర్ వివరించారు.

అట్టహాసంగా మున్సిపల్ చైర్ పర్సన్ షేక్ అనీషా ప్రమాన స్వీకారం

ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ



ఆళ్లగడ్డ ప్రతినిధి నవంబర్ 23, నంది పత్రిక ఆళ్లగడ్డ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్ల ప్రమాణ స్వీకారం సోమవారం అట్టహసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, భార్గవ్ రామ్ దంపతులు, టిడిపి యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి లు హాజరయ్యారు. ముందుగా ప్రీసైడింగ్ అధికారి శ్రీధర్ రెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ షేక్ అనీషా, టిడిపి కౌన్సిలర్లు 22 మంది, జనసేన కౌన్సిలర్లు ఇద్దరి చే ప్రమాన స్వీకారం చేయించారు. అనంతరం ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మాట్లాడుతూ ఆళ్లగడ్డ పట్టణాన్ని 21 కోట్లతో అభివృద్ధి చేస్తామని, అందులో మున్సిపల్ నూతన కార్యాలయాన్ని 3 కోట్లతో నిర్మిస్తామన్నారు. అలాగే ప్రభుత్వ డిగ్రీ కళాశాల బిడింగ్ ల నిర్మాణం, పట్టణంలో రెండు పార్క్ లు నిర్మించ బోతున్నాం అన్నారు. రాబోయే రోజుల్లో మున్సిపాలిటీని ఎంతో అభివృద్ధి చేసి చూపిస్తామని, ఇప్పటికే చాలావరకు డ్రైనేజీలు, సిసి రోడ్లు వేయడం జరిగిందన్నారు. అలాగే మున్సిపల్ కౌన్సిల్ మీటింగ్ కు అందరు హాజరు కావాలన్నారు. మూడుసార్లు కౌన్సిల్ మీటింగ్ కు హాజరు కానివారిని కౌన్సిలర్ నుండి తప్పించడం జరుగుతుందన్నారు. ప్రతి కౌన్సిలర్ తమ వార్డులలోని సమస్యలని కౌన్సిలింగ్ మీటింగ్ లో తెలిపి సమస్యలను పరిష్కరించు కోవాలన్నారు. అందరిని కలుపుకొని, పార్టీలకు అతీతంగా పనులు చేసి ఆళ్లగడ్డను అభివృద్ధి చేసి చూపిస్తానని ఆమె తెలిపారు. అనంతరం చైర్ పర్సన్ షేక్ అనీషా మాట్లాడుతూ మున్సిపల్ చైర్మెన్ పదవిని ప్రజలకు సేవ చేయడానికి ఉపయోగిస్తానని, పట్టణంలోని అన్ని సమస్యలను పరిష్కరించి, ఆళ్లగడ్డ పట్టణాన్ని ఆదర్శంగా నిలబెడతానని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ అబ్జర్వర్ మురళి, కమిషనర్ కిషోర్, ఇంచార్జి శానిటేరి అధికారి బాలస్వామి, టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, జనసేన కార్యకర్తలు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



"రోజూకూర్చుని ఇన్నిపేజీలనిరాస్తూ పోలేను"



ఒక పిల్లాడు తన భోజనాన్ని ఆకలితో ఉన్న ఇంకో పిల్లాడితో ఎందుకు పంచుకోకూడదు అనుకుంటాడు. ఇది నా పదిహేనేళ్ళ వయసులో రాసిన కథల్లో నాకు బాగా గుర్తున్న కథ. అప్పటి నుంచీ రాస్తూనే ఉన్నాను. రాయటంలో నాకు ప్రేరణ మా అమ్మే. చిన్నప్పుడు అమ్మ తన జీవితానుభవాలను కథల్లా చెప్తూండేది. అవన్నీ అప్పుడెప్పుడో జరిగిన విషయాల్లా కాక, కళ్ళముందే జరుగుతున్నట్టు వివరంగా చెప్పేది. అమ్మ నుంచే నాకు కథలు చెప్పటం వచ్చింది అనుకుంటాను. నా ప్రతి పుస్తకం అంతకుముందు పుస్తకం నుంచి వేరుగా ఉండాలి అనుకుంటాను. తెలంగాణ మాండలికంలో 'నల్లగొండ కథలు' రాసాక అందరూ అదే శైలిలో రాయమంటుంటే నేను ఆ ట్రాప్‌లో పడతానేమో అనిపించింది. దాన్నుంచి భిన్నంగా ఏం రాద్దాం అనుకున్నప్పుడు తట్టిన కథ 'ఒక ఎండాకాలపు మధ్యాహ్నం'. ఇది నా మొదటి నవల. ఈ ఏడాదే విడుదలైంది. ఈ మొదటి నవల రాయటానికి ఐదేళ్ళు పట్టింది. నా జీవితానుభవంలోంచే వచ్చిన ఆలోచనలు ఉండటం వల్ల దాన్ని పర్సనల్ స్టోరీ అని చెప్పొచ్చు, అలాగని ఆటోబయోగ్రఫికల్ నవల కాదు. ఆ నవల రాసినన్ని రోజులూ దాని గురించి ఆలోచించడం బావుండేది. రాయలేకపోతున్నప్పుడు లోతైన నిరాశలోకి వెళ్ళిపోయేవాడ్ని. ఆ బాధ కూడా బావుండేది. ఇప్పుడు రాసి బైటపెట్టేశాక ఇక దాని గురించి ఆలోచించడానికి ఏమీ లేదు. లోపలున్నదంతా రాసి బైటకు పంపడం ఒక థెరపీ లాంటిది. ఆ లోపలి విషయాల నుంచి ఇక దూరం జరగవచ్చు అన్నట్టు ఉంటుంది. కథ రాయటం నాకు సులువుగా వస్తుందనుకుంటాను. నవల రాయటం మాత్రం చాలా కష్టంగా అనిపించింది. నేను ప్రతి రోజూ కూర్చుని ఇన్ని పేజీలని లెక్కగా రాస్తూ పోలేను. రాయబోయే కథ పూర్తిగా అర్థమైంది అనుకున్నాకనే, ఇక దానిలోంచి బైటకు రాకుండా నిమగ్నమై రాయగలను అనుకున్నాకనే రాయటం మొదలుపెడతాను. 'ఒక ఎండాకాలపు మధ్యాహ్నం' నవలలో ఏంగర్ ఇష్యూస్, గిల్ట్, రిమోర్స్, ఎగ్జిస్టెన్షియలిజమ్ వంటి థీమ్స్ ఉన్నాయి. వాటన్నిటినీ నేను బాగా అర్థం చేసుకుని, ఒక అవగాహనకు వస్తే కానీ రాయలేననిపించింది. కానీ ఎంత కష్టంగా అనిపించినా, కథలతో పోలిస్తే, నవల రాయటం లోనే ఎక్కువ సంతోషం ఉంది. కథ ఒక విడతలో రాసేస్తే అయిపోతుంది కదా. దానికి భిన్నంగా ఒక నవలని పట్టుకుని ఐదేళ్ళు వేలాడటం నచ్చింది. 'నల్లగొండ కథలు' కాకుండా నా మిగతా పుస్తకాలన్నీ ఫిక్షనే అయినా, వాటన్నిటిలోనూ నేను ఉన్నాను. నా జీవితమూ నా పుస్తకమూ రెండూ కలిసే ఉంటాయి. రచనను దూరంగా చూడలేను. నన్ను నేరుగా తెచ్చి నా రచనల్లో పెట్టుకోవడం పట్ల నాకు ఏ ఇబ్బందీ లేదు. ఎవరైనా వచ్చి ఈ కథ మీదేనా అని అడిగితే నాదే అని చెప్పుకోవటంలో ఇబ్బందేమీ పడను. నా రచనల్లో పూర్తిగా కల్పిత సందర్భాల్ని కూడా ఎవరైనా నాకు ఆపాదించుకున్నా ఇబ్బంది లేదు.

ఏదైనా కథ చెప్తున్నప్పుడు నాలో ఇది చెప్పటానికి కావాల్సినంత నిజాయితీ ఉన్నదా లేదా అని ఆలోచిస్తాను. రాస్తున్నప్పుడు నా నిజాయితీని ఎప్పటికప్పుడు ప్రశ్నించుకుంటూ ఉంటాను. ఈ ప్రశ్న తర్వాత మొదలయ్యే ఆలోచన నన్ను నేను ఇంకా బాగా అర్థం చేసుకోవడానికి పనికొస్తుంది. అలా రచయితగా రాయటం మనిషిగా ఎదగటంలో సహాయపడు తుందనుకుంటాను. ప్రపంచం ఇంత క్రూరమా అనిపిస్తుంది అప్పుడప్పుడూ. నిజాయితీగా రాయటం ఇష్టం అని చెప్పాను కదా. కానీ చుట్టూ ప్రపంచాన్ని చూస్తున్నకొద్దీ ఈ ప్రపంచం ఇంక రిపేర్ చేయటం వీలు కానంత చెడిపోయిందనిపిస్తుంది. నిజం నుంచి పక్కకు తిప్పుకోలేని ఆ చూపే రచయితగా ఉండటంలో కష్టమైన విషయం అనుకుంటాను. కథకు అవసరమనిపించినప్పుడు ఎంత దూరమైనా వెళ్తాను. ఆ విషయంలో అస్సలు రాజీ పడాలనుకోను. సమాజం పోకడకు కట్టుబడి రాయాలనుకోను. ఎవరికైనా అభ్యంతరకరం అనిపించినా ఉన్నది ఉన్నట్టే రాస్తాను. చదివేవాళ్లు ఎలా తీసుకుంటారు అన్నది ఆలోచించను. మనం నమ్మే సిద్ధాంతాలు మన కథల్లో ఏదో ఒక కోణంలో వ్యక్తం అవుతాయి. అలాగాక ఏదో పనిగట్టుకుని చెప్పాలన్నట్టు, జెండా పట్టుకున్నట్టు కథలు రాస్తారు కదా అలాంటి కథలు రాయటం ఇష్టం ఉండదు. నేను చెప్పదల్చుకున్న విషయం కథలో ఇమిడిపోయి ఉంటుంది కానీ, కథ నుంచి బైటకు వచ్చి నిలబడి నేను ఏదీ చెప్పాలీ అనుకోను. కథ రాసి బైటకు పంపేదాకా అది నాకు చాలా పర్సనల్. అది నాకు మాత్రమే సంబంధించినది అనిపిస్తుంది. కథ రాస్తున్నప్పుడు ఎవరికైనా పంపి అభిప్రాయాలూ అడగను. నేను రాయటం మొదలుపెట్టినప్పుడు పబ్లిషింగ్ రంగం అంత ప్రోత్సాహకరంగా ఉండేది కాదు. అసలు ఆ వ్యవస్థ ఎలా పని చేస్తుందో దగ్గరగా వెళ్ళి పరిశీలించాను. వ్యవస్థలోనే లోపం ఉందనిపించింది. దాన్ని నేను సవాలుగా తీసుకున్నాను. అందుకే పబ్లిషర్‌గా కూడా మారిపోయి నా పుస్తకాలు నేనే ప్రచురించుకోవడం మొదలుపెట్టాను. రోజూవారీ జీవితంలో డబ్బున్న, పై స్థాయిలో ఉన్న వాళ్ళ హిపోక్రసీని చూస్తూ, సిగ్గుపడుతూ ఉంటాను. మోరల్ అంబిగ్విటీని నా కథల్లోకి తీసుకురాగలిగాననిపిస్తుంది గానీ, అబ్జల్యూట్ హిపొక్రైట్స్ ఉంటారు, వాళ్ళ గురించి రాయలేననిపిస్తుంది.నేను కచ్చితమైన పొలిటికల్, సోషల్ ఐడియాలజీలతోనే బతుకుతాను. సందర్భం వచ్చినప్పుడు వాటిని ఏ సంకోచమూ లేకుండా నా కథల్లోకి తీసుకురాగలను కూడా. కానీ ఎప్పుడైనా సోషల్ మీడియాలో సమాజంలోని అవినీతిని ప్రశ్నించినప్పుడో, ఏదైనా సామాజిక విషయం పట్ల నేనిలా ఆలోచిస్తున్నానని చెప్పినప్పుడో హిపొక్రైట్స్ అని చెప్పాను కదా, వాళ్ళు పచ్చి బూతులు తిట్టిన సందర్భాలు ఉన్నాయి. అలాంటప్పుడు ఏదైనా రాయడానికి భయపడతాను. ప్రస్తుతం రెండు నవలలకు ఆలోచన ఉంది. ఈమధ్య మా నాన్న చనిపోయిన తర్వాత నేను మరణం గురించి ఎక్కువ ఆలోచిస్తున్నాను. అలాంటి ఆలోచనల్లోంచి పుట్టిన నవల ఒకటి. రెండోది ప్రేమకథ. అలాగే 'ఒక ఎండాకాలపు మధ్యాహ్నం' నవల రాస్తున్న ఐదేళ్ళలో కథలకు ఆలోచనలు వచ్చినా కూడా నవలను మధ్యలో ఆపలేక వాయిదా వేసాను. అవి కూడా రాయాలి. ఒక యాభై ఏళ్ళ తర్వాత ఫలానా మల్లికార్జున్ అనే రచయిత ఉన్నాడు అని నన్ను ఒక పేరుగా గుర్తుంచుకోవటం కంటే, పాఠకులు నన్ను మర్చిపోయి నా పుస్తకాలు చదువుకుంటుంటే ఎక్కువ సంతోషిస్తాను.

మున్సిపల్ కౌన్సిలర్లుగా వైసీపీ అభ్యర్థుల ప్రమాణ స్వీకారం

అభినందించిన గంగుల ప్రభాకర్ రెడ్డి



ఆళ్లగడ్డ ప్రతినిధి నవంబర్ 23, నంది పత్రిక ఆళ్లగడ్డ మున్సిపాలిటీ నూతన కౌన్సిలర్లుగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు సోమవారం ప్రమాన స్వీకారం చేశారు. మున్సిపల్ కార్యాలయంలో ప్రీసైడింగ్ అధికారి శ్రీధర్ రెడ్డి 8 మంది వైసీపీ కౌన్సిలర్లతో ప్రమాన స్వీకారం 4 వార్డ్ సుధాకర్ రెడ్డి, 6వార్డు సింగం భాగ్యలక్ష్మి, 8 వార్డు గౌడ సౌజన్య 9 వార్డు గుత్తి రవళి , 12వ వార్డు జంబులదిన్నెమాబీనా,23 వార్డు పెనుగొండ గంగాదేవి26 వార్డు షేక్ అక్బర్29 వార్డు ఇంజేటి లక్ష్మ ఈశ్వరమ్మ లతో ప్రమాణం చేయించారు. అనంతరం కర్నూలు పార్లమెంట్ పరిశీలకులు గంగుల ప్రభాకర్ రెడ్డి వారిని ప్రత్యేకంగా కలుసుకొని హృదయ పూర్వక అభినందనలు తెలిపారు ఈ కార్యక్రమంలో కూలూరు నరసింహారెడ్డి. సింగం వెంకటేశ్వర్ రెడ్డి వైకాపా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

ఆధ్యాత్మిక సేవలో గరుడ యూత్

- గత కొన్ని సంవత్సరాలుగా అన్నప్రసాద వితరణ..

- సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం

అన్న మహానంది ఎస్ఐ

మహానంది నవంబర్ 23 (నంది పత్రిక):- యువత ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని మహానంది ఎస్సై శివాంజల్ తెలిపారు. మహానంది క్షేత్రంలోని నవనందుల్లో ఒకటిగా విరాజిల్లుతున్న గరుడ నంది ఆలయం వద్ద మహానంది గ్రామానికి చెందిన గరుడ యూత్ ఆధ్వర్యంలో కార్తీకమాసం రెండవ సోమవారం పురస్కరించుకుని భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం నుంచి అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. సుమారు రెండు వేల మంది భక్తులు అన్నప్రసాదాలు స్వీకరించారు. ముఖ్యఅతిథిగా ఎస్ఐ శివాంజల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రముఖ పుణ్యక్షేత్రమైన మహానందిలో కొలువైన శ్రీ కామేశ్వరీ దేవి సహిత మహానందీశ్వర స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తుల ఆకలి తీర్చడం ఎంతో పుణ్యఫలమైన కార్యక్రమం అని కొనియాడారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పెద్దలు భవనాశి ఎల్లయ్య, గరుడ యూత్ సభ్యులు భవనాశి సోమశేఖర్, శ్రీనాథ్, అర్చకులు గరుడ నంది సాయి, సుదర్శన్, లక్ష్మీనారాయణ, ప్రవీణ్ కుమార్ రెడ్డి, విశ్వనాథ్,పాల్గొన్నారు.



షేవింగ్ చేసుకుంటుండగా నీళ్లు బంద్.. దేశాధ్యక్షుడి భవనంలోనూ తప్పని తిప్పలు

అధ్యక్షుడి అధికారిక నివాసంలో ఆగిపోయిన నీటి సరఫరా

గడ్డం చేసుకుంటుండగా నీళ్లు ఆగిపోయాయన్న నైజీరియా అధ్యక్షుడు బోలా టినుబు

రాష్ట్రపతి భవనంలోనూ తప్పని విద్యుత్, తాగునీటి సమస్యలు

గ్యాస్ కొరత, జలవిద్యుత్ క్షీణతతో నైజీరియాలో కొనసాగుతున్న సంక్షోభం

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామంటూ అధ్యక్షుడి భరోసా

చుట్టూ భారీ భద్రత, చేతినిండా అధికారం, సకల సౌకర్యాలతో కూడిన విలాసవంతమైన అధికారిక భవనం.. తీరా ఉదయాన్నే అద్దం ముందు నిలబడి సేవింగ్ చేసుకుంటుంటే కుళాయిలో చుక్క నీరు రాకపోతే? సామాన్యుడికి నిత్యం ఎదురయ్యే ఇలాంటి అనుభవమే స్వయంగా ఓ దేశాధినేతకు ఎదురైతే? వినడానికి కాస్త వింతగా అనిపించినా, నైజీరియా అధ్యక్షుడు బోలా టినుబుకు ఇటీవల సరిగ్గా ఇలాంటి చికాకే ఎదురైంది. తన దేశ ప్రజలు ఏ సమస్యలతో రోజూ సతమతమవుతున్నారో, దేశాధ్యక్షుడిగా తానూ అదే అనుభవాన్ని చవిచూశానని ఆయన స్వయంగా వెల్లడించారు.లాగోస్‌లో ఆదివారం జరిగిన ఒక కుటుంబ ప్రార్థనా సమావేశంలో అధ్యక్షుడు బోలా టినుబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన అధికారిక నివాసమైన 'అసో రాక్' భవనంలో ఎదురైన చేదు అనుభవాన్ని పంచుకున్నారు. గత బుధవారం తాను షేవింగ్ చేసుకుంటుండగా అకస్మాత్తుగా నీటి సరఫరా నిలిచిపోయిందని చెప్పారు. "రాష్ట్రపతి భవనంలోనూ ఇలాంటి ఇబ్బందులు ఉంటాయని చాలామందికి తెలియదు. ఆ సమయంలో నీళ్లు ఆగిపోయాయి. ఈ లోపాలన్నింటినీ మేము సరిదిద్దుతాం. వెలుగు లేదు, నీళ్లు లేవు, విద్యుత్ లేదు అంటే అభివృద్ధి ఎలా సాధ్యమవుతుంది? ఇప్పుడే మా ప్రయాణం మొదలైంది. సమస్యలన్నింటినీ కచ్చితంగా అధిగమిస్తాం.. నైజీరియా కోసం చేసి చూపిస్తాం" అని టినుబు స్పష్టం చేశారు.అబూజాలోని 'అసో విల్లా' (అసో రాక్) నైజీరియా అధ్యక్షుడి అధికారిక నివాసంతో పాటు పరిపాలనా కేంద్రంగా వ్యవహరిస్తోంది. దేశంలోనే అత్యున్నత ప్రాంగణమైన ఈ భవనానికి నిరంతర విద్యుత్ కోసం గత ఏడాది సుమారు 10 బిలియన్ నైరాలను (దాదాపు 7.2 మిలియన్ డాలర్లు) ఖర్చు చేసి సోలార్ మినీ-గ్రిడ్‌ను ఏర్పాటు చేశారు. జాతీయ గ్రిడ్‌పై ఆధారపడకుండా విల్లాకు ప్రత్యేకంగా విద్యుత్ అందించేందుకు ప్రస్తుతం దీనిని పరీక్షిస్తున్నారు. అయినప్పటికీ అక్కడ విద్యుత్, నీటి కొరత తలెత్తడం గమనార్హం. నైజీరియాలో ప్రస్తుతం విద్యుత్ కోతలు పెరిగిపోవడానికి గ్యాస్ సరఫరాలో కొరత, జలవిద్యుత్ ఉత్పత్తి పడిపోవడమే ప్రధాన కారణాలని అధికారులు చెబుతున్నారు. ప్రధాన గ్రిడ్ పూర్తిగా కుప్పకూలకపోయినప్పటికీ, లాగోస్, అబూజా వంటి ప్రధాన నగరాల్లో విద్యుత్ పంపిణీ సంస్థలు రొటేషన్ పద్ధతిలో కోతలు విధిస్తున్నాయి. మరోవైపు పట్టణాలు వేగంగా విస్తరిస్తున్నప్పటికీ, అందుకు తగ్గట్టుగా పైపులైన్లు, శుద్ధి కేంద్రాలు లేకపోవడంతో తాగునీటి ఎద్దడి ప్రజలను తీవ్రంగా వేధిస్తోంది. ఈ పరిణామం నైజీరియా రాజకీయాల్లోనూ చర్చనీయాంశంగా మారింది. 2022 నాటి ఎన్నికల ప్రచారంలో టినుబు మాట్లాడుతూ.. "ఎలాగైనా సరే దేశంలో విద్యుత్ సరఫరాను మెరుగుపరుస్తాం. ఈ హామీని నెరవేర్చకపోతే రెండోసారి నన్ను ఎన్నుకోవద్దు" అని బహిరంగంగా ప్రకటించారు. ఇప్పుడు 2027 జనవరి 16న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఆయన మళ్లీ పోటీకి సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో అధ్యక్ష భవనానికే విద్యుత్, నీళ్లు సరిగా లేకపోవడం ఆయన పాలనా వైఫల్యానికి నిదర్శనమని ప్రధాన ప్రతిపక్ష నాయకులు అతికు అబూబకర్, పీటర్ ఒబి వర్గాలు విమర్శిస్తున్నాయి. అయితే, గ్రామీణ ప్రాంతాల్లో సరఫరా మెరుగుపడిందని, విద్యుత్ సరఫరా వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఇటీవల 2 బిలియన్ డాలర్ల వ్యయంతో 'ఈస్ట్-వెస్ట్ సూపర్ గ్రిడ్' ప్రాజెక్టును ఆమోదించామని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.



‘ఆలోచన‘ ట్రైలర్‌ను విడుదల చేసిన చిరంజీవి.. కీలక పాత్రలో సుధాకర్ తనయుడు బెన్నీ

వృద్ధాప్య సమస్యలు, కుటుంబ సంబంధాలు, పెద్దల మనోభావాల నేపథ్యంతో తెరకెక్కిన సరికొత్త తెలుగు చిత్రం ‘ఆలోచన’. ఈ సినిమా అధికారిక థియేట్రికల్ ట్రైలర్‌ను మెగాస్టార్ చిరంజీవి నేడు విడుదల చేశారు. ఈ సందర్భంగా చిత్ర బృందానికి ఆయన శుభాకాంక్షలు తెలుపుతూ సినిమా మంచి విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఆలోచన చిత్రంలో సీనియర్ నటుడు సుధాకర్ తనయుడు బెన్నీ కీలక పాత్ర పోషిస్తుండడం విశేషం.



ఈ చిత్రానికి సురేందర్ చాచా దర్శకత్వం వహించగా, ప్రదీప్ కుమార్ మరియు శ్రీనివాస్ గుండబోయిన సంయుక్తంగా నిర్మించారు. వియాన్ ఎస్.ఎ. సంగీతం సమకూర్చారు. సీనియర్ నటులు జి.వి. నారాయణరావు, నరసింహరాజు, ప్రసాద్ బాబు, మహర్షి రాఘవ, జయలలిత తదితరులు ప్రధాన పాత్రల్లో నటించారు. ట్రైలర్ ఆద్యంతం కుటుంబ అనుబంధాలు, నేటి సమాజంలో వృద్ధులు ఎదుర్కొంటున్న మానసిక సంఘర్షణలను హృద్యంగా ఆవిష్కరించినట్లు కనిపిస్తోంది.ఈ సినిమాకు సెన్సార్ బోర్డు ‘యు/ఎ’ (ఖ/ూ) సర్టిఫికెట్ మంజూరు చేసింది. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసుకున్న ‘ఆలోచన’ చిత్రం నవంబర్ 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ సీనియర్ సిటిజన్ల కోసం ఒక ప్రత్యేక నిర్ణయాన్ని ప్రకటించింది. 60 ఏళ్లు పైబడిన వారు సరైన గుర్తింపు కార్డును చూపించి, నవంబర్ 27, 28 మరియు 29 తేదీల్లో ఈ చిత్రాన్ని థియేటర్లలో ఉచితంగా వీక్షించవచ్చని నిర్మాతలు తెలిపారు. సమాజానికి ఒక మంచి సందేశాన్ని ఇచ్చే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చిత్ర బృందం పేర్కొంది. కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రంగా రూపొందిన ‘ఆలోచన’ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటుందని మేకర్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. కాగా, ఈ చిత్రంలో నటించిన ప్రసాద్ బాబు, నారాయణరావు.. చిరంజీవికి సన్నిహితులని తెలిసిందే. అంతేకాదు, యువ నటుడు బెన్నీ తండ్రి సుధాకర్ కూడా చిరంజీవికి సన్నిహితుడే.

‘మయూఖ’ (జియో హాట్ స్టార్) మూవీ రివ్యూ!

సస్పెన్స్ థ్రిల్లర్ సినిమాల పట్ల ఆడియన్స్ విపరీతమైన ఆసక్తిని చూపిస్తుంటారు. సస్పెన్స్ థ్రిల్లర్ సినిమాలకి రిపీట్ ఆడియన్స్ ఉండరని అంటారు. అయితే టేకింగ్ బాగుంటే, ఈ తరహా సినిమాలను మళ్లీ మళ్లీ చూడటానికి కుతూహలాన్ని కనబరుస్తూ ఉంటారు. అలాంటి జోనర్ లో రూపొందిన ‘మయూఖ’, అక్టోబర్ 9వ తేదీన థియేటర్లకు వచ్చింది. పెద్దగా పబ్లిసిటీ లేకుండా విడుదలైన ఈ సినిమా, ఈ నెల 20వ తేదీ నుంచి ‘జియో హాట్ స్టార్’లో స్ట్రీమింగ్ అవుతోంది.ీయూఖ (పాయల్ చెంగప్ప) ఒక ఫ్లాట్ లో రెంట్ కి ఉంటూ, ప్రైవేట్ బ్యాంకులో పనిచేస్తూ ఉంటుంది. ఆ బ్యాంకుకి మేనేజర్ గా వినయ్ ఉంటాడు. హనీ .. అభిరామ్ కూడా మయూఖతో కలిసి పనిచేస్తూ ఉంటారు. ఆ బ్యాంకుకి సెక్యూరిటీగా రవి ఉంటాడు. మయూఖకి ఫైర్ అంటే చాలా భయం. అంతేకాదు తరచూ ఆమెకి ఒక చిత్రమైన కల వస్తుంటుంది. అంతేకాదు తనతో పాటు ఆ రూమ్ లో ఎవరో ఉన్నట్టుగా, రాత్రివేళలో తన ఫ్లాట్ డోర్ ఓపెన్ చేయడానికి ఎవరో ప్రయత్నిస్తున్నట్టుగా అనిపిస్తూ ఉంటుంది. కార్పెంటర్ ‘కుమార్’ అనే వ్యక్తి, మయూఖ కోసం బ్యాంకు చుట్టూ తిరుగుతూ ఉంటాడు. తనతో కలిసి కాఫీకి రమ్మంటూ టార్చర్ చేస్తుంటాడు. ఇక బ్యాంకు సెక్యూరిటీ గార్డుగా ఉన్న రవి కూడా మయూఖను వంకరగా చూస్తుంటాడు. ఈ సమస్యలే ఆమెను సతమతం చేస్తుంటే, అభిరామ్ కూడా ఆమెకి తలనొప్పిగా తయారవుతాడు. ఒకసారి మయూఖ ఒంటరిగా ఉన్న సమయంలో ఆమె ఫ్లాట్ కి వచ్చిన అభిరామ్, ఆమెతో అసభ్యంగా ప్రవర్తిస్తాడు. ఆమె అతణ్ణి ఫ్లాట్ లో బంధించి పోలీసులను రప్పిస్తుంది. పోలీసులు వచ్చేలోగా అభిరామ్ చనిపోతాడు. ఇది ఎలా జరిగిందనేది అర్థంకాక మయూఖ అయోమయంలో పడిపోతుంది. అప్పటి నుంచి పోలీస్ ఆఫీసర్ శ్రీధర్ పర్యవేక్షణలో, మిగతా పోలీసులు ఆమె కదలికలను కనిపెడుతూ ఉంటారు. అయితే అభిరామ్ హత్యకి గల కారణాలు తెలుసుకోవడానికి ప్రయత్నిస్తున్న సమయంలో, ముసుగులో ఉన్న సైకో కిల్లర్ ను మయూఖ చూస్తుంది. ఆ సైకో కిల్లర్ దగ్గర ఒక చిత్రమైన సెంటు వాసన వస్తుందని శ్రీధర్ కి మయూఖ చెబుతుంది. ఆ సైకో కిల్లర్ ఎవరు? అతని దగ్గర ఒక రకమైన సెంటువాసన రావడానికి కారణం ఏమిటి? అనేదే మిగతా కథ. సాధారణంగా సైకో కిల్లర్ చేసే హత్యలు దాదాపు ఒకే మార్క్ ను కలిగి ఉంటాయి. తన మార్క్ ఏమిటనేది హంతకుడు తెలియజేయడానికే ప్రయత్నిస్తూ ఉంటాడు. అలాంటి ఒక పద్ధతిని ఫాలో అవుతూ వచ్చిన కథనే ఇది. సైకో కిల్లర్ చేసే వరుస హత్యలు .. అతని దగ్గర చిత్రమైన సెంటు వాసన రావడానికి కారణం ఏమై ఉంటుందా అనే ఒక ఆసక్తిని రేకెత్తిస్తూ దర్శకుడు ఈ కథను తయారు చేసుకున్నాడు. ఫస్టాఫ్ లో దర్శకుడు ఒక బ్యాంకులోని కొంతమంది ఉద్యోగులను కొన్ని పాత్రలుగా పరిచయం చేస్తాడు. ఈ పాత్రలను కలుపుకుంటూనే కథ కదలడం మొదలవుతుంది. విలక్షణమైన స్వభావం కలిగిన ఈ పాత్రల ద్వారానే ఆడియన్స్ ఉత్కంఠను పెంచడానికి తనవంతు ప్రయత్నం చేశాడు. ఇక సెకండాఫ్ లోని కథ మాత్రం, బ్యాంకు ఉద్యోగులను దాటుకుని బయటికి వెళుతుంది. ఒక కొత్త ప్రపంచంలో ఈ తతంగమంతా జరుగుతుంది. ఒక వైపున మయూఖకి వచ్చే కల .. ఆమెను వెంటాడుతున్న అనుభవాలు, తన చుట్టూ ఉన్న వ్యక్తులపై తనకి గల అనుమానాలు .. పోలీసుల ఇన్వెస్టిగేషన్ కి సంబంధించిన సన్నివేశాలు ఆడియన్స్ లో కుతూహలాన్ని కలిగిస్తూ వెళతాయి. సెకండాఫ్ లో, సైకో కిల్లర్ కి సంబంధించిన ఫ్లాష్ బ్యాక్ తాలూకు సన్నివేశాలు చోటుచేసుకుంటాయి. ఈ రెండింటికీ ముడివేసిన విధానమే ఇక్కడ ప్రధానంగా ఆకర్షించే మంత్రమని చెప్పాలి. అదే డీలాపడిపోయేలా ఉండటమే ఇక్కడ సమస్య. సస్పెన్స్ థ్రిల్లర్ కి సంబంధించిన కథలలో, చుట్టూ ఉన్న పాత్రలపై అనుమానాలు కలిగేలా చేయడం రొటీన్ గా కనిపిస్తూ ఉంటుంది. ఈ సినిమా విషయంలోను అదే పద్ధతిని అనుసరిస్తూ వెళ్లారు. ఇక సెకండాఫ్ ను కిల్లర్ కి సంబంధించిన ఫ్లాష్ బ్యాక్ నిలబెట్టవలసి ఉంటుంది అనుకున్నప్పుడు, సహజత్వానికి దూరంగా ఈ ఎపిసోడ్ తెరపైకి వస్తుంది. ఒక వ్యక్తిని సైకోగా మార్చే కారణం చాలా బలహీనంగా అనిపిస్తుంది. ప్రీ క్లైమాక్స్ లోని ట్విస్ట్ పెద్దగా ప్రభావం చూపించదు. ప్రధానమైన పాత్రను పోషించిన పాయల్ చెంగప్పతో పాటు, మిగతా పాత్రలలో కనిపించిన వాళ్లంతా యావరేజ్ నటనను కనబరిచారు. ఫొటోగ్రఫీ .. నేపథ్య సంగీతం ఫరవాలేదు. ఎడిటింగ్ విషయానికి వస్తే, సైకో పాత్ర తాలూకు ఫ్లాష్ బ్యాక్ సన్నివేశాలను ట్రిమ్ చేసుకోవచ్చునని అనిపిస్తుంది. రొటీన్ సీన్స్ తో పాటు, అంతగా పట్టుకోని ఫ్లాష్ ఎపిసోడ్ కారణంగా ఈ సినిమా ఓ



మాదిరి కంటెంట్ గానే కనిపిస్తుంది.

ప్రేమ, బ్రేకప్ రెండూ కష్టమేనంటున్న మీనాక్షి చౌదరి


టాలీవుడ్ హీరోయిన్ మీనాక్షి చౌదరి తనదైన చలాకీ మాటలతో మరోసారి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. నాగచైతన్య హీరోగా నటిస్తున్న తాజా చిత్రం ‘వృషకర్మ’ ప్రమోషన్లలో చురుగ్గా పాల్గొంటున్న ఆమె, తన వ్యక్తిగత జీవితంపై చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి.సినిమా ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో యాంకర్... ‘ప్రస్తుతం మీకు ఎవరిపైనైనా క్రష్ ఉందా?’ అని మీనాక్షిని ప్రశ్నించారు. దీనికి ఆమె ఏమాత్రం తడుముకోకుండా నవ్వుతూ బదులిచ్చారు. “నాకు ఎవరిపైనా ఎలాంటి క్రష్ లేదు.. అసలు నా జీవితమే క్రష్ అయిపో యింది (నలిగిపోయింది)” అంటూ చమత్కరించారు. వరుస ప్రాజెక్టులు, తీరికలేని షూటింగులు, ప్రమోషన్స్ వల్ల వ్యక్తిగత జీవితానికి సమయం కేటాయించలేకపోతున్న విషయాన్ని ఆమె ఈ విధంగా సరదాగా వివరించారు. అలాగే ప్రేమ, రిలేషన్‌షిప్‌లపై అడిగిన మరో ప్రశ్నకు స్పందిస్తూ.. “నాకు తెలియదు కానీ.. ప్రేమలో పడటం, బ్రేకప్ నుంచి బయట పడటం రెండూ కష్టమే” అని మీనాక్షి వ్యాఖ్యానించారు. ‘లక్కీ భాస్కర్’, ‘సంక్రాంతికి వస్తున్నాం’ వంటి విజయాలతో మంచి జోరుమీదున్న ఈ బ్యూటీ, ప్రస్తుతం తన పూర్తి దృష్టిని సినిమాలపైనే పెట్టినట్లు స్పష్టమవుతోంది. కార్తీక్ వర్మ దండు దర్శకత్వంలో, శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర మరియు సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న సూపర్ నేచురల్ థ్రిల్లర్ ‘వృషకర్మ’ డిసెంబర్ 4న ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్ర ట్రైలర్‌ను నవంబర్ 25న నెల్లూరులో ఘనంగా విడుదల చేసేందుకు చిత్ర బృందం ఏర్పాట్లు చేస్తోంది.



రావణ తాండవం కోసం 13 ట్యూన్లు మార్చారా?

‘రామాయణ’పై ఏఆర్ రెహమాన్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్!

దర్శకుడు నితీష్ తివారీ తెరకెక్కించిన పౌరాణిక దృశ్యకావ్యం ‘రామాయణ’ గురించి మ్యూజిక్ డైరెక్టర్, ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ ఆసక్తికర విషయాలు వెల్లడించాడు. ఈ సినిమా కోసం ఏకంగా 10 నుంచి 12 సినిమాలను వదులుకున్నట్లు తెలిపాడు. ప్రముఖ హాలీవుడ్ లెజెండరీ సంగీత దర్శకుడు హాన్స్ జిమ్మర్‌తో కలిసి గత మూడేళ్లుగా ఈ ప్రాజెక్ట్ మీదే పూర్తి దృష్టి సారించినట్లు వెల్లడించాడు. గోవాలో జరుగుతున్న భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవాల (ఇఫీ) వేదికగా విలేకరుల సమావేశంలో మాట్లాడిన రెహమాన్.. ఈ సినిమా సంగీతం వెనుక సాగిన శ్రమను పంచుకున్నాడు. ముఖ్యంగా సినిమాలో రాక్షసరాజు రావణుడికి సంబంధించిన ‘రావణ తాండవం’ ట్రాక్ కోసం ఏకంగా 12 నుంచి 13 రకాల వెర్షన్లను కంపోజ్ చేసినట్లు రెహమాన్ తెలిపాడు. “గత మూడేళ్లుగా మేం రామాయణ థీమ్స్, పాటలపై పనిచేస్తున్నాం. కొన్నింటికి డజనుకు పైగా వెర్షన్లు సిద్ధం చేయాల్సి వచ్చింది. అందులో ‘రావణ తాండవం’ కోసం 12-13 వెర్షన్లు చేశాక గానీ అందరికీ నచ్చిన ఒక పర్ఫెక్ట్ ట్యూన్ కుదరలేదు” అని చెప్పాడు. ఈ ప్రాజెక్ట్ మూడ్‌లో నుంచి బయటకు రాకూడదనే ఉద్దేశంతోనే పలువురు అగ్ర దర్శకుల ప్రాజెక్టులను వదులుకున్నానని, ఇందుకు తనకు ఎంతో గర్వంగా ఉందని పేర్కొన్నాడు. భారతీయ సంప్రదాయ సంగీతాన్ని, ఆధునిక ప్రపంచ సంగీత ధోరణులతో మేళవించడం ఒక సవాలని రెహమాన్ అభిప్రాయపడ్డాడు. కాగా, రణ్‌బీర్ కపూర్ రాముడిగా, సాయి పల్లవి సీతగా, కన్నడ స్టార్ యశ్ రావణుడిగా నటించిన ఈ చిత్రం రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు వస్తోంది. మొదటి భాగానికి రెహమాన్, హాన్స్ జిమ్మర్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, పాటలు ప్రధాన బలంగా నిలిచాయని ప్రశంసలు దక్కుతున్నాయి.



printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com